కాగితము కరువువల్ల యువ ప్రచురణలు కొద్ది కాపీలే ముద్రిస్తున్నాము. కాన ప్రతి ఏజంటుకు మేము కావలసినన్ని కాపీలు సప్లయి చేయలేక పోవచ్చును. అట్టి పరిస్థితిలో పాఠకులు తమ కాపీని మిత్రులకు కూడా ఇచ్చి మా కృషిని సార్థకము చేసెదరని భావించుచున్నాము.

దేవదాసు

రచయిత :

శరత్ చంద్ర చటర్జీ

అనువాదం :

'చక్రపాణి'

యువ బుక్ డిపో

మద్రాసు :: తెనాలి

యువ ప్రచురణ :

మూడవ ముద్రణ :

ముద్రణ :

బి. ఎన్. కె. ప్రెస్,

43, ఆచారప్పన్ వీధి, జి. టి. మద్రాసు.

దేవదాసు

13858

వైశాఖమాసంలో ఒకనాటి మధ్యాహ్నన ఎండ మహా తీక్ష్ణంగా ఉన్నది. ఇక తాపం చెయ్యశక్యమే కాదు. సరిగ్గా ఇలాంటి సమయాన ముఖర్జీల వారి అబ్బాయి దేవదాసు పాఠశాలలో ఒక మూలను చింకి చాపపై కూర్చుని, కళ్లు మూస్తూ తెరుస్తూ, కాళ్ళు చాపి, పలక క్రింద పెట్టి, ఆవలించి, చివరకు మహా ఆలోచనలో పడిపోయాడు. పడి, ఇలాంటి చక్కటి సమయాన గాలి పటం ఎగరవేసుకుంటూ పొలాలమీద తిరగటానికి బదులు పాఠశాలలో కట్టుబడి వుండడం ఏమాత్రం మంచిది కాదని స్థిరపరుచుకున్నాడు. ఊర్వర మస్తిష్కంలో చప్పున ఒక యుక్తికూడా అంకురించింది. పలక చేత పుచ్చుకుని లేచి నిలబడినాడు.

ఇప్పుడు మధ్యాహ్న భోజనానికి బడి వదలిపెట్టారు. పాఠశాలకు సమీపంలోనే ఉన్న మర్రిచెట్టుక్రింద పిల్లలు గోలచేస్తూ బిళ్లగోళ్లు ఆడుతున్నారు. దేవదాసు ఒకమాటు అటు చూశాడు. మధ్యాహ్న భోజనానికి అతన్ని వదలిపెట్టరు. ఎందుకంటే, బడినుంచి బయటపడిన తర్వాత, మరల దానిలో ప్రవేసించటానికి దేవదాసు ఎంతమాత్రమూ ఇష్టపడ డని గోవింద పండితుడు అనుభవంమీద గ్రహించాడు. పైగాఅతని తండ్రి నిషేధంకూడా ఉన్నది. ఈ కారణా లన్నిటిచేతా, అతను, ఈ సమయంలో బడి పెద్ద 'భోలా' అవార్తిలో ఉండవలసి వచ్చింది.

పాఠశాల్లో ఇపుడు పంతులుగారు ఒక్కరుమాత్రం మధ్యాహ్నపు అలసట చేత కళ్లుమూసుకొని పండుకొని ఉన్నారు. బడి పెద్ద భోలా ఒక మూలను వీపూ కాళ్ళూ విరిగిన బెంచీమీద చిన్న పంతులుగారి కీవితో కూర్చుని, మధ్య మధ్య మహా నిర్లక్ష్యంగా ఒకమాటు పిల్లలకేసి చూస్తూ మరోమాటు దేవదాసూ పార్వతులమీద యాదృచ్ఛికంగా ఒక చూపు పారవేస్తూ ఉన్నాడు. పార్వతి రెండు మూడు మాసాల క్రిందటనే పంతులుగారి అదుపు ఆజ్ఞలలోకి వచ్చింది. బహుశా, ఈ కొద్దికాలంలోనే పంతులుగారు ఆ పిల్ల మనస్సును రంజింపజేసి ఉండవచ్చును. అందుచేతనే, ఆ పిల్ల ఏకాగ్రచిత్తంతోనూ, నిరతిశయ ధైర్యంతోనూ, నిద్రిస్తూ ఉన్న పంతులుగారి చిత్రాన్ని

బాలశిక్ష చివరి పేజీ మీద సిరాతో గీస్తూ అప్పుడప్పుడు, దక్ష చిత్రకారిణి వలె—తాను మహా శ్రద్ధతో గీస్తూ ఉన్న చిత్రంలో తన ఆశయా లెంతవరకు ఫలించాయా అని—అటూ ఇటూ వంగి చూస్తూ ఉన్నది. ఎక్కువ ఫలించిం దనటానికి వీలు లేదు; కాని అంతకే పార్వతి మహా ఆనందమూ, తృప్తీ, అనుభవిస్తూ ఉన్నది.

ఈ సమయంలోనే దేవదాసు పలక చేతపుచ్చుకొని లేచి నిలబడి, భోలాను ఉద్దేశించి బిగ్గరగా—'లెక్క కుదరటంలేదు' అని అన్నాడు.

'ఏ లెఖ్ఖ?' అని భోలా శాంత గంభీర స్వరంతో అడిగాడు.

'మణుగు లెఖ్ఖ—'

'పలకేదీ—'

దీని అర్థం ప్రతి విషయానికీ పలక తనకు తెచ్చి చూపించమని. దేవదాసు పలక చేతికిచ్చి దాపునే నిలబడ్డాడు. భోలా బిగ్గరగా అంటూ వ్రాయ నారంభించాడు: 'ఒక మణుగు నూనె ధర పద్ధానుగు రూపాయలా, తొమ్మి దణాలా, మూడు పైసలై తే—'

ఈ సమయంలోనే ఒక ఘటన ఘటిల్లింది. కాళ్లూ వీపూ విరిగిన ఈ బెంచీని, బడిపెద్ద భోలా తన పదవికి తగిన ఆసనంగా నిర్ణయించుకుని; నియమం తప్పకుండా ఇప్పటికి మూడు సంవత్సరాల నుంచీ కూర్చుంటూ వస్తున్నాడు. బెంచీకి వెనక ఒక పొడిసున్న పురాసి వున్నది. పంతులుగారు దీన్ని ఎప్పుడో, ఏ యుగంలోనో చాక ధరకు కొని అట్టేపెట్టారు. రోజులు సవ్యంగా ఉంటే దీనితో గట్టిగొంప వేయించాలని వీరి ఉద్దేశము. ఆ శుభముహూర్తం ఎప్పుడు వస్తుందో తెలియదు కాని, ఈ శ్వేత చూర్ణం మీద వీరికి శ్రద్ధా, యావా మాత్రం విపరీతంగా ఉండేది. అపరిణామ దర్శులూ, ప్రపంచ జ్ఞానశూన్యులూ అయిన విద్యార్థులు దీనిలో ఒక్క రేణువుకూడా నష్టం చేయకుండా ఉండ గలందులకు, తనకు ప్రియ పాత్రుడూ, అందరిలోకీ వయసుకు కొంచెం పెద్దా అయిన భోలానాథునికి—తాను మహా యత్నంతో కూడబెట్టిన వస్తువును—జాగర్తగా కనిపెట్టి ఉండే భారం వప్పగించాడు. అందుచేతనే భోలా ఈ బెంచీమీద కూర్చుంటూ ఉండేవాడు.

భోలానాథుడు వ్రాస్తున్నాడు:—'ఒక మణుగు నూనె ధర పద్దానుగు రూపాయలా, తొమ్మిదణాలా, మూడు పైసలై తే—అమ్మనాయనో'—తర్వాత పెద్ద గందరగోళం అయింది. పార్వతి బిగ్గరగా చీత్కారంచేసి, చప్పట్లు కొట్టుతూ నేలమీద పొర్ల నారంభించింది. నిద్రా భంగం కావటంచేత, గోవింద పండితుడు రక్త నేత్రాలతో చివుక్కుమని లేచి నిలుచున్నాడు. చెట్టు క్రింద ఉన్న పిల్లలు వరుసగా నిలబడి 'భక్ భక్'మంటూ పరుగెత్తుతూ వీరి కంటపడ్డారు. అటునుంచి దృష్టి మరల్చి పాఠశాలలో చూశాడు—విరిగి పోయిన బెంచీ మీద ఒక జోడు కాళ్లు ఆడుతూ ఉన్నాయి; సున్నం మధ్య నుంచి అగ్నిపర్వతంలోంచి వచ్చినట్టుగా పొగ వస్తూ ఉన్నది.

'ఏంటి ? ఏంటి ? ఏంటిరా ?' అని వారు కేక పెట్టారు.

చెప్పటానికి అక్కడ మిగిలింది దల్లా పార్వతి. కాని, ఇంకా ఆ పిల్ల నేల మీద పొర్లుతూ చప్పట్లు కొట్టుతూ ఉన్నది, పంతులుగారి విఫల ప్రశ్న, క్రుద్ధభావంతో—'ఏంటి ? ఏంటి ? ఏంటిరా ?' అని తిరిగి వచ్చింది. తర్వాత శ్వేతమూర్తి భోలానాథుడు సున్నం పడ నెట్టుకొని లేచి నిలబడ్డాడు. పంతులు గారు మరల చీత్కారం చేశారు: 'కోతి వెధవా ! నువ్వేనా దాంట్లో ?'

'ఊఁ—ఊఁ—ఊఁ—'

'మళ్లీ ?'

'దేవాయ్—పడేసి—ఊఁ—ఊఁ—మణుగు లెఖ్ఖ—'

'పైగా పితుర్లా !'

కాని తర్వాత సంగతంతా గ్రహించి చాపమీద కూర్చుని — 'దేవాయ్ పడేసి పారిపోయాడా ?' అని అడిగాడు.

'ఊఁ, ఊఁ, ఊఁ' అని భోలా పెద్దపెట్టున ఏడ్చాడు.

తర్వాత కాసేపు సున్నం దులిపారు. కాని తెలుపు పూర్తిగా పోకపోవ డంచేత నల్లని భోలా భూతం మాదిరిగా కనిపించ నారంభించాడు. అప్పటికీ వాడి ఏడుపు తగ్గలేదు.

'నిజంగా దేవాయేనా పడేసి పారిపోయింది?' అని పంతులు అడిగాడు.

'ఊఁ—ఊఁ—'

'వాడి పని చెపుతాలే!'

'ఊఁ—ఊఁ—'

'మిగతా వెధవ లేరీ?'

పిల్లలు కొందరు జేవురించిన ముఖాలతో రొప్పుకుంటూ వచ్చి దేవదాసు చిక్కలేదని చెప్పారు.

ఒకడు—'అబ్బా, రాయి ఎంత గురిగా—'

పంతులు—'చిక్కనే లేదా?'

ఇంకో కుర్రవాడు వెనకటివాడి మాటనే ప్రతిధ్వనించ బోయాడు:

'అబ్బా రాయి—'

'నువ్వూరుకోరా వెధవా—'

వాడు మాటదిగమింగి పక్కకుపోయి నిలబడ్డాడు. నిష్ఫల క్రోధంచేత మొదట పంతులు పార్వతిని బెదరించాడు. తర్వాత, భోలానాథుని చేయి పట్టుకుని—'పద, ఒకమాటు కచేరీ చావిడికి పోయి కనపడివద్దాము' అన్నాడు. దీని అర్థం ఏమిటంటే, జమీందారు నారాయణ ముఖర్జీ గారి దగ్గరికిపోయి వారి కొడుకుమీద ఫిర్యాదు చేద్దామని.

అప్పుడు మూడు గంటలై ఉంటుంది. జమీందారు నారాయణ ముఖర్జీ గారు పంచసాలలో కూర్చుని హుక్కా తాగుతున్నారు. నౌకరొకడు విసన కర్రతో విసురుతున్నాడు. విద్యార్థులను వెంట పెట్టుకొని వేళ కాని వేళను పంతులు రావడం చూసి నారాయణబాబు కొంచెం విస్మితుడై—'గోవిందుడా?' అని అన్నాడు. గోవిందుడు కాయస్థుడు. నేలకు వంగి నమస్కరించి, భోలాను చూపించి, సంగతంతా సవిస్తారంగా వర్ణించాడు.

ముఖర్జీ గారు విరక్తుడై—'అదే, చూస్తే దేవాయ్ చెయ్యిమిగిలిపోయేటట్టుగా ఉన్నాడు!' అన్నాడు.

'ఏమి చేయమంటారో తమరే సెలవివ్వండి.'

నారాయణబాబు హుక్కాగొట్టం క్రింద పెట్టి 'వాడు ఎక్కడికి వెళ్ళాడు?' అని అడిగాడు.

'నా కెలా తెలుసునండీ? పట్టుకోబోయినవాళ్లను రాళ్లతో కొట్టాడట.'

కాసేపు ఇద్దరూ మాట్లాడలేదు. తర్వాత నారాయణబాబు 'ఇంటికివచ్చాక ఏదో వొకటి చేస్తా'నని చెప్పి పంతుల్ని పంపించాడు.

గోవింద పండితుడు కుర్రవాడి చేయిపట్టుకుని పాఠశాలకు తిరిగివచ్చి కళ్లతోనూ, ముఖంతోనూ, నానావిధ భావభంగులతోనూ, పిల్లకాయల నందరినీ, భయపెట్టి—'దేవదాసుతండ్రి ఈ ప్రాంతానికి జమీందారయితే అయ్యాడు, కాని వాణ్ణిమాత్రం ఇక బళ్లో అడుగుపెట్టనివ్వ'నని ప్రతిజ్ఞచేశాడు. ఆ రోజున బడి మామూలుకింటే కొంచెం ముందుగానే వదిలిపెట్టాడు. దోవను వెళ్లేటప్పుడు కుర్రవాళ్ళు ఈ విషయమే చర్చింప నారంభించారు.

ఒకడు—అబ్బ! దేవాయి ఎంత పొగరుబోతురా!

ఇంకొకడు—భోలాకు బాగా బుద్ధిచెప్పాపురా!

మరొకడు—అబ్బ ఏం గురిరా!

వేరొకడు భోలాను సమర్థించాడు:—చూస్తావుగా, భోలా తప్పకి వాడిపని పడతాడు.'

'హుష్, వాడిక బళ్లోకివ స్తేగా ఏమన్నా చేయటానికి ?'

ఈ పిల్లల గుంపుకు ఒక పక్కగా పలకా పుస్తకాలూ చేతపట్టుకొని పార్వతికూడా ఇంటికి వస్తూ ఉన్నది. ఈ సంభాషణ విని దగ్గరనున్న కుర్రవాడి చేయిపట్టుకుని—'మణీ! దేవదాదాను ఇక నిజంగా బళ్లోకి రానివ్వరా" అని అడిగింది.

'ఊహుఁ! అసలు అడుగు పెట్టనివ్వరు' అన్నాడు మణి.

పార్వతి ఎడంగా పోయింది—ఈ సమాధానం ఆ పిల్లకేమీ బాగుండలేదు. పార్వతి తండ్రిపేరు నీలకంఠచక్రవర్తి. జమీందారుగారికి పొరుగు. అంటే ముఖర్జీగారి పెద్ద మేడకు ప్రక్కనే వీరి చిన్ని పురాతనపు డాబా. వీరికి పది పన్నెండు ఎకరాల పొలం నాలుగైదిళ్ల పౌరోహిత్యం, జమీందారుగారితో లావాదేవీలు కూడా ఉన్నవి. స్వాతంత్ర ప్రియుడు——కాలం హాయిగానే గడుపుతున్నాడు.

పార్వతికి మొట్టమొదట ధర్మదాసు కనపడ్డాడు. వాడు దేవదాసుగారింటి నౌకరు. పదో మాసంనుంచి ఈ పన్నెండో సంవత్సరం వరకు దేవ

దానును వదలకుండా ఉంటున్నాడు. వేళకు పాఠశాలలో వదిలిపెట్టేవాడు—బడి వదిలే సమయానికి హాజరై మళ్ళీ ఇంటికి తీసుకు వచ్చేవాడు. ఈ నియమం అతను అతిక్రమించేవాడు కాదు. ఇవ్వాళ అందుకోసమే బడికి వెళ్లుతున్నాడు. 'ఏడీ, పారూ! మీ దేవదాదా ఏడీ?' అని పార్వతిని చూడగానే ప్రశ్నించాడు.

'పారిపోయాడు!'

ధర్మదాసుకు మహా ఆశ్చర్యం కలిగింది. 'పారిపోవటం ఏమిటే?'

పార్వతికి మళ్ళీ భోలానాథుని దుర్దశ తలుపుకువచ్చి సరి కొత్తగా నవ్వ నారంభించింది—'ఇదిగో ధర్మదా—హీ, హీ, హీ—ఒక్కమాటే సున్నపు గుట్టలో—హీ, హీ—హహాహహా—ఒక్కమాటే ధర్మా, చిత్తుగా—'

ధర్మదాసుకు ఏమీ అర్థం కాకపోయినా పార్వతి నవ్వటం చూసి తను కూడా మొదట నవ్వాడు. తర్వాత నవ్వునాపుకుని—'చెప్పు, పారూ! ఏమయింది?' అని బతిమాలాడు.

'దేవదాసు వెనక్కపడేసి—భోలాని—సున్నపు గుట్టలో—హీ, హీ—'

ధర్మదాసు ఈ మాటు మిగతాదంతా గ్రహించి చాలా చింతితుడయాడు. 'పారూ! ఇప్పుడు వాడెక్కడ ఉంటాడో ఎరుగుదువా?'

'నాకేం తెలుసు!'

'నీకు తెలుసులే చెప్పుదూ! పాపం వాడికి చాలా ఆకలయిందనుకుంటాను'

'ఆమాట నిజమే—కాని నేను చెప్పను.'

'ఎందుకని చెప్పవే?'

'చెప్తే నన్ను కొడతాడు. నేనే ఏదన్నా తీసుకెళ్లి ఇచ్చి వస్తాను.'

ధర్మదాసుకు కొంతవరకు సంతృప్తి కలిగింది.

'అలాగే ఇవ్వు. కాని సాయంకాలం లోపల ఎలాగన్నా మైదుపుచ్చి ఇంటికి తీసుకురా.'

'తీసుకొస్తానులే!'

పార్వతి ఇంటికి చేరుకోకముందే ఈ సంగతి ఆమె తల్లికీ దేవదాసు తల్లికీ

తెలిసింది. వాళ్లు మళ్ళీ పార్వతిని అడిగారు. కాసేపు నవ్వుతూనూ, కాసేపు గంభీరంగానూ తనచేత నయినంతవరకూ వర్ణించింది. తర్వాత కొంగున మరమరాలు కట్టుకుని జమీందారుగారి మామిడితోపుకు బయలుదేరింది. తోట వీరింటికి దగ్గరే. దాంట్లో ఒకమూలను వెదురు గుమ్మె ఉన్నది. చాటుగా పుగాకు తాగటం కోసరం దేవదాసు అందులో కాస్తచోటుకూడా శుభ్రం చేసుకు అట్టే పెట్టుకున్నాడు. వాడు పారిపోయినప్పుడు, దాక్కునేచోటు ఇదేననికూడా పార్వతికి తెలుసు. అంచేత పార్వతి సరాసరి అక్కడికి వెళ్ళింది. దేవదాసు వెదురుగుమ్మెలో కూర్చుని పెద్దవాళ్లమాదిరిగా ధూమపానం చేస్తున్నాడు. ముఖం గంభీరంగా ఉన్నది—దానిలో దురాలోచనా చిహ్నాలుకూడా స్పష్టంగా కనిపిస్తున్నాయి. పార్వతిని చూడగానే వాడికి సంతోషం కలిగింది. కాని, దానిని బయటకు కనపడనివ్వలేదు. పొగ వదులుతూ—'ఇలారా' అని గంభీరంగా అన్నాడు.

పార్వతి దగ్గరకువచ్చి కూర్చున్నది. దేవదాసు దృష్టి ముందుగానే చెంగున ఉన్న మూటమీద పడింది. ఇక ఏమీ ప్రశ్నించకుండా మూట విప్పి తిన మొదలు పెట్టి—'పారూ! పంతులు ఏమన్నాడే?' అని అడిగాడు.

'పెద బాబుతో వచ్చి చెప్పాడు.'

'నాన్నకు చెప్పాడా?' అన్నాడు దేవదాసు గుడ్లు పెద్దవిచేసి.

'ఆఁ.'

'తర్వాత?'

'నిన్నిక బళ్ళోకి రానివ్వడట!'

'అసలు ఎవడు పోకూర్చున్నాడు!'

తినుబండారం పూర్తికావచ్చింది. దేవదాసు పార్వతివంక చూసి—'మిఠాయి తే!' అన్నాడు.

'మిఠాయి తీసుకు రాలేదు.'

'అయితే నీళ్ళివ్వు.'

'నీళ్ళెక్కడ తెచ్చేది?'

'ఏమీ తేకుండా ఎందుకువచ్చా? పో, నీళ్ళు తీసుకురా!' అన్నాడు విసుక్కుంటూ. అతని కర్కశ స్వరం పార్వతికి బాగుండలేదు—'నేను మళ్ళీ పోలేను. నువ్వే తాగివద్దువు గాని రా' అన్నది.

'నేనిప్పుడు రాగలనా?'

'మరి ఇక్కడే ఉండి పోతావా?'

'ఇక్కడే ఉంటాను—ఆ తర్వాత ఎటో అటు వెళ్లిపోతాను.'

దేవదాసు శ్మశాన వైరాగ్యం చూసేవరకు పార్వతి కళ్లల్లోనీరు తిరిగింది. అతని మాటలు ఈ పిల్ల మనసును కలచి వేశాయి 'నేనుకూడా వస్తాను, దేవదా!' అన్నది.

'ఎక్కడికి?—నా వెంటా?—అదెలా?'

పార్వతి తలతిప్పుతూ—'నేనూ వస్తాగా?' అన్నది.

'ఉహుం, రానక్కరలేదు. ముందు నువ్వు నీళ్ళుతీసుకురా.'

'నేనూ వస్తాగా!' అన్నది పార్వతి మళ్ళీ పూర్వం మాదిరిగానే.

'ముందు నీళ్ళు తీసుకురా!'

'నేను పోను—నువ్వు పారిపోతావు.'

'అబ్బే, పారిపోనుగా.'

కాని పార్వతికి ఈ మాటమీద విశ్వాసం కుదరలేదు. అందుచేత అక్కడి నుంచి కదలలేదు. 'పో, చెప్తుంటే!' దేవదాస్ హుకుం మిచ్చాడు.

'నేను పోలేను.'

దేవదాసు కోపంతో, పార్వతి జుట్టు పట్టుకులాగి—'పో, చెప్తుంటే!' అని గద్దించాడు. పార్వతి మాట్లాడలేదు. తర్వాత వీపుమీద ఒక గుద్దు పడింది. 'పోవా?'

'నేను చచ్చినా పోను.' అన్నది పార్వతి ఏడుస్తూ.

దేవదాసు అక్కడి నుంచి లేచి వెళ్ళిపోయాడు. పార్వతి ఏడుస్తూ తిన్నగా దేవదాసు తండ్రి దగ్గరకు వచ్చి నిలబడింది. ముఖర్జీగారికి పార్వతి అంటే చాలా ప్రేమ. 'పారూ! ఎందుకమ్మా ఏడుస్తున్నావు?' అని బుజ్జగిస్తూ అడిగాడు.

'దేవదా కొట్టాడు.'

'ఏడీ వాడు?'

'ఆ వెదురు గుమ్మెలో కూర్చుని హుక్కా తాగుతున్నాడు.'

అసలు పంతులుగారు వచ్చినప్పటి నుంచే వారు ఉడికి పోతున్నారు— ఈ మాట వినగానే భగ్గుమన్నారు—'దేవాయి హుక్కాకూడా తాగుతున్నాడా?'

'ఆఁ, రోజూ తాగుతున్నాడు. హుక్కా ఆ వెదురు గుమ్మెలో దాచి పెట్టాడు—'

'ఇన్నాళ్లనుంచీ ఎందుకు చెప్పలేదు?'

'కొడతా డని.'

ఈ మాట యథార్థం కాదు. వెల్లడిస్తే దేవదాసుచేత దెబ్బలు తినాల్సి వస్తుందనే భయం పార్వతికి ఎప్పుడూలేదు. దేవదాసుకే దెబ్బలు తగులుతాయని ఇన్నాళ్ళనుంచీ దాచింది. ఇవ్వాళ ఆ ఉడుకుమీద వెళ్ళ గ్రక్కింది. ఇప్పుడు ఆపిల్లకు ప్రాయంకూడా ఎంత?—ఎనిమి దేళ్ళు సరిగ్గా నిండలేదు. ఇంకా కోపం చాలా ఎక్కువ. అలాగని ఆ పిల్లకు వివేచనాశక్తి లేదనడానికి వీల్లేదు. ఇంటికిపోయి పక్కమీద పండుకుని చాలా సేపు ఏడ్చి ఏడ్చి నిద్రపోయింది. ఆ రాత్రి అన్నంకూడా తినలేదు.

* * *

మర్నాడు దేవదాసును బాగా కొట్టారు. ఆ పగలంతా గదిలో పెట్టి వేశారు. వాళ్ళ అమ్మ చాలా ఏడ్చి గోలచేసినమీదట వాడిని వదలి పెట్టారు. మూడో నాడు తెల్లవారక ముందే తప్పించుకుని పార్వతి ఇంటి కిటికీ దగ్గరకు వచ్చి నిలబడి—'పారూ!' అన్నాడు.

పార్వతి రెండో పిలుపుకు కిటికీ తెరిచి—'ఎవరు! దేవదా?' అన్నది.

'ఆఁ. నేనే! దబ్బున రా.' అని దేవదాసు చేయి ఊపాడు. ఇద్దరూ కలుసుకున్నాక—'నేను హుక్కా తాగుతానని ఎందుకు చెప్పావు?' అన్నాడు.

'నన్నెందుకు కొట్టావు నువ్వు?'

'నువ్వు నీళ్ళు తీసుకు రావటాని కెందుకు పోలేదు ?'

పార్వతి మాట్లాడలేదు.

'నువ్వొక గొడ్డువు. ఇకెప్పుడూ చెప్పమాకు!' అన్నాడు దేవదాసు.

'చెప్పనులే ?' అన్నది పార్వతి.

'ఐతే పద, గాలం కొట్టుకొద్దాం, ఇవ్వాళ చెరువులో చేపలు పట్టాలి.'

వెదురు గుమ్మెకు దగ్గరగానే గానుగు చెట్టు ఒకటి ఉన్నది. దేవదాసు అది ఎక్కి చాలా కష్టంతో వెదురు చువ్వ ఒకటి వొంచి పార్వతికి పట్టుకో మని ఇచ్చి 'జాగర్త దాన్ని వదిలి పెట్టేవు ? నేను క్రింద పడతాను.' అన్నాడు. పార్వతి ప్రాణాలన్నీ బిగపట్టి ఆకొమ్మ పట్టుకొన్నది. దేవదాసు అదిపట్టుకుని గానుగ కొమ్మమీద కాళ్ళు పెట్టి చువ్వ కోస్తూ ఉన్నాడు.

'ఇక బళ్ళోకి రావా, దేవాదా ?' అన్నది పార్వతి క్రిందనుంచి.

'ఉహుఁ.'

'పెదబాబు నిన్ను పంపుతాడుగా ?'

'నాన్నే ఇక పోవద్దని చెప్పాడు—పంతులే ఇంటికి వస్తాడట.'

పార్వతి కొంచెం ఆలోచనలో పడింది.

'రేపటినుంచీ ఈ ఎండకాల మల్లా ప్రొద్దుటపూట బడి పెడతారట—నే నిక పోతాను.' అన్నది పార్వతి కాసేపు ఉండి.

దేవదాసు పైనుండే 'వల్లకాదు ?' అని గుడ్లు ఉరిమాడు.

పార్వతి ఈ సమయంలో కొంచెం పరధ్యానంగా ఉండి చేతిలో చువ్వ వదిలి పెట్టింది. చువ్వ పైకి పోవటమూ, దేవదాసు క్రింద పడటమూ ఒక్క మాటు జరిగాయి. ఎక్కువ ఎత్తు లేకపోవటంచేత దెబ్బలు తగల లేదు కాని ఒంటిమీద చాలాచోట్ల గీచుకు పోయింది. దేవదాసు మండిపడుతూ లేచి, ఎండుపుల్ల ఒకటి తీసుకొని, పార్వతి వీపుమీదా చెంపలమీదా—అందిన చోట్లల్లా ఇష్టం వచ్చినట్టు కొట్టి—'ఫో, నా ఎదటునుంచి!' అని హుంక రించాడు.

మొదట పార్వతి చాలా సిగ్గుపడింది. కాని దెబ్బలు ఎక్కువ తగిలినకొద్దీ అభిమానంతోనూ, కోపంతోనూ ఆ పిల్ల కళ్ళు నిప్పులు క్రక్కినవి. ఏడు

స్తూనే—'నేను పెదబాబు దగ్గరకి పోతున్నాగా!' అని బెదరించింది.

'పో, ఇప్పుడే చెప్పుకో, పో,' అని దేవదాసు ఇంకో దెబ్బ వేశాడు.

పార్వతి వెళ్ళిపోయింది. కొంతదూరం పోయాక దేవదాసు పిలిచాడు. కాని పార్వతి వినికూడా వినిపించుకోలేదు. ఇంకా త్వరగా వెళ్లిపోసాగింది.

'ఓ పారూ! ఒక్కమాట వినిపోవే!' అని దేవదాసు మళ్లీ కేకవేశాడు. పార్వతి జవాబివ్వలేదు. దేవదాసు విరక్తుడై కాసేపు ఏమేమో వాగి—'పోయి చావు!' అని మనస్సులో తిట్టుకున్నాడు. పార్వతి పోయాక ఒకటి రెండు చువ్వలు సరికాడు కాని అతని మనస్సు మాత్రం ఏమీ బాగాలేదు.

పార్వతి ఏడుస్తూ ఇంటికి వచ్చేసింది. చెంపమీద దెబ్బలు నీలిరంగుకు వచ్చాయి. వాళ్ళ నాయనమ్మ చూసి 'అమ్మయ్యో! ఎవరే ఇలా కొట్టింది పారూ?' అని అడిగింది.

'పంతులుగారు.' అన్నది పార్వతి కళ్లు తుడుచుకొంటూ.

నాయనమ్మ పిల్లను చంకను వేసుకొని—'పద, ఒకమాటు నారాయణ దగ్గరికి వెళ్ళి వద్దాము—ఎలాంటి పంతులో, పీను! ఆహా, పిల్ల ప్రాణాలు తీశాడే!' అన్నది.

పార్వతి, నాయనమ్మ మెడ వాటేసుకుని—'పద!' అన్నది.

పార్వతినాయనమ్మ ముఖర్జీ దగ్గరికి వచ్చి పంతులుగారి పూర్వీకుల సందరినీ, వైనాలవారీగా ఎత్తి, వారికి పారలౌకిక అశుభం కోరింది. తర్వాత గోవిందుని నానాతిట్లుతిట్టి—'చూడు నారాయణా! వాడి పొగరు! శూద్రాడై కూడా బ్రాహ్మణ పిల్లమీద చెయ్యివేశాడు. ఎలా కొట్టాడో చూడూ ఒకమాటు!' అని బుగ్గమీది దెబ్బలను, మహా వ్యధపడుతూ ముసలిది చూపించ నారంభించింది.

'ఎవరు కొట్టారు పారూ!' అని నారాయణబాబు ప్రశ్నించాడు.

పార్వతి మాట్లాడలేదు. అప్పుడు నాయనమ్మ—'ఇంకెవరు? మన గొడ్డు మోతు పంతులే!' అని చీత్కారం చేసింది.

'ఎందుకు కొట్టాడు!'

పార్వతి ఈ మాటు కూడా మాట్లాడలేదు. ముఖర్జీగారు పార్వతి ఏదో

తప్పుచేసి ఉంటుందని ఊహించారు. అయినా ఇలా కొట్టడం భావ్యం కాదని తన అభిప్రాయం వెల్లడించారు. వారిమాట విని పార్వతి—'ఇక్కడ కూడా కొట్టాడు.' అని చొక్కా ఎత్తి వీపు చూపించింది.

వీపుమీద దెబ్బలు ఇంకా స్పష్టంగానూ ఇంకా బలంగానూ ఉన్నాయి. అంచేత వారిద్దరికీ మహాకోపం వచ్చింది. ముఖర్జీగారు పంతులును పిలిపించి సంజాయిషీ తీసుకుంటానని చెప్పారు. ఇలాంటి పంతులుదగ్గిరికి ఇక పిల్లలను పంపటం కూడా మంచిది కాదని తీర్మానించారు. తీర్మానం విని పార్వతి, నాయనమ్మ చంక ఎక్కి సంతోషంతో ఇంటికి వచ్చేసింది. కాని ఇంటివద్ద తల్లి క్రాస్‌లో పడిపోయింది.

'ఎందుకు కొట్టాడో చెప్పు?'

'ఊరకనే కొట్టాడు.' అన్నది పార్వతి.

'ఊరకనే కొడుతారా ఎక్కడన్నా?' అని తల్లి పార్వతి చెవి మెలేసింది.

పార్వతి నాయనమ్మ ఆ గది ముందుగా పోతూ ఇది చూచి ఆగి—'అది కాదేపిల్లా! తల్లివై ఉండి నువ్వు కొట్టుతున్నావు కాని ఊరక, ఇక ఆ ముండాకొడుకు చెయి చేసుకో లేడటే!' అన్నది.

'ఉత్త పుణ్యానికి ఎప్పుడూ కొట్టడు. ఇంత బుద్ధిగల అమ్మాయి—ఏమి చేసిందో, అందుకే దెబ్బలు తిన్నది.'

'సరే, అలాగే అనుకో. కాని, నేనుమాత్రం ఇంకదాన్ని బళ్లోకి పోనివ్వను.'

'ఇక రాత కోతలు నేర్చుకోదా?'

'ఎందుకమ్మా అంత సతుకులు? కాస్త ఉత్తరం గీకటం, రెండాకులు రామాయణం చదవటం వస్తే సరిపోయె. పారూ ఏమన్నా ప్లీడరు కాబోతున్నదా, జడ్జీపని చేయబోతుందా?'

తల్లి ఇక మాట్లాడలేదు. ఆ రోజున దేవదాసు చాలా భయపడుతూనే ఇంటికి చేరాడు. పార్వతి తప్పక అంతా చెప్పి వుంటుందని అతని నమ్మకం. కాని ఇంట్లో ఆ లక్షణాలేవీ కనపడలేదు. పైగా, ఇవ్వాళ పంతులు పార్వ

తిని చావ చితక కొట్టాడనీ, రేపటినుంచి ఇక బళ్ళోకి పోదనీ, తల్లి దగ్గర విని మహా సంతోషంతో ఆ పూట సరిగా అన్నంకూడా తినలేదు. ఎలాగో రెండు మెతుకులు ముక్కూ నోటా కుక్కుకుని, పార్వతి దగ్గరికి రొప్పు కుంటూ పరుగెత్తుకొచ్చి—'పారూ, నువ్వికి బళ్ళోకి పోవటంగా!' అన్నాడు.

'పోను.'

'ఎందుకనీ?'

'పంతులుగారు కొట్టారని చెప్పాను.'

దేవదాసు పకపక నవ్వుతూ పార్వతి వీపు చరచి, నీవంటి బుద్ధిమంతురాలు ఈ ప్రపంచంలో ఇక ఎక్కడా లేదని, యోగ్యతాపత్రం ఇచ్చాడు. తర్వాత నిమ్మళంగా, పార్వతి బుగ్గమీద దెబ్బలు జాగర్తగా పరీక్షించి—'అబ్బా!' అని నిట్టూర్చాడు. పార్వతి అతనివంక చూసి మందహాసంచేస్తూ—'ఏమిటీ అంది?'

'దెబ్బలు బాగా తగిలాయి కాదూ, పారూ!'

'ఊఁ' అన్నది పార్వతి తల తిప్పుతూ.

'నువ్వలా ఎందుకు చేశావు? అందుకనే నాకు కోపంవచ్చి కొట్టాను.'

పార్వతి కళ్ళల్లో నీరు తిరిగింది. ఏంచేశానని అడగాలనుకున్నది. కాని అడగలేకపోయింది. దేవదాసు పార్వతి తల నిమురుతూ-'ఇక అలా చేయకు-ఏమంటావు?' అన్నాడు.

'చేయను.' అన్నది పార్వతి తల తిప్పి.

దేవదాసు ఇంకోమాటు పార్వతి వీపు చరచి—'శభాష్, ఇక నేను నిన్నెప్పుడూ కొట్టను!' అని బరవాసా యిచ్చాడు.

* * *

రోజులు గడచిపోతూ ఉన్నవి. ఈ బాలబాలికల, ఇద్దరి ఆనందానికి హద్దులేదు; పగలంతా ఎండలో తిరగటం, సాయంత్రం వచ్చి దెబ్బలు తినటం; మళ్ళీ ఉదయాన్నే లేచి పోవటం, తిరిగి తిట్లు తినటం మామూలయి పోయింది. రాత్రి ఏమీ ఒడుదుడుకులేకుండా, నిశ్చింతగా నిద్రపోయేవారు.

మళ్ళీ తెల్లవారగానే ఊరిమీదపడి అల్లరీ అగమూ చేస్తూ తిరిగేవాళ్ళు. వీళ్ళకు ఇక స్నేహితులుకూడా ఎవ్వరూ లేరు—వాళ్ళ అవుసరంకూడా లేదు వీళ్ళకి—ఊరంతా ఉపద్రవాలు చేస్తూ తిరగటానికి వీరిద్దరే చాలు.

ఆ నాడు నీళ్ళు ప్రొద్దు పొడిచినప్పుడు పోయి చెరువులోదిగి రెండు ఝాములవరకూ బయిటికి రాలేదు. నీళ్ళన్నీ కెలికి, గుడ్డలన్నీ బురద కొట్టుకొని తాము పట్టిన పదిహేను బురదమట్టలూ యోగ్యతానుసారంగా భాగం వేసుకుని, ఎర్రటి కళ్ళతో ఇంటికి తిరిగివచ్చారు. పార్వతిని, యథోచితంగా సత్కరించి గదిలోపెట్టి తలుపు బిగించింది తల్లి. దేవదాసు సంగతి సరిగా తెలియదు. ఎందుకంటే వాడిలాంటి సంగతులేవీ బయట పెట్టడు. పార్వతి గదిలో కూర్చుని ఏడుస్తూ ఉండగా— మధ్యాహ్నం రెండూ రెండున్నర గంటలకు—దేవదాసు గది కిటికీ దగ్గరకువచ్చి— 'పారూ, ; ఓ పారూ !' అని నెమ్మదిగా పిలిచాడు. పార్వతి బహుశా ఇది విని ఉంటుంది. కాని కోపంతో జవాబివ్వలేదు. ఇక అవాళంతా దేవదాసు వీరింటి దగ్గర ఉన్న చంపా వృక్షంమీదనే గడిపాడు. సాయంకాలం ధర్మదాసు చాలా బలవంతాన వాడిని చెట్టునుంచి క్రిందికి దించి ఇంటికి తీసుకుపోయాడు.

అది ఆ వేళనే. మర్నాడు ఉదయాన్నుంచీ పార్వతి దేవదాసుకోసం ఆతురతతో ఎదురు చూస్తూనే ఉన్నది. కాని దేవదాసు రాలేదు. పిలుపు వస్తే తండ్రివెంట ప్రక్క గ్రామానికి వెళ్ళాడట. పార్వతికి ఏమీతోచక ఇంటినుంచి బయలుదేరింది. నిన్న దేవదాసు చెరువులో దిగేటప్పుడు పార్వతి చేతికి మూడు రూపాయలు ఇచ్చాడు, జేబులోనుంచి పడిపోతవని. అవి ఇంకా కొంగునే ఉన్నవి. పార్వతి చెంగు తిప్పుకుంటూ తాను కానేపు ఏకాకిగానే తిరిగింది. తోడెవ్వరూ దొరకలేదు. అప్పుడు బడి ఉదయం పెట్టుతున్నారు. పార్వతి పడమట బజారుకుపోయింది. మనోరమ ఇల్లు అక్కడనే. ఆ పిల్ల కూడా బడిలోనే చదువుతూ ఉన్నది. వయస్సులో కొంచెం పెద్ద—పార్వతి సఖి. చాలా రోజులునుంచి ఒకరి నొకరు చూసుకోలేదు.

'మనో, ఇంట్లో ఉన్నావా?' అని వాకిట్లోకిపోయి పిలిచింది.

మనోరమ మేనత్త బయటకువచ్చి 'పారూ !' అని పలకరించింది.

'ఆఁ, నేనే! మనో ఎక్కడ అత్తయ్యా?'

'బళ్ళోకి పోయింది—నువ్వు పోవటం లేదా?'

'ఉహుఁ—దేవదా కూడా పోవటం లేదు.'

'నువ్వు పోవటంలేదు సరే దేవదాసుకూడా పోవటం లేగా?' అని అడిగింది నవ్వుతూ.

'ఉహుఁ. మే మెవ్వరం పోవటం లేదు.'

'అయితే మంచిదే—మా మనో బళ్ళోకి వెళ్ళింది.'

మనోరమ మేనత్త కూర్చొన్నది, కాని పార్వతి తిరిగి వచ్చింది. దోవలో రసికపాల్ దుకాణంవద్ద ముగ్గురు సాతాని స్త్రీలు ఊర్ధ్వపుండ్రాలు పెట్టుకొని కంజరి చేతపట్టి భిక్షం అడుక్కుంటున్నారు. పార్వతి వాళ్ళని కేక వేసింది. 'ఓ అమ్మో, మీకు పాటలు వచ్చా?'

అందులో ఒక సాతాని తిరిగివచ్చి 'ఎందుకు రావు తల్లీ?' అన్నది.

'అయితే పాడండి.'

అప్పుడు ముగ్గురూ తిరిగి చూశారు. అందులో ఒకతె—'ఊరకే పాడం తల్లీ, భిక్షం వేయాలి. మీ ఇంటికి పోదాం పద విందువుగాని' అంది.

'కాదు, ఇక్కడే పాడండి'.

'కాణీ ఇవ్వాలి తల్లీ.'

'కాణీ లేదు. రూపాయి ఉంది.' అని పార్వతి కొంగున మూట చూపించింది. మూట చూసి వాళ్లు దుకాణంవదలి కొంచెందూరం వచ్చి కూర్చొన్నారు. కంజరి వాయిస్తూ ముగ్గురూ గొంతులు కలిపి పాడారు. ఏమి పాడారో, దానికి అర్థం ఏమిటో—పార్వతికి బొత్తుగా తెలియలేదు. తెలుసుకోవాలని ప్రయత్నించినా తెలుసుకోలేదు. అసలు మనస్సే అక్కడ లేదు—దేవదాసు దగ్గరకు ఎప్పుడో పరుగెత్తింది.

పార్వతి కొంగున ఉన్న మూటవిప్పి మూడు రూపాయలు వాళ్ల చేతిలో పెట్టింది. వాళ్ళు ముగ్గురూ విస్తుపోయి ఆ పిల్ల ముఖంవంక చూస్తూ ఉండి పోయారు.

ఈ 'రూపాయలు ఎవరివి తల్లీ?' అని ఒకతె అడిగింది.

'దేవ దాదావి,'

'నిన్ను కొట్టడా?'

పార్వతి కొంచెం ఆలోచించి—'కొట్టడు' అన్నది.

'నూరేళ్లు బ్రతుకమ్మా!' అని ఒకతె ఆశీర్వదించింది.

పార్వతి నవ్వుతూ 'ముగ్గురికి భాగాలు చక్కగా కుదిరాయికదూ?'అంది.

'ఆఁ, కుదిరాయి.' అని తల తిప్పి, తర్వాత—'రాధాకృష్ణులు నిన్ను కాపాడుతారులే తల్లీ!' అని ఆశీర్వదించారు. ఈ దాసశీల దెబ్బలు తినకుండా ఉండాలని వాళ్ళ కోరిక. పార్వతి ఆవేళ పెందలాడే ఇంటికి తిరిగివచ్చింది. మర్నాడు ప్రొద్దునే దేవదాసు కనిపించాడు. వాడి చేతిలో దారపు కండె ఉన్నది—గాలి పటం లేదు. అ దిప్పుడు కొనాలి.

'పారూ! రూపాయలు తే' అని పార్వతిని అడిగాడు.

పార్వతి ముఖాన నెత్తురు చుక్క లేదు—'లేవు.' అన్నది.

'ఏమయినై?' 'సాతాని స్త్రీల కిచ్చాను—పాట పాడితే.'

'అన్నీ ఇచ్చావా?'

'అన్నీ ఎన్ని? మూడేగా!'

'పో, దెయ్యమా? అన్నీ ఇవ్వ వచ్చా?'

'బాగా ఉంది. వాళ్ళు ముగ్గు రుండిరి! మూడు రూపాయలు ఇవ్వక పోతే వాళ్ళకి భాగ మెలా కుదురుతుంది?'

దేవదాసు గంభీరంగా—'నే నయితే రెండు రూపాయ లిచ్చేవాడిని.' అని దారపు కండెతో నేలమీద లెఖ్ఖవేసి—'అలాగైతే వారికి ఒక్కొక్కరికి పది అణాల అర్థణా అరకానీ వచ్చేది!' అన్నాడు.

పార్వతి కొంచెంసేపు ఆలోచించి—'వాళ్ళకు నీమాదిరిగా మణుగు లెఖ్ఖలు వచ్చా, పంచుకోటానికి?' అని అడిగింది.

దేవదాసు మణుగు లెఖ్ఖలుకూడా నేర్చుకున్నాడు. పార్వతి ఈమాట అతనికి ఆనందం కలిగించింది—'అదీ నిజమే.' అన్నాడు.

పార్వతి దేవదాసు చేయిపట్టుకొని—'నన్ను కొడతా వనుకున్నాను, దేవదా!' అన్నది.

'ఎందుకు కొడతాను?' అన్నాడు దేవదాసు విస్మయంతో.

'సాతాన్లు చెప్పారుగా నువ్వు కొడతావని.'

ఈ మాట అతనికి మహా ఆనందం కలిగించింది. పార్వతి భుజాన భారం వేసి—'ఛా, తప్పుచేయకపోతే ఎందుకు కొడతాను!'

పార్వతి చేసిన ఈపని తన పీనల్ కోడ్‌లో ఏ సెక్షన్ క్రిందికీ రాదని బహుశా దేవదాసు భావించి ఉంటాడు. ఎందుకంటే మూడు రూపాయలు కాబట్టి ముగ్గురూ చక్కగా పంచుకోగలిగారు. పాఠశాలలో మణుగుల లెఖ్ఖలుకూడా నేర్చుకోనటువంటి సాతాని స్త్రీలకు మూడు రూపాయలకు బదులు రెండు రూపాయలివ్వటం, వారిని బాధించటమే అనికూడా ఇతను ఎంచాడు. తర్వాత దేవదాసు దారపు బంతి వెదురు గుమ్మెలో దాచివచ్చి పార్వతి చెయ్యిపట్టుకుని గాలిపటం కొంటానికి కోమటింటికి బయలుదేరాడు.

* * *

ఈ విధంగా ఒక సంవత్సరం గడిచింది. ఇక గడవటం కష్టమైంది. దేవదాసు తల్లిపోరు నానాటికీ ఎక్కువైంది. 'మాండండి దేవాయి ఊరక గాలికి తిరిగి పాడవుతున్నాడు. వాడిని యిక చదివించడం లేదా?' అని భర్తను అడిగింది.

వారు కొంచెం ఆలోచించి—"దేవాయిని కలకత్తా పంపుతాను. నగేను ఇంట్లో ఉండి చదువుకుంటాడు.' అన్నాడు. నగేనుడు దేవదాసుకు మేన మామ అవుతాడు.

ఈ సంగతి అందరికీ తెలిసింది. పార్వతి విని చాలా భయపడింది. దేవదాసు ఒంటరిగా కనపడగానే అతని చేతులు పట్టుకొని ఊగులాడుతూ నువ్వు కలకత్తా పోతావటగా, దేవదా?' అని అడిగింది.

'ఎవరన్నారు?'

'పెదబాబు చెప్పాడు.'

'ఛా—నేను పోను.'

'మరి నిన్ను బలవంతంగా పంపితేనో?'

'బలవంతంగానా?'

దేవదాసు ఈ మాట అనే టప్పుడు పెట్టిన ముఖ భంగిమ చూసి, ఈ ప్రపంచంలో ఎవ్వరూ అతనిచేత బలవంతాన ఏ పనీ చేయించలేరని పార్వతి స్పష్టంగా గ్రహించింది. పార్వతికి కావలసింది కూడా ఇదే. అందుకని మహా ఆనందంతో ఇంకోమాటు అతని చేతులుపట్టుకొని ఊగులాడుతూ, ముఖం వంక చూసి— 'చూడు దేవదా! ఒకవేళ పోతావేమో!' అన్నది.

'ఎప్పటికీపోను.'

కాని ఈ ప్రతిజ్ఞ నిలువలేదు. తండ్రి అతన్ని తిట్టీ, భయపెట్టీ, ఆఖరికి ధర్మదాసును తోడిచ్చి కలకత్తా పంపించాడు. వెళ్లేరోజున దేవదాసు మనస్సు చాలా బాధపడింది. కొత్తచోటుకు పోతున్నాననే ఆనందంకానీ, కుతూహలం కానీ అతని కేమాత్రం కలగలేదు. దేవదాసును వదలి పెట్టడం పార్వతికెంతమాత్రం ఇష్టం లేదు. ఏడ్చింది; గోలచేసింది; కాని ఆపిల్లమాట ఎవరువింటారు? మొదటి అభిమానంచేత దేవదాసుతో మాట్లాడనే లేదు. కాని చివరకు, దేవదాసు పిలిచి— 'పారూ? మళ్లీ నేను త్వరలో వస్తాను. పంపకపోతే పారిపోయైనా వస్తాను' అని ధైర్యం చెప్పినప్పుడు పార్వతి అలకమాని, తన క్షుద్ర హృదయం విప్పి అనేకసంగతులు చెప్పింది.

పిమ్మట దేవదాసు, తల్లి ఆశీర్వాదంతోపాటు ఆఖరి కన్నీటి చుక్క కూడా శిరస్సున ధరించి, సూటుకేసు చేత పట్టుకుని గుర్రపు బండి ఎక్కి వెళ్ళిపోయాడు. పార్వతికి అప్పుడు చాలా వేదన కలిగింది. కళ్ళ వెంట ఎంతో నీరు కార్చింది. అభిమానంతో ఆమె హృదయం బ్రద్దలయి పోయింది. మొదట కొంతకాలం పార్వతి ఇలా గడిపింది.

తర్వాత ఒకనాటి ఉదయాన లేచి చూచేవరకు, ఆమెకు చేసే పనులేవీ కనిపించలేదు. ఇంతకు పూర్వం బడిమానేసి నప్పటినుండి, ఉదయం నుంచీ సాయంకాలం వరకు, ఉత్త అల్లరీ ఆగంతోనే సరిపోయేది. అప్పుడు చేయాల్సిన పనులు చాలా ఉండేవి—సమయం చాలేదికాదు. ఇప్పుడు సమయం చాలా ఉన్నది— కాని ఎంత వెతకినా, చేసే పని కనిపించలేదు. ఒకో రోజున ఉదయం లేవగానే ఉత్తరం రాయటానికి కూర్చునేది. పది గంటలయ్యేది. తల్లి విసుక్కుంటూ ఉండటం చూసి— 'అయ్యో, దాన్ని రాసుకో

నియ్యవే. పొద్దుటి పూట ఊరిమీద తిరిగే కంటే రాసుకోటం మంచిది కాదూ?' అని నాయనమ్మ సమర్థించేది. ఇక దేవదాసు దగ్గర నుంచి ఉత్తరం వచ్చిన రోజున పార్వతికి పండగ; గదిలో కూర్చుని ఆ రోజల్లా ఈ ఉత్తరం చదివేది.

ఇలా రెండు మాసాలు గడిచాయి. ఉత్తరాలు రాయటం, రావటం కూడా క్రమంగా మందగించాయి. ఉత్సాహం కొంత తగ్గి పోయింది.

ఒక నాటి ఉదయం పార్వతి—'అమ్మా, నేను మళ్లీ బళ్లోకి పోతానే!' అని తల్లిని అడిగింది.

'అలాగే పో తల్లీ! నిన్ను నేను బళ్లోకి ఎప్పుడు పోవద్దన్నాను?'

ఆరోజున మధ్యాహ్నం, చాలా రోజుల క్రిందట పారవేసిన పలకా పుస్తకాలు బయటకు తీసి, దాసీ చేయి పట్టుకొని, మళ్ళీ వెనకటి చోటుకే పోయి శాంతంగానూ ధైర్యంగానూ కూర్చున్నది.

'పంతులుగారూ! మా పారును కొట్టా గిట్టా మాకండి. దాని ఇష్టంతో అది బళ్ళోకి వచ్చింది. ఇష్టమైతే చదువుకుంటుంది. లేక పోతే ఇంటికొస్తుంది.' అన్నది దాసీది పంతులుగారితో.

'తథాస్తు!' అని పంతులు లోపల అనుకుని, పైకి—'అలాగేలే.' అన్నాడు. పార్వతిని కూడా కలకత్తా ఎందుకు పంపలేదని ఒక మాటు అడగాలను కున్నాడు. కాని తన ఉద్దేశాన్ని బయట పెట్టలేక పోయాడు.

భోలా ఆ వెనకటి బెంచి మీదనే కూర్చుని ఉన్నాడు. అతన్ని చూడ గానే పార్వతికి నవ్వు వచ్చే పర్యంతమైంది; కాని మరుక్షణానే ఆమె కళ్లలో నీరు తిరిగింది. తర్వాత భోలా మీద చాలా కోపంకూడా వచ్చింది. దేవదాసు ఇల్లు వదలిపెట్టటానికి కారకుడు వీడేనని ఆమె అనుకున్నది.

ఇలా కొన్ని మాసాలు గడిచాయి.

కొంత కాలానికి దేవదాసు తిరిగి ఇంటికి వచ్చాడు. రావటమే తడవుగా పార్వతి దగ్గరకు పరుగెత్తుకొచ్చాడు. అనేక సంగతులు మాట్లాడుకున్నారు. పార్వతికి, చెప్పవలసింది ఎక్కువేమీ లేదు; ఉన్నా చెప్పలేక పోయింది. దేవదాసు అనేక సంగతులు చెప్పాడు—అన్నీ కలకత్తావే. కొన్నాళ్ళకు

ఎండాకాలపు సెలవులు కూడా అయిపోయాయి. దేవదాసు మళ్ళీ కలకత్తా వెళ్ళిపోయాడు. పార్వతి ఈమాటూ ఏడ్చింది. కాని మునుపటంత గంభీరత లేదు.

ఈ విధంగా నాలుగు సంవత్సరాలు గడిచాయి.

ఈ నాలుగు సంవత్సరాల్లో దేవదాసు స్వభావం చాలా మారిపోవటం చూసి పార్వతి చాటున అనేకసార్లు కళ్లు తుడుచుకున్నది. ఇంతకు పూర్వం దేవదాసులో ఉండే పల్లెటూరుతన మంతా పట్టణవాసంతో తుడుచుకు పోయింది. పాలిష్ చేసిన బూట్లూ, మంచి చొక్కాలూ, సన్నని ధోవతులూ, చేతికర్రా, బంగారపు గడియారం గొలుసూ—వీటిలో ఏవి లేకపోయినా అతను బయటికి రావటానికి సిగ్గుపడే వాడు. ఇప్పుడు నది ఒడ్డుకు షికారు పోవటం అతనికి ఇష్టంలేదు—తుపాకి తీసుకొని వేటకు పోవటంలోనే అతనికి ఆనందం. చిన్న చిన్న పక్కి—చేపలకు బదులు పెద్ద పెద్ద వాలుగలు పట్టాలని ప్రయత్నించేవాడు. ఇంతటితో ఆగినా ఫరవా లేదు. సాంఘిక—రాజకీయాలూ, క్రికెట్, ఫుట్‌బాల్ మొదలగు వాటిని గురించీ చర్చిస్తూ ఉండే వాడు. అయ్యో! ఎక్కడ పార్వతి, ఇంకెక్కడి తాల్‌సోనా పురగ్రామం? బాల్యస్మృతిలో చిక్కుకొని పోకుండా ఉన్న ఒకటి రెండు ఆనందదాయక విషయాలు అతనికి జ్ఞాపకంలేదంటానికి వీల్లేదు. కాని, వివిధ విషయాలమీద ఉన్న ఉత్సాహంలో అవి అతని హృదయంలో ఎక్కువసేపు నిలిచేవి కావు.

మళ్ళీ సెలవులు పూర్తి కావచ్చినవి. క్రిందటి సంవత్సరం ఇతను రాలేదు. మిత్రులతో కలిసి దేశాటనానికి వెళ్ళాడు. ఈమాటు తల్లి దండ్రులు ఘట్టిగా రమ్మని ఉత్తరం వ్రాశారు అందుచేత ఇష్టం లేకపోయినా బెడ్ చుట్టి స్వగ్రామం రావటానికి హవ్రా స్టేషను చేరుకున్నాడు.

ఇంటికి వచ్చినరోజున అతని ఒంట్లో బాగుండలేదు. అంచేత అవాళ బయటకు రాలేదు. మర్నాడు పార్వతి ఇంటికివచ్చి—'అత్తయ్యా' అని పిలిచాడు.

'రా, నాయనా! కూర్చో.' అని పార్వతితల్లి ఆదరంతో ఆహ్వానించింది. ఆమెతో కాసేపు మాట్లాడినతర్వాత—'పారూ ఎక్కడ అత్తయ్యా!' అన్నాడు.

'అదిగో! ఆ వెనక గదిలో ఉంది.'

దేవదాసు అక్కడకు వెళ్లాడు. పార్వతి సంజె దీపం వెలిగిస్తూ ఉన్నది.

'పారూ!' అని పిలిచాడు.

పార్వతి మొదట చకితురాలయింది. తర్వాత నమస్కారంచేసి ఎడంగా పోయి నిలబడింది.

'ఏం జేస్తున్నావు' పారూ?' ఇదంత ముఖ్య ప్రశ్న కాదు—అందుకని పార్వతి జవాబివ్వలేదు. అసలు దేవదాసంటే కాస్త సిగ్గుకూడా పడుతున్నది.

'ప్రొద్దు పోకింది, వెళ్ళొస్తాను. ఒంట్లోకూడా బాగో లేదు.' అని దేవదాసు వెళ్ళిపోయాడు.

* * *

పార్వతి ఇప్పుడు పదమూడో ఏట పాదం పెట్టిందని వాళ్ళ నాయనమ్మ చెప్పుతూ ఉన్నది. ఈ వయస్సులో ఆడ పిల్లలకు శారీరక సౌందర్యం అకస్మాత్తుగా ఎక్కడనుంచో ఊడిపడుతుంది. వాళ్ళ చిట్టి ఒక్కమాటే పెద్దదయిందని తల్లి దండ్రులు ఆశ్చర్యపోతారు. ఇక ఎవరి చేతిలో పెడదామా అని త్రొక్కిసలాడుతారు. చక్రవర్తిగారి ఇంట్లోకూడా కొన్నాళ్లనుంచి ఈ విషయమయ్యే చర్చ జరుగుతూ ఉన్నది. అందరికంటే తల్లికి ఎక్కువగా ఆతురత ఉన్నది. మాటల సందర్భంలో మాటిమాటికి—'అబ్బే! పార్వతిని ఇక ఉంచటం భావ్యం కాదు.' అని భర్తతో అంటూ ఉండేది. వారంత భాగ్యవంతులుకాదు. అయినా పిల్ల చక్కనిదనే ధైర్యం ఒకటి ఉన్నది. ప్రపంచంలో రూపానికి గనుక విలువ ఉంటే పార్వతినిగురించి వీరికి ఆలోచించవలసిన పనే ఉండదు. ఇంకో సంగతికూడా ఉన్నది—ఇది ఇక్కడే చెప్పడం మంచిది. ఇంతకుపూర్వం కుమార్తెల వివాహం చెయ్యటానికి చక్రవర్తుల కుటుంబం అంత తొట్రుపడేదికాదు—కొడుకుల వివాహానికి పడేది. కుమార్తెల వివాహానికి శుల్కం తీసుకునేవారు—కొడుకుల వివాహానికి పణం ఇచ్చి పిల్లని ఇంటికి తెచ్చుకునేవాళ్ళు. నీలకంఠుని తండ్రి కూడా కుమార్తె వివాహానికి శుల్కం తీసుకున్నాడు. నీలకంఠునికి ఈ ఆచారమంటే తగని

ఏవగింపు. పార్వతిని అమ్మి డబ్బు సంపాయించటం అతని కేమాత్రం ఇష్టం లేదు. ఈ సంగతి పార్వతి తల్లికికూడా తెలుసును. అందుచేతనే కుమార్తెకు త్వరగా వివాహం చేయమని భర్తను ఒత్తిడి చేసేది. ఇప్పటివరకు పార్వతి తల్లి తన మనస్సులో ఒక దురాశకు చోటిచ్చింది. దేవదాసుతో ఏదోవిధంగా పెళ్లి కావచ్చునని ఆమె అనుకున్నది. ఈ ఆశ గగనకుసుమమని ఆమెకు తోచలేదు. పట్టుపట్టితే దేవదాసు తప్పక పెళ్ళిచేసుకుంటాడని ఆమె విశ్వాసం. బహుశా ఆ నమ్మకం తోటే, నీలకంఠుని తల్లి దేవదాసు తల్లి దగ్గర ఒకనాడు ఈ ప్రసంగం ఎత్తింది.

'చూడు అమ్మాయి! దేవదాసుకూ మా పారుకూ ఎంత స్నేహమో! అలాంటి అన్యోన్యత నే నెక్కడా చూడలేదు.'

'ఎందుకుండదు పెద్దమ్మా? వాళ్లిద్దరూ ఒక్క కడుపున పుట్టిన బిడ్డల్లాగా చిన్నప్పటినుంచీ పెరిగారు.'

'అదేను, అమ్మాయీ—అందుకనే అనుకుంటూ ఉంటాను—వాళ్లిదరికీ... ఇదిగో దేవదాసు కలకత్తా వెళ్ళినప్పుడు చూచావుగా, దానికి ఎనిమిదేళ్ళు కూడా నిండలేదు. ఆ వయస్సులోనే వాడి కోసం, తిండీ తిప్పలు మాని కట్టెపుల్లలాగయింది. మనందరికీ తెలుసుగా—దేవదాసు దగ్గరనుంచి ఉత్తరం ముక్క వస్తే దానికి పండుగలా ఉండేది!'

దేవదాసు తల్లి దీని భావం గ్రహించింది. కొంచెం నవ్విందికూడా. ఈ నవ్వులో హేళన ఎంత ఉన్నదో తెలియదు, కాని వేదన మాత్రం చాలా ఉన్నది. ఈ సంగతులన్నీ ఆమెకూ తెలుసు పార్వతిమీద ప్రేమకూడా ఉన్నది. కాని వారి వంశము పిల్లలను అమ్ముకొనేది! పైగా పొరుగు పిల్ల. ఛీ, ఛీ!

'ఇప్పుడు పెళ్ళిచేయటానికి వారికి బొత్తిగా ఇష్టంలేదు అమ్మా! అందులో చదువుకొంటూ ఉన్నాడు. మా పెద్దబ్బాయి ద్విజదాసు పెళ్ళి చిన్నప్పుడే చేయటంవల్ల వాడి చదువంతా నాశనమయిందని నన్నిప్పటికీ దెప్పుతూ ఉంటారు.'

పార్వతి నాయనమ్మ నిరుత్సాహపడింది. అయినా అని చూచింది.

'అదంతా నాకూ తెలును అమ్మాయీ! నువ్వొరుగుదువుగా, పార్వతి కాస్త కాలుబారు పిల్ల—పైగా ఏపుగాకూడా పెరిగింది—అందుకనే—నారాయణ ఇష్టపడకపోతే—'

దేవదాసు తల్లి అడ్డువచ్చింది;

'కాదు పెద్దమ్మా! నేనిక వారికి చెప్పలేను. ఇప్పుడు గనక దేవదాసు పెళ్ళి సంగతి ఎత్తితే, వారిక నాముఖం కూడా చూడరు.'

ఈ ప్రసంగం ఇంతటితోనే అణగి పోయింది. కాని ఆడవాళ్ళ కడుపులో ఏదీ దాగదు. భర్తభోజనం చేస్తూ ఉండగా దేవదాసు తల్లి ఈ ప్రసంగం ఎత్తింది: 'ఇవ్వాళ పారూ నాయనమ్మ దాని పెళ్ళిసంగతి తెచ్చింది.'

'ఆఁ, పారూకు ఈడు వచ్చింది. త్వరగా పెళ్లిచేయటమే మంచిది.' అన్నాడు భర్త తలయెత్తి.

'అందుకనే, ఇవ్వాళ ఆ ప్రసంగం ఎత్తి దేవదాసుకు—'

'నువ్వేమన్నావు?' అన్నాడు భర్త ముఖం చిట్లించి.

'నే నింకేమంటాను! పిల్లలిద్దరికీ సావాసమని ఆ పిల్లను కోడలుగా తెచ్చుకుంటానా? అసలే పిల్లన్ని అమ్ముకునే వంశం పైన పొరుగుకుటుంబం—ఛీ—ఛీ!'

భర్త సంతృప్తి పడ్డాడు: 'అంత గాక! సాటి వాళ్ళలో నవ్వించుకుంటామా? నువ్వు అసలు ఈమాటలే చెవిని పెట్టబోకు' అన్నాడు.

'అచ్చే, నేను వింటానా? మీరుకూడా పొరపడకండి.' అన్నది భార్య, పొడి నవ్వు నవ్వి. భర్త ముఖం గంభీరంగా పెట్టి—'అలాగైతే, ఈ జమీందారీ ఏనాడో పోయేది' అన్నాడు.

వారి జమీందారీ చిరస్థాయిగా ఉన్నా ఎవరికీ ఆక్షేపణ లేదు. కాని, నేను పార్వతి దీన చరిత్రమాత్రం చెప్పుతున్నాను.

ఈ సంగతి నీలకంఠుని చెవిని పడగానే తల్లిని పిలిచి—'నువ్వు వారితో ఎందుకు చెప్పబోతూ వమ్మా?' అని తిరస్కారంగా అడిగాడు. తల్లి మాట్లాడలేదు. 'పిల్ల పెళ్లి చేయటానికి మనకు కాళ్లు పుచ్చుకు తిరగాల్సిన అవసరం లేదు—మన కాళ్లే పుచ్చుకుంటారు. పైగా మన అమ్మాయి అనాకారి కాదు. నేను ఇప్పుడే చెప్పుతున్నాను, చూడు—ఒక్క వారంలో సంబంధం

కుదుర్చుకు వస్తాను! పెళ్లికాదని దిగు లెందుకు?' అన్నాడు.

కాని ఎవరికోసమైతే తండ్రి శాబ్ది చేశాడో, ఆమె నెత్తిన పిడుగుపడింది! దేవదాసుమీద తనకు కొంచెం అధికార మున్నదని పార్వతి చిన్నప్పటినుంచీ నమ్మింది. ఈ అధికారం ఆమెకెవ్వరూ ఇచ్చింది కాదు. ఆమెకు తెలియకుండానే ఆమె మనస్సు నెమ్మదిగా, నిశ్శబ్దంగా, దృఢంగా ప్రతిష్ఠించుకుంటూ వచ్చింది. దాని బాహ్యాకృతి ఏమీ—ఇంతవరకు ఆమెకు కనపడక పోయినా ఇవ్వాళ ఆ అధికారం పోతున్నదని తెలియగానే ఆమె హృదయంలో భయంకరమైన తుపాను రేగింది.

దేవదాసు లెఖ్ఖ వేరు. అతను చిన్నతనంలో పార్వతి మీద పూర్తి అధికారం సంపాదించాడు—చలాయించాడు కూడా. కలకత్తా వెళ్లిన తర్వాత చదువు—సంధ్యల్లోనూ, ఆట పాటల్లోనూ పడి పార్వతిని చాల భాగం వదలివేశాడు. పార్వతి గ్రామ్య జీవితంలో రాత్రిం బగళ్ళు తన నే స్మరించుకొంటున్నదని అతనికి తెలియదు. ఇంతే కాదు; చిన్నప్పుడు ఎవరినైతే తనవారని పూర్తిగా నమ్మాడో, న్యాయా న్యాయ వివక్షణ లేకుండా ఇంతకాలం ఎవరిమీద తన అధికారమంతా చలాయించాడో, అట్టివారిని, యౌవనంలో అడుగుపెట్టగానే—ఇలా హఠాత్తుగా వదిలిపెట్టవలసి ఉంటుందని అతను ఊహించలేదు. అప్పుడు వివాహం సంగతి ఎవరు ఆలోచిస్తారు? ఆ బాల్యబంధంనం వివాహం మినహా ఏవిధంగానూ స్థిరపడదని ఎవరికి తెలుసు?

అందుకనే, 'దేవదాసుతో వివాహం జరగదు' అనే వార్త పార్వతి హృదయంలోని కోరికల్నీ నమ్మకాల్నీ తోసివేయ నారంభించింది. దేవదాసు ఆమెకు ఒంటరిగా కనిపించ లేదు. అతను తరుచుగా బయటకు రావటం లేదు. ఉదయం చదువుకుంటూ ఉండేవాడు. మధ్యాహ్నం ఎండగా ఉంటుందని ఇల్లు కదిలేవాడు కాదు. ఒక్క— సాయంత్రం మాత్రం—అదీ ఇష్టమున్న రోజున—బయటకు వచ్చేవాడు. కోటూ పంట్లాం తొడుక్కుని, బూట్లు వేసుకుని కర్ర చేతపట్టి చక్రవర్తిగారి ఇంటి ముందుగానే—షికారుకు వెళ్లేవాడు. పార్వతి కిటికీ దగ్గర నిలుచుని కళ్ళు తుడుచుకుంటూ చూసేది.

ఎన్నో సంగతులు జ్ఞాపకం వచ్చేవి. ఇద్దరం పెద్దవారం అయామని అనుకునేది. చాలాకాలం ప్రవాసంలో ఉండటంచేత ఇద్దరూ సిగ్గు పడేవారు. ఆ రోజున దేవదాసు సిగ్గుపడి సరిగ్గా మాట్లాడకుండా వెళ్లిపోయాడు. ఈ సంగతి పార్వతి గ్రహించకపోలేదు.

దేవదాసు కూడా ఇలానే భావించే వాడు. అప్పుడప్పుడు పార్వతితో మాట్లాడాలను కొనేవాడు. కాని ఇది మాట్లానికి బాగా ఉంటుందా అని మళ్ళీ సందేహించేవాడు. ఇక్కడ కలకత్తాలో మాదిరి కోలాహలం లేదు; సినిమా డ్రామాలు లేవు, ఆట పాటలు లేవు—అందుకనే చిన్ననాటి సంగతులు జ్ఞాపకం వచ్చేవి. 'ఆరే, అలాంటి పార్వతి ఇలా అయి పోయిందా' అని అనుకునేవాడు. పార్వతికూడా 'అప్పటి దేవదాసు ఇప్పుడు దేవదాస బాబుగా మారాడా ?' అని అనుకునేది. దేవదాసు ఇప్పుడు విశేషించి చక్రవర్తి గారింటికి వెళ్ళటం లేదు. ఎప్పుడన్నా ఒక రోజున షికారుకు వెళ్లేటప్పుడు వారివాకిటి దగ్గరకు వచ్చి—'ఏం చేస్తున్నారు, అత్తయ్యా ?' అని పిలిచేవాడు.

'రా నాయనా ! వచ్చికూర్చో,' అని పార్వతి తల్లి ఆహ్వానించేది.

'ఇప్పుడు కాదులే అత్తయ్యా, కాస్త తిరిగొస్తాను.' అని అనేవాడు.

ఇలాంటప్పుడు పార్వతి ఒక్కొక్క రోజున వెనక ఇంట్లో ఉండేది. ఒక్కొక్కరోజున ఎదుట పడేది. దేవదాసు తల్లితో మాట్లాడుతూ ఉంటే పార్వతి చల్లగా అక్కడనుంచి తప్పుకు వెళ్లేది. రాత్రి దేవదాసు గదిలో దీపం వెలుగుతూ ఉండేది. ఎండాకాలం కాబట్టి కిటికీతలుపులు తెరచి ఉండేవి. పార్వతి చాలా ఓపికతో అటువైపే చూస్తూ ఉండేది—ఏమీ కనపడేదికాదు. పార్వతి మొదటినుంచి అభిమానిని. ఎంత బాధ అయినా సహించేది కాని ఇతరులకు తెలియనిచ్చేదికాదు. ఇతరులకు చెప్పితే మాత్రం లాభమేమిటి ? సానుభూతి ఆమె సహించలేదు. ఇక తిరస్కారం—వేళాకోళం ?—అంతకంటే చావే మంచిది.

క్రిందటి సంవత్సరమే మనోరమకు వివాహమయింది. ఇంకా అత్తవారింటికి పోలేదు. అందుచేత మధ్య మధ్య వస్తూ ఉండేది. పూర్వం సఖులిద్దరూ కలిసి

నప్పుడు మాటల సందర్భంలో ఈ సంగతికూడా వస్తూ ఉండేది—ఇప్పుడు కూడా వస్తూ ఉన్నది. కాని పార్వతి ఇప్పుడందులో పాల్గొనటంలేదు. మొదలకుండానైనా ఊరుకునేది—లేక ప్రసంగమన్నా మార్చేది.

పార్వతి తండ్రి రాత్రే ఇంటికి తిరిగివచ్చాడు. ఇన్నాళ్ళనుంచీ ఆయన వరుణ్ణి వెతకటానికిపోయాడు — ఒక్కమాటే లగ్నంకూడా పెట్టుకొని వచ్చాడు. ఇగవై ఇరవై అయిదు క్రోసుల దూరములో వర్ధమాన జిల్లాలో ఉన్న హాథీపోతా గ్రామ జమీందారే, వరుడు. స్థితి బాగా ఉంది. వయసు నలభైకిలోపే, గత వత్సరమే భార్య పోయింది, మళ్ళీ వివాహం చేసుకుంటున్నాడు. ఈ శుభవార్త ఇంట్లో అందరికీ సంతోషం కలిగించిం దనటానికి వీల్లేదు. పైగా దుఃఖకారణమైంది. కాని భువన చౌదరి (వరుని) దగ్గరనుంచి పెళ్లి ఖర్చులకుగాను రెండువేలు వస్తాయని విన్నతర్వాత ఆడం గులు ఇక మాట్లాడలేదు.

ఒక రోజున, మధ్యాహ్నం దేవదాసు భోజనం చేస్తూ ఉండగా, తల్లి, దగ్గరకువచ్చి కూర్చుని 'పారూ పెళ్ళట!' అని అన్నది.

'ఎప్పుడు?' అని అడిగాడు దేవదాసు తలపైకెత్తి.

'ఈ మాసంలోనే. నిన్న పెళ్ళికొడుకు స్వయంగావచ్చి పిల్లను చూసి పోయాడు.' దేవదాసు కొంచెం ఆశ్చర్యం కలిగింది.—'ఏమో, నాకు తెలియనే లేదే, అమ్మా!' అన్నాడు.

'నీకెలా తెలుస్తుంది?—పెళ్ళికొడుకు కొంచెం బొద బొద లాడుతూ ఉంటాడు. వయసుకూడా మిగిలింది. అయితే డబ్బూ దస్కం మాత్రం చాలా వున్నదట. పార్వతి సుఖంగా బ్రతుకుతుంది.'

దేవదాసు తలవంచుకు అన్నం తింటున్నాడు. మాట్లాడలేదు.

'ఆ పిల్లను నీకివ్వాలని మాశారు' అన్నది మళ్ళీ.

'తర్వాత?' అని అడిగాడు దేవదాసు తలఎత్తి.

తల్లి నవ్వింది—'ఛా, అదెలా కుదురుతుంది. అసలే పిల్లల్ని అమ్మకునే వంశం. పైగా పొరుగుపిల్ల! ఛీ, ఛీ—' అని తల్లి పెదవి విరిచింది.

దేవదాసు అది గమనించాడు: తల్లి కొంచెంసేపుండి మళ్ళీ అన్నది.

'మీ నాన్నకు చెప్పాను.'

'ఏమన్నాడు?'

'ఇంకా ఏమంటాడు? ఇంత గొప్పవంశాన్ని నవ్వులపాలు చేయ నన్నాడు.' దేవదాసు ఇక ఏమీ అడగ లేదు.

ఈ సమయంలోనే పార్వతికీ మనోరమకూ సంభాషణ జరుగుతూ ఉన్నది. పార్వతి కళ్ళల్లో నీరు—మనోరమ బహుశా, ఇంతకుముందే తుడుచుకుని ఉంటుంది. 'అయితే ఇక కర్తవ్యమేమిటి చెల్లీ?' అని అడిగింది మనోరమ.

పార్వతి కళ్ళు తుడుచుకుని—'ఇంకా కర్తవ్యమేముంది? నీ భర్తను నువ్వు ఇష్టపడే పెళ్లి చేసుకున్నావా?' అన్నది.

'నా సంగతి వేరు. నాకు ఇష్టమూలేదు; అయిష్టమూలేదు. అందుకని నాకిలాంటి కష్టాలేవీ లేవు. కాని, నీచేత్తో నువ్వు గొంతు కురి పోసు కుంటున్నావు!'

పార్వతి జవాబివ్వలేదు. ఆలోచనలోపడింది. మనోరమ ఏమి ఆలో చించుకున్నదో కాని మందహాసం చేస్తూ—'పారూ, నీ భర్త వయ స్సెంతే?' అంది.

'ఎవరి భర్త?'

'నీ—'

'పార్వతి లెఖ్ఖ వేసి—పందొమ్మిది ఉంటాయి.' అన్నది.

మనోరమకు మహా ఆశ్చర్యం వేసింది—'అదేమిటే, నేను నలభై అని విన్నానే?' అన్నది.

ఈమాటు పార్వతికూడా మందహాసంచేసి—'మనోదీదీ! ఈప్రపంచంలో ఎంతమందికి నలభై ఏళ్ళు లేవు? వాళ్లందరి లెఖ్ఖలు నాదగ్గర ఉన్నాయా? నాభర్త వయస్సుమాత్రం 19—20 ఉంటవని నేను ఎరుగుదును.'

'పేరేమిటి?'

పార్వతీ మళ్లీ నవ్వి 'ఇన్నాళ్లనించీ అడిగావా తెలియదూ?' అన్నది.

'నాకెలా తెలుస్తుంది?'

'తెలియదూ ? సరే. నేను చెప్తాను !' అని మందహాసం చేసి, తర్వాత గంభీరంగా మనోరమ చెవి దగ్గర నోరుపెట్టి పార్వతి అన్నది:—

'తెలియదూ. శ్రీ దేవదాస—' మనోరమ మొదట చకితురాలయింది. తర్వాత పార్వతిని వెనక్కుపడనెట్టి—'ఇక వేళాకోళంతో లాభంలేదు. పేరు చెప్పదలచుకుంటే ఇప్పుడే చెప్పు. తర్వాత చెప్పటానికి వీలుండదు.' అంది.

'ఇప్పుడు చెప్పానుగా !'

'దేవదాసైతే ఇంతగా ఏడ్చి చస్తావెందుకు?' అంది మనోరమ కోపంతో.

పార్వతి ముఖం ఒక్కసారిగా నల్లబడింది. కొంచెం ఆలోచించుకొని 'అదీ నిజమే. నేను ఇక ఏడవను—' అన్నది.

'పారూ ?'

'ఏమిటి ?'

'సంగతంతా విప్పి చెప్పు చెల్లీ ! నాకేమీ అర్థం కావటంలేదు.'

'చెప్పాలిసిందంతా చెప్పితినిగా.'

'కాని, నాకేమీ అర్థం కానిదే ?'

'ఎలా చెప్పినా కాదు !' అని పార్వతి ముఖం తిప్పుకున్నది.

పార్వతి కొన్ని సంగతులు దాస్తున్నదనీ, మనస్సులోని సంగతులన్నీ విప్పి చెప్పటం లేదనీ మనోరమ భావించింది. ఆమెకు అభిమానమూ దుఃఖమూ రెండూ కలిగాయి. 'పారూ, నీ దుఃఖం నాది కాదా చెల్లీ ! నువ్వు సుఖంగా ఉండటం కంటే నాకు కావలసింది ఏముంది ?—నీ కేమన్నా చెప్పకూడని సంగతులుంటే మానేయి, కాని నన్నిలా వేళాకోళం మాత్రం చేయకు !'

ఈ మాటలు ప్వార్వతికి చాలా కష్టం కలిగించాయి:—'వేళాకోళం చేయటం లేదక్కాయి ! నాకు తెలిసినంతవరకు నీకు చెప్పనే చెప్పాను. నాకు తెలిసిందల్లా నా భర్త పేరు దేవదాసు ; వయస్సు పందొమ్మిదీ ఇరవై ఏళ్లు. అదే నీకు చెప్పాను.'

'కాని నే నిప్పుడేగా విన్నది—నీకెక్కడో సంబంధం స్థిరపడిందని ?'

'స్థిరపడ కింకేమున్నది ! నాయనమ్మనిచ్చి ఎలానూ చేయరు. జరిగితే నాతోనే జరుగుతుంది. కాని నాకు మాత్రం ఈ సంగతులన్నీ తెలియవు.'

మనోరమ విన్నదంతా ఏకరువు పెట్టబోయింది. పార్వతి అడ్డొచ్చి 'ఇదంతా నేనూ విన్నదే—చెప్పనక్కర్లేదు.' అన్నది.

'మరి దేవదాసు నిన్ను—'

'ఏమిటి నన్ను?'

'ఐతే స్వయంవరం అన్నమాట? చాటు చాటున అంతా గట్టి బందోబస్తు చేసుకున్నావా?' అన్నది మనోరమ నవ్వును ఆపుకుని.

'గట్టీ, ఓడూ ఇంకా ఏమీ తేలలేదు.'

మనోరమ వ్యథిత స్వరంతో—'నువ్వు చెప్పేదేమిటో నాకు అర్థం కావటంలేదు పారూ?' అన్నది.

'అలాగైతే దేవదాసు నడిగి నీకంతా తెలిసేటట్టు చెప్తాను.'

'ఏమడుగుతావు? పెళ్ళిచేసుకుంటావా, లేదా, అనేగా?'

'ఆఁ, అదే.' అన్నది పార్వతి తలతిప్పుతూ.

మనోరమకు ఆశ్చర్యం కలిగింది: 'ఏమిటి నువ్వన్నది పారూ! నీయంతట నువ్వే పోయి అడుగుతావా?'

'తప్పేముంది, అక్కయ్యా!'

మనోరమ కింకా ఆశ్చర్యం వేసింది: 'ఏంటీ నువ్వన్నది? నువ్వే వెళ్తావా?'

'నేను కాకపోతే నాకోసం ఎవరు అడగబోతా రక్కయ్యా?'

'సిగ్గువేయదూ?'

'సిగ్గు ఎందుకు? నీకు చెప్పటానికి నే నేమి సిగ్గుపడ్డాను?'

'నే నాడదాన్ని, పైగా నీ సఖినీ- కాని, అతను మగవాడుగా పారూ?'

పార్వతి ఈమాటకు నవ్వింది:—'నువ్వు నా సఖివీ, నాదానివీ!—ఇక అత నేనా పరాయివాడు? నీతో అన గలిగినమాట ఇక అతనితో అనలేనా?'

మనోరమ విస్తుపోయి పార్వతి ముఖం వంక చూస్తూ ఉండిపోయింది.

పార్వతి నవ్వు ముఖంతో మరల అన్నది:—'మనో! మీరు కాళ్ళకు పసుపూ, నొసట కుంకుమా వృథాగా పెట్టు కుంటున్నారు. ఎవరిని స్వామి అనాలోకూడా మీకు తెలియదు. అతను నా స్వామి కాకపోతేనూ నా లజ్జా సంకోచాలకు అతీతుడు కాకపోతేనూ, నే నిలా అతని కోసం చావటానికి

కూర్చోను. ఇంతేకాక, చాకదలచుకొన్న వ్యక్తి విమం తియ్యగా ఉంటుందా చేదుగా ఉంటుందా అని ఎప్పుడూ ఆలోచించను. అతని దగ్గర నాకు రవ్వంత కూడా సిగ్గులేదు.'

మనోరమ పార్వతి ముఖం వంక కాసేపు విస్మయంతో చూచి—'ఏ మంటున్నావు? నీపాదాలదగ్గర కొంచెం చోటివ్వమనేగా?' అన్నది.

పార్వతి ఔనన్నట్టు తలతిప్పి 'సరిగ్గా అదే అడుగుతా నక్కయ్యా!' అంది.

'అతను చోటివ్వకపోతే?'

ఈమాటు పార్వతి చాలాసేపు జవాబివ్వలేదు: 'అప్పటిసంగతి నాకిక తెలియదు అక్కయ్యా!' అన్నది తర్వాత కాసేపటికి.

ఇంటికి తిరిగి వెళ్ళేటప్పుడు మనోరమ—'అబ్బ, దీని గుండెధైర్యం చెప్ప కోవలసిందే, నేను చస్తున్నాగాని ఇలాంటి మాటను నోటినుంచి రానిచ్చే దాన్నికాను.' అని మనస్సులో అనుకున్నది.

ఈ మాట నిజమే! అందుకనే పార్వతి కూడా—మీరాదు అనవసరంగా పసుపూ కుంకుమా పాడుచేసుకున్నారని—అన్నది!

* * *

రాత్రి ఒంటి ఘంట కావచ్చును. వెన్నెల గుడ్డిగా ఉన్నది. పార్వతి పక్క దుప్పటిని ఆపాదమస్తకమూ చుట్టుకొని నెమ్మదిగా మెట్లుదిగి ఒక మాటు నాలుగు దిక్కులా పరికించింది—ఎవ్వరూ మేలుకొని లేరుకదా అని. తర్వాత నిశ్శబ్దంగా తలుపు తెరచుకుని బయటకు వచ్చింది. పల్లెటూరు—చడీ చప్పుడూ ఏమీ లేదు. ఎవరైనా ఎదురు పడతారేమో నని భయంకూడా లేదు. ఈమె నిరాటంకంగా జమీందారుగారి ఇంటిముందు వచ్చి నిలబడింది. సింహద్వారం దగ్గర వృద్ధ దర్వాన్ కృష్ణసింగు తన క్కి మంచం మీద కూర్చుని ఇంకా తులసీ రామాయణం పారాయణచేస్తున్నాడు. పార్వతి రావటం చూసి తల ఎత్తకుండానే 'ఎవరువారు' అని ప్రశ్నించాడు. పార్వతి 'నేనే' అన్నది.

దర్వాన్ కంఠస్వరాన్ని బట్టి స్త్రీ అని గ్రహించాడు! దాసీ కావచ్చు నని ఊహించి [illegible] తిరిగి [illegible] తులసీ రామాయణపారా యణంలో పడ్డాడు. పార్వతి దాటిపోయింది. ఎండాకాలం, బయట చాలా

మంది నౌకర్లు పడుకొని ఉన్నారు. వారిలో కొంతమంది గాఢనిద్రలో ఉన్నారు. కొంతమంది అర్ధ సుప్తావస్థలో ఉన్నారు. నిద్రమత్తులో కొందరు పార్వతిని చూసినా చూసి ఉండవచ్చు—కాని, దాసీ అనుకొని ఎవ్వరూ పలకరించలేదు. పార్వతి నిరాటంకంగా లోపల ప్రవేశించి మెల్లగుండా పైకి ఎక్కింది. ఈ ఇంట్లో ప్రతి గదీ ప్రతి గవాక్షమూ ఈమెకు పరిచితమే. దేవదాసు గది గుర్తించటానికి ఎక్కువసేపు పట్టలేదు. తలుపు తెరచే ఉన్నది. లోపల దీపంకూడా వెలుగుతూ ఉన్నది. పార్వతి లోపల ప్రవేశించింది. దేవదాసు మంచంమీద పడుకొని నిద్రపోతూ ఉన్నాడు. తెరచిన పుస్తకం ఒకటి తలవైపున పడి ఉన్నది—[illegible] చూస్తే అతనికి ఇంతకు ముందే కన్ను అంటినట్లుగా ఉన్నది. దీపం వత్తి పెద్దదిచేసి, పార్వతి దేవదాసు కాళ్ళదగ్గర నిశ్శబ్దంగా కూర్చున్నది. గోడమీనున్న పెద్దగడియారం మాత్రం 'టిక్, టిక్' అని శబ్దం చేస్తూ ఉన్నది. ఇది మినహా అంతా నిశ్శబ్దం—అంతా సుప్తం.

కాళ్ళమీద చేయిపెట్టి పార్వతి—'దేవదా!' అని మెల్లగా పిలిచింది.

దేవదాసు నిద్రమత్తులో ఎవరో పిలుస్తున్నట్లుగా విన్నాడు. కాని కళ్ళు తెరవకుండానే—'ఊఁ!!' అన్నాడు.

'ఓ దేవదా'—ఈమారు దేవదాసు కళ్ళు నులుపుకుంటూ లేచి కూర్చున్నాడు. పార్వతి ముఖాన ముసుగు ఏమీలేదు. ఇంట్లో దీపం నిండుగా వెలుగుతూ ఉన్నది. దేవదాసు పార్వతిని చాలా సులభంగానే గుర్తించాడు. కాని, మొదట అతనికి నమ్మకం కలగలేదు. 'ఎవరు? పారూ!' అన్నాడు.

'ఆఁ, నేనే.'

దేవదాసు గడియారం వంక చూశాడు. అతనికి ఆశ్చర్యంలో ఆశ్చర్యం కలిగింది. 'ఇంత పొద్దుపోయా?' అన్నాడు.

పార్వతి జవాబివ్వలేదు. తల వంచుకు కూర్చున్నది.

'ఇంత రాత్రిపూట ఒంటరిగానే వచ్చావా?' అని మళ్ళీ అడిగాడు.

'ఆఁ,' అన్నది పార్వతి. దేవదాసు ఉద్వేగంతోనూ, సందేహంతోనూ కంటకితుడయ్యాడు: 'ఏమిటీ! దారిలో భయం వెయ్యలేదా?' అన్నాడు.

'భూతాలకు నేనంత భయపడను !' అన్నది మకిదహాసం చేస్తూ.

'భూతాలకి కాకపోయినా మనుషులకన్నా భయపడాలిగా! ఎందుకొచ్చావ్ ?'

పార్వతి జవాబివ్వలేదు. 'అదే నాకింకా తెలియలేదని మనస్సులో అనుకున్నది. 'ఇంట్లో ఎలా ప్రవేశించావు ? ఎవరూ చూడలేదా ?'

'దర్వాన్ చూశాడు.'

దేవదాసు కళ్లు పెద్దవి చేశాడు! 'దర్వాన్ చూశాడా ? ఇంకెవరూ?—"

'వరండాలో నౌకర్లు పండుకుని ఉన్నారు. వాళ్లల్లోకూడా బహుశా ఎవరన్నా చూడవచ్చు.'

దేవదాసు మంచంమీదనుంచి ఎగిరిదూకి తలుపు బిగించాడు. 'ఎవరన్నా గుర్తించారా ?'

పార్వతి ఏమాత్రం అదుర్దా చూపించకుండా, చాలా సహజంగా వాళ్లంతా నన్నెరుగుదురు. ఒకవేళ ఎవరైనా గుర్తించినా గుర్తించవచ్చును.' అన్నది.

'ఏమిటి పారూ! ఇలాంటిపని ఎందుకు చేశావు ?'

'అది నీకే తెలుస్తుం'దని పార్వతి మనస్సులో అనుకున్నది. కాని, పైకి ఏమీ మాట్లాడలేదు.

'ఇంతరాత్రా! ఛీ! రేపు నీ ముఖ మెలా చూపిస్తావు ?'

'నా కా ధైర్యమున్నది' అన్నది పార్వతి తల ఎత్తకుండానే.

ఈ మాటకు దేవదాసు కోపించలేదు. కాని చాలా ఉత్కంఠితుడై—

'ఛీ, ఛీ, ఇంకా నువ్వు చిన్నపిల్లవేనా పారూ! ఇలాంటి సమయంలో ఇక్కడికి రావటానికి నీకు కాస్తన్నా సిగ్గు వేయలేదా ?'—అన్నాడు.

'పిసం కూడా లేదు' అన్నది పార్వతి తలతిప్పుతూ.

'రేపు సిగ్గుతో నీ తల వాలిపోదూ ?'

ప్రశ్నవిని పార్వతి తీవ్ర కరుణా దృక్కులతో దేవదాసు ముఖంచూసి—

'తల వాలిపోయేదే—నువ్వు నాసిగ్గును కప్పెడతావన్న నమ్మకం నాకు లేకపోతే.' అన్నది నిస్సంకోచంగా.

దేవదాసు విస్మయంతో హతబుద్ధుడై—'నేనా! కాని, నేను మాత్రం ముఖం ఎలా చూపిస్తాను?' అని అడిగాడు.

పార్వతి అలాగే తొట్రుపడని స్వరంతో 'నువ్వా? నీకేం దేవదా!' అని ఒక్క క్షణం ఆగి—'నువ్వు మగవాడివి. ఇవ్వాళ కాకపోతే రేపైనా నీ కళంకం చరిత్ర అందరూ మరిచిపోతారు. ఫలానారోజున మందభాగిని పార్వతి—ప్రపంచాన్నంతా తుచ్ఛంగా చూసి — నీ పాదాలమీద పడటానికి వచ్చిందని ఎవ్వరూ గుర్తుపెట్టుకోరు.'

'అదేంటి పారూ?'

'—ఇక నేను—'

'ఇక నీవు?' అన్నాడు దేవదాసు మంత్రముగ్ధునివలె.

'నా కళంకంసంగతి అడుగుతారా? ఊహుఁ—నాకేమీ కళంకం లేదు. నీ దగ్గరకు చాటుగావచ్చానని నన్నెవరైనా నిందించినా ఆ నింద నాకు అంటదు.'

'అదేంటి పారూ! ఏడుస్తున్నావా?'

'దేవదా, నదిలో ఎంత నీరున్నది! అంత నీరుకూడా నా కళంకాన్ని కప్పిపెట్టలేదా?'

దేవదాసు చప్పున పార్వతి రెండు చేతులూ పట్టుకొని — 'పార్వతీ!' అన్నాడు. పార్వతి దేవదాసు కాళ్ళమీద తలపెట్టి— 'ఇక్కడే కొంచెం చోటివ్వు దేవదా!' అని గద్గద స్వరంతో అన్నది.

తర్వాత ఇద్దరూ నిశ్శబ్దంగా కూర్చున్నారు. దేవదాసు కాళ్లమీదినుంచి అశ్రు బిందువులు తెల్లని శయ్యమీద పడ నారంభించాయి.

చాలసేపయినతర్వాత దేవదాసు పార్వతిముఖం పైకెత్తి—'పారూ, నేను తప్ప నీకిక గత్యంతరంలేదా?' అని అడిగాడు.

పార్వతి జవాబివ్వలేదు. మరల అలాగే పాదాలమీద తలపెట్టింది. ఈమె అశ్రువ్యాకుల ఘన దీర్ఘ నిశ్వాసలు ఆ నిస్తబ్ధమైన గదిని ఆవరించినట్టుగా కనిపించినవి. గడియారం టంగ్, టంగ్ అని రెండు కొట్టింది. దేవదాసు—'పారూ!' అని పిలిచాడు.

పార్వతి రుద్ధకంఠంతో—'ఏమిటి' అన్నది.

'మా అమ్మకీ నాయనకీ బొత్తిగా ఇష్టంలేదు—తెలుసునా?'

పార్వతి 'తెలుసు' నన్నట్లుగా తల ఊపింది. తర్వాత ఇద్దరూ మాట్లాడకుండా చాలాసేపు కూర్చున్నారు.

'అయితే మరెందుకిలా అంటున్నావు?' అన్నాడు దేవదాసు నిట్టూర్చి.

నీళ్ళల్లో మునిగినవ్యక్తి ఎలా గుడ్డిగా నేలను పట్టుకు కూర్చుంటారో, అది వదలటానికి ఎలా ఇష్టపడరో—అలానే-అజ్ఞానివలె పార్వతి దేవదాసు కాళ్లు రెండూ పట్టుకుని—'నేనిక ఏమీ వినదలచలేదు, దేవదా!' అన్నది ముఖం వంక చూస్తూ.

'మా తల్లిదండ్రులకు ఎదురు తిరగమంటావా, పారూ?'

'తప్పేమున్నది? ఎదురు తిరుగు.'

'అయితే నువ్వెక్కడ ఉంటావు?'

పార్వతి ఏడుస్తూ అన్నది: 'నీ పాదాల—

తర్వాత ఇద్దరూ మరల మాట్లాడకుండా కూర్చున్నారు. గడియారం నాలుగుగంటలు కొట్టింది. ఎండాకాలపు రాత్రి. ఇంకా కాసేపటికే తెల్లవారుతుంది. దేవదాసు పార్వతి చెయ్యిపట్టుకుని— 'పద, నిన్ను ఇంటిదగ్గర విడిచిపెట్టి వస్తాను.' అన్నాడు.

'నా వెంట వస్తావా ?'

'పోయే దేముంది? అంతగా అపవాదువస్తే తర్వాత చూసుకోవచ్చు.'

'ఐతే పద.'

ఇద్దరూ చప్పుడు చేయకుండా బయలుదేరారు.

* * *

మరునాడు దేవదాసు, తండ్రితో చాలా కొద్దిసేపే మాట్లాడాడు.

తండ్రి—'నువ్వు పుట్టినప్పటినుంచీ నన్ను వేధిస్తూనే వచ్చావు. ఇక బ్రతికినన్నాళ్ళుకూడా నీ బాధలు తప్పేటట్టు లేవు. నీ నోట ఈ మాట వినటంలో నాకేమీ ఆశ్చర్యం లేదు' అన్నాడు.

దేవదాసు మాట్లాడకుండా తలవంచుకు కూర్చున్నాడు.

తండ్రి— 'నాకీ సంగతంతా తెలియదు. మీ అమ్మా నువ్వూ కలిసి ఏదో ఒకటి చేసుకోండి' అన్నాడు.

తల్లి ఈమాట విని ఏడ్చింది:— 'నాయనా, ఇదికూడా మా రాతలో ఉందా!' అన్నది.

ఆనాడే దేవదాసు పెట్టే బేడా సర్దుకొని కలకత్తా వెళ్ళిపోయాడు. ఈ సంగతులు తెలియగానే అసలే కఠినంగా ఉన్న పార్వతి ముఖం ఇంకా కఠోరమైంది. నవ్వి ఊరుకున్నది. క్రిందటిరాత్రిసంగతి ఎవ్వరికీ తెలియలేదు. తానూ చెప్పలేదు. కాని మనోరమ వచ్చి— 'పారూ, దేవదాసు కలకత్తా వెళ్ళాడట నిజమేనా?' అని అడిగినప్పుడు 'ఊఁ—' అన్నది పార్వతి.

'మరి నిన్నేమి చేసి పోయాడే?'

ఏమి చేసిందీ పార్వతికే తెలియదు. ఇతరులకేమి చెప్పుతుంది ?

నేటికి కొన్ని దినాలనుంచి రాత్రింబగళ్ళూ ఆమె ఈ సంగతే ఆలోచిస్తున్నది. కాని, ఇందులో ఆమెకు ఆశ ఎంత ఉన్నదో నిరాశ ఎంత ఉన్నదో, ఏమాత్రమూ స్థిరపరుచుకో లేకపోయింది. ఇలాంటి చెడుసమయాల్లో, ఆశా నిరాశల ఒడ్డు ఏదీ దొరకనప్పుడు, మానవుని దుర్బల మనస్సు భయపడుతూనైనా సరే—ఆశ వైపుకే మొగ్గుతూ ఉంటుంది. ఏదైతే తనకు మేలో అదే ఆశిస్తుంది. ఇచ్ఛతో కానీయండి, అనిచ్ఛతో కానీయండి ఆవైపే చూస్తూ ఉంటుంది. పార్వతికూడా—ఈ స్థితిలో, కొంత బలవంతంగానే— నిన్నరాత్రి ప్రసంగం వృథాపోదని ఆశించింది, విఫలమైతే తనస్థితి ఏమవుతుందని ఆమె ఆలోచించనే లేకపోయింది. అందుకనే ఆమె— 'దేవదాసు మళ్ళీ వస్తాడు. నన్ను పిలిచి 'పారూ, నాబొందిలో ప్రాణముండగా నిన్నితరుల చేతికి పోనిస్తానా!' అని అంటాడని భావించింది. కాని రెండు రోజులు గడచిన తర్వాత పార్వతికి ఈ క్రింది ఉత్తరం వచ్చింది.

"పార్వతీ, ఇవ్వాళిటికి రెండు రోజులనించి నేను నీసంగతే ఆలోచిస్తున్నాను. నా తల్లిదండ్రులలో ఎవ్వరికికూడా మన వివాహమంటే బొత్తిగా ఇష్టంలేదు. నిన్ను సుఖపెట్టాలంటే వారిని చాలా కష్టపెట్టాల్సి ఉంటుంది— ఇది నాకు అసాధ్యం. అదీకాక వారిని ఎదిరించి నేనీ పని ఎలా చేయ

గలను? నీకు మరల ఉత్తరం రాస్తాననే నమ్మకం నాకు లేశంకూడా లేదు. అందుకని, ఈ ఉత్తరంలోనే అంతా విప్పి రాస్తున్నాను.

'మీది కులీన కుటుంబంకాదు. నువ్వు పిల్లల్ని అమ్ముకునే ఇంటిపిల్లవు. అమ్మ నిస్సంతమాత్రం ఇంట్లో అడుగుపెట్టనివ్వదు. నాన్న సంగతి నీకు తెలుసునుగా. ఆ రాత్రి సంగతి జ్ఞాపకంవస్తే నాకు చాలా కష్టంగా ఉంటున్నది. కారణం, నీవంటి అభిమానిని ఎంతకష్టంలో ఉంటే ఈపని చేస్తుందో నాకు తెలుసును.

'ఇంకో సంగతి. నిన్ను నేను చాలా ప్రేమిస్తున్నట్లుగా నాకెప్పుడూ తోచలేదు. ఇవ్వాళకూడా, నీకోసం నా అంతరంగం ఎక్కువ పరితపించటం లేదు. ఇక నువ్వు కష్టపడిపోతావనే, నాకున్న దిగులూ, చింతా. ప్రయత్నించి నన్ను మరచిపో, నీకు సాఫల్యం కలుగుగాక! అని మనస్ఫూర్తిగా ఆశీర్వదిస్తున్నారు. —దేవదాసు.

ఉత్తరం పోస్టు చేయనంతవరకు దేవదాసు ఒకవిధంగా ఆలోచించాడు. చేసిన మరుక్షణం నుంచీ ఇంకోవిధంగా ఆలోచింపనారంభించాడు—రాయి విసరి రెప్పవాల్చకుండా అటే చూడ నారంభించాడు. ఏదో అస్పష్టమైన ఆశంక అతని మనస్సును ఆవరింపసాగింది—ఈరాయి పార్వతి తలమీద ఎలా పడుతుంది?—బాగా తగులుతుందా?—అసలు బ్రతుకుతుందా? అని ఆలోచింప నారంభించాడు. పోస్టాఫీసునుంచి తిరిగివస్తూవుంటే అతనికి ఆ రాత్రి సంగతే, పార్వతి కాళ్ళమీద తలపెట్టి ఏడ్చినసంగతి—తలపుకు రా మొదలుపెట్టింది. తాను చేసినపని మంచిదేనా? అన్నిటికంటే అతను ముఖ్యంగా ఆలోచిస్తున్నది, పార్వతిలో దోషమేమీ లేనప్పుడు తల్లి దండ్రులు ఎందుకు వద్దన్నారా? అని. దేవదాసుకు వయోవృద్ధితోపాటు కలకత్తాలోవున్న అనుభవంకూడా తోడయింది. కేవలం, లోకాచారం, కుల మర్యాదలమీద ఆధారపడి, అర్థంలేకుండా ఒకప్రాణాన్ని నాశనం చేయుటం భావ్యం కాదని అతను గ్రహించాడు. పార్వతి తన హృదయజ్వాలను చల్లార్చుకోటానికి నదికి పరుగెత్తితే, ఈ పాపం సృష్టికర్తకు అంటుకోదా?

బసకు తిరిగివచ్చి దేవదాసు గదిలో పండుకున్నాడు. ఇప్పుడతను మెస్‌లో

ఉంటున్నాడు. మేనమామ ఇల్లు అతను ఎప్పుడో వదలిపెట్టాడు—అక్కడ అతనికి అంత వీలుగా ఉండలేదు. దేవదాసు గదికి పక్కగదిలో చున్నీలాల్ అనే యువకుడొకడు ఇప్పటికి తొమ్మిది సంవత్సరాలనుండి ఉంటున్నాడు. ఇతని ఈ దీర్ఘ కలకత్తా నివాసం బి. ఏ. చదవటంలోనే గడిచిపోయింది. ఇంకా ఇతనికి సాఫల్య దేవత ప్రసన్నం కాలేదు. చున్నీలాలు లేచి నిత్య కృత్యానికి—సాయంత్రం షికారుకు—బయలుదేరాడు. తెల్లవారినాక తిరిగి వస్తాడు. దాసీవచ్చి దీపం వెలిగించి పోయింది. దేవదాసు తలుపులు బిగించి పండుకున్నాడు.

తర్వాత ఒక్కొక్కరుగా మెస్‌లో వాళ్ళంతా తిరిగివచ్చారు. భోజనానికి దేవదాసునుకూడా పిలిచారు. కాని అతను లేవలేదు. చున్నీలాలు రాత్రి ఎప్పుడూ భోజనానికి ఉండడు—ఇవ్వాళకూడా రాలేదు.

అప్పుడు రాత్రి ఒంటిగంట అయివుంటుంది. మెస్‌లో దేవదాసు తప్ప ఇంకెవ్వరూ మేలుకొనిలేరు. చున్నీలాలు తిరిగివచ్చి, దేవదాసు గదిలో దీపం వెలుగుతూ వుండటంచూసి నిలబడ్డాడు. తలుపు వేసేవున్నది—'దేవదాస్! ఇంకా మేలుకొనే వున్నావటోయి!' అని కేక వేశాడు.

'ఆఁ. ఇవ్వాళ నువ్వు రాత్రిపూట వచ్చావేం?' అన్నాడు దేవదాసు లోపల ఉండే.

'ఒంట్లో బాగా లేదోయ్.' అని చున్నీ నవ్వుకుంటూ వెళ్ళిపోయి, కాసేపటికి మళ్ళీ తిరిగివచ్చి—'దేవదాస్! ఒకమాటు తలుపుతీస్తావా?' అని అడిగాడు.

'ఆఁ. ఎందుకు?'

'పుగాకు ఉన్నదా?'

'ఆఁ' అని దేవదాసు తలుపు తెరచాడు.

చున్నీలాలు హుక్కాలో పుగాకు వేస్తూ—'ఇంకా మేలుకొని ఉన్నావేం దేవదాస్!' అన్నాడు.

'రోజూ నిద్ర పట్టుతుందా?'

'పట్టదా? నీవంటి బుద్ధిమంతు డెప్పుడూ రాత్రి రెండోఝాము చూసి

ఉండదని నేను అనుకొనే వాడిని. ఇవ్వాళ నీవు నాకు కొత్తపాఠం నేర్పావు!' అన్నాడు చున్నీ వెటకారంగా.

దేవదాసు మాట్లాడలేదు. చున్నీ హుక్కా త్రాగుతూ ప్రశ్నించాడు:

'దేవదాస్! నువ్వు ఇంటిదగ్గరనించి వచ్చినప్పటినుంచీ ఒక తరహాగా ఉన్నావు. నీ మనస్సులో ఏమన్నా చింత ఉందా?'

దేవదాసు పరధ్యానంగా ఊసుకున్నాడు. జవాబివ్వలేదు.

'నీ మనస్సు బాగాలేదు కదూ?'

దేవదాసు చివ్వన లేచికూర్చుని, వ్యంగ్యభావంతో చున్నీ ముఖం వంక చూస్తూ-'సరేగాని, చున్నీ! నీమనస్సులో ఏమీ చింతలేదా?' అని అడిగాడు.

'ఏమాత్రంలేదు!' అన్నాడు చున్నీ నవ్వుతూ.

'జీవితంలో ఎప్పుడూ నీకు చింత అనేది కలగలేదా?'

'ఆసంగతి ఎందుకు ఇప్పుడు?'

'నాకు వినాలని చాలా కోరికగా ఉంది.'

'అలాగయితే ఇంకోమాటు విందువు గానిలే!'

'సరే, చున్నీ! నువ్వు రాత్రంతా ఎక్కడ ఉంటావు?'

'నీకు తెలియదూ?' అన్నాడు చున్నీ మందహాసంచేస్తూ.

'ఏదో విన్నాను, కాని పూర్తిగా తెలియదు.'

చున్నీ ముఖాన ఉత్సాహచిహ్నాలు స్పష్టంగా కనిపించినవి. ఇలాంటి ప్రసంగాలలో విశేష మేమీ లేకపోయినా శాస్త్ర కనువిరపైనా ఉంటుంది. అభ్యాసదోషం దాన్నికూడా తుడిచివేసింది. కౌతుకంతో—'దేవదాస్! పూర్తిగా తెలుసుకోవాలంటే నువ్వుకూడా నా మాదిరి కావాలి! రేపు నా వెంట వస్తావా?' అని కన్ను గీటుతూ అడిగాడు.

దేవదాసు కొంచెంసేపు ఆలోచించి అన్నాడు. 'అక్కడ చాలా ఆనందంగా ఉంటుందనీ, మనస్సుకేమీ కష్టంగా ఉండదనీ అంటావు, నిజమేనా?'

'నూటికి నూరుపాళ్ళు నిజం!'

'అలాగయితే నన్నుకూడా తీసుకుపోతావా—వస్తాను.'

మర్నాడు ప్రొద్దు కుంగకముందే చున్నీలాలు దేవదాసు గదిలోకివచ్చాడు.

దేవదాసు చాలా అదుర్దాగా సామానంతా సర్దుతూ ఉన్నాడు. చున్నీకి విస్మయం కలిగింది.

'ఏమోయ్, పోవద్దా ?' అని అడిగాడు.

దేవదాసు తల ఎత్తకుండానే—'ఆఁ, ఎందుకు పోవద్దూ ?' అన్నాడు.

'మరి, ఇదంతా ఎందుకు ?'

'పోవటానికే—ఈ ప్రయత్నం.'

'మంచి ప్రయత్నమే' అని మనస్సులో అనుకొని చున్నీ మందహాసంచేసి 'గది మొత్తం అక్కడకు తీసుకెళ్ళి పెడతావా ?' అని అడిగాడు.

'మరి, ఎక్కడ పెట్టిపోతాను ?'

చున్నీలాలుకు ఏమీ బోధపడలేదు.

'సామాను ఇంకెవ్వరి దగ్గర పెట్టిపోతావు ? గదిలోనే ఉంటుంది.'

దేవదాసు అకస్మాత్తుగా నిద్రనుంచి లేచినవాడల్లే కళ్లు తెరిచి—'ఇవ్వాళ ఇంటికి వెళ్లుతున్నాను చున్నీ !' అన్నాడు సిగ్గు పడుతూ.

'అదేమిటోయి ! మళ్ళీ ఎప్పుడొస్తావు !'

'ఇకరాను.' అన్నాడు దేవదాసు తల తిప్పుతూ.

చున్నీ విస్మయంతో అతనివంక చూస్తూ ఉండి పోయాడు.

'ఈ పైకం తీసుకొని నాకు కొన్ని అప్పులున్నయి, తీర్చు. ఇంకా మిగిలితే మెస్‌లోని దాస దాసీలకు పంచి పెట్టు, నేనిక కలకత్తా రాను.'

'కలకత్తా రావటంమూలాన నేను చాలా పోగొట్టుకున్నా'నని మనస్సులో అనుకున్నాడు. కిశోర వయస్సులో పోకిరీగానూ, పొగరుబోతుగానూ తిరిగే టప్పుడు అతనికి అయాచితంగా లభించిన పదదళిత రత్నమే, నేడు కలకత్తా కంటె కూడా గొప్పదిగానూ, విలువగలదిగానూ కనిపించ సాగింది. ఇప్పుడు అతని కళ్ళమీద కప్పిన తెర ఒకటి తొలగింది.

'చున్నీ ! విద్య, బుద్ధి, జ్ఞానం, ఉన్నతి—అన్నీ కూడా మన సుఖంకోసమే. ఏవిధంగా నన్నా చూడు, ఇవి మన సుఖం సంపాదించటానికి తప్ప మ రెందుకూ పనికిరావు !' అన్నాడు చున్నీ ముఖం చూస్తూ దేవదాసు.

చున్నీ మధ్యనే అడ్డుతూ-'అయితే నువ్విక చదువు మానేస్తావా, ఏమిటి?'

అని అడిగాడు. 'తప్పకుండా. నేను ఈ కొద్ది జ్ఞానం కోసం ఎంతో పోగొట్టుకోవాల్సి ఉంటుందని నాకు పూర్వం తెలిసినట్లయితే, నే నసలు కలకత్తా ముఖమే చూసేవాణ్ణి కాదు !'

'నీ కేమైనా పూనిందా ఏమిటి ?'

'నీకు మళ్ళీ కనపడటం సంభవిస్తే అంతా చెబుతాను.'

రాత్రి తొమ్మిది ఘంటలయి ఉంటుంది. మెస్‌లో ఉండే వాళ్లంతా చున్నీలాలుతో సహా-సామానంతా బండి కెక్కించి దేవదాసు మెస్సుకు సలాం పెట్టి పోవటం—ఆశ్చర్యంతో చూశారు. అతను వెళ్లిపోయిన తర్వాత చున్నీలాలు కోపంతో—'ఈ రకం ముచ్చట్లని ఆదరణను పట్టి కనుక్కోవటం కష్టం—' అని మెస్‌లో వాళ్లంతా వినేటట్టు కేకలు వేయనారంభించాడు.

*　　　*　　　*

కొస్త దూరదృష్టి కలవారు, ప్రపంచం చూసినవారు, ఎవ్వరూ కంటితో చూడగానే ఏ వస్తువు మీదా తమ అభిప్రాయాన్ని వెల్లడించరు. రెండు వైపుల చూసి నాలుగు వైపుల మాటలు చెప్పరు—పూర్తిగా తెలుసుకోనిది మంచో చెడో తేల్చరు; వీరు ఒక రకం. ఇంకో రకం మనుష్యులున్నారు. వీరు దీనికి పూర్తిగా వ్యతిరేకులు ! దేన్ని గురించైనా ఎక్కువసేపు ఆలోచించే ఓర్పు వీరికి ఉండదు. చేతిలో పడటంతోటే మంచో చెడో తేల్చి పారవేస్తారు. త్రిప్పిచూసే పరిశ్రమకూడా చేయరు—నమ్మకం మీదనే పోనిస్తారు. ఇలాంటి మనుష్యులు ప్రపంచంలో ఏ పనీ చేయలేరు అంటానికి వీలు లేదు. ఒక్కొక్కప్పుడు అందరికంటె ఎక్కువగానే చేస్తారు. అదృష్టం సరిగా ఉంటే కొండ కొమ్మున ఎక్కి కూర్చుంటారు. సరి తప్పితే అగాధంలో చిరకాలం విశ్రమిస్తారు. అక్కడనుంచి లేవలేరు—కూర్చోలేరు—వెలుతురువంక చూడలేరు. నిశ్చలంగా, జడపిండం వలె, శవం మాదిరి పడిఉంటారు. ఈ తరగతికి చెందిన వాడు దేవదాసు !

మర్నాడు దేవదాసు ఇంటికి తిరిగి వచ్చాడు. తల్లి ఆశ్చర్యంతో—'దేవా! కాలేజీకి మళ్ళీ సెలవలు ఇచ్చారా ?' అని అడిగింది.

'ఆఁ.' అని దేవదాసు అన్య మనస్కునివలె వెళ్ళిపోయాడు. తండ్రిగారి

ప్రశ్నకుకూడా ఇలాంటిదే ఒక జవాబు చెప్పి తప్పుకు వెళ్ళాడు. వారికి ఏమీ అర్థంకాక భార్యను అడిగితే, ఆమె బుద్ధినంతా వినియోగించి — 'ఇంకా ఎండలు తగ్గలేదు కదూ ? మళ్ళీ సెలవ లిచ్చారు.' అని అన్నది.

దేవదాసు రెండు రోజులు, కాలు కాలిన పిల్లిలాగా తిరిగాడు. కాని అతని కోరిక నెరవేర లేదు. పార్వతి ఒంటరిగా కనపడలేదు. ఒకనాడు పార్వతి తల్లి దేవదాసును చూసి — 'వచ్చిన వాడివి ఎలానూ వచ్చావు నాయనా, పారూ పెళ్లిదాకా ఉండి పో!' అన్నది. దేవదాసు 'సరే!' అన్నాడు.

మధ్యాహ్నం పూట భోజనాలవీ అయాక పార్వతి నిత్యమూ నదికి నీటికి పోతుంది. ఇత్తడి బిందె చంకను పెట్టుకొని ఇవ్వాళకూడా నీళ్లకు వచ్చింది. రేవుకు సమీపంలోనే, రేగుచెట్టు చాటున దేవదాసు నీళ్ళల్లో గాలం వేసుకు కూర్చుని ఉన్నాడు. అతన్ని చూసి పార్వతి తిరిగి పోదామా అని ఒకమాటు మనస్సులో అనుకున్నది. చప్పుడు చేయకుండా నీళ్లుముంచుకు పోదామని మరోమాటు అనుకున్నది. కాని తత్తర పాటువల్ల ఏ పనీ చక్కగా నెరవేర్చ లేకపోయింది. బిందె క్రింద పెట్టుతూ ఉండగా బహుశా కొంచెం చప్పుడై ఉండవచ్చు; దేవదాసు తల ఎత్తి చూసి—'పారూ ! ఒకమాట వినిపో !' అని చెయ్యి ఊపుతూ పిలిచాడు.

పార్వతి నెమ్మదిగా దగ్గరకు వచ్చి నిలబడింది. దేవదాసు ఒకమాట్లు తల ఎత్తి చూశాడు. మరల నీటివంక శూన్యదృష్టులతో చూస్తూఉండిపోయాడు. మాట్లాడ లేదు. 'నాకేమైనా చెప్తావా ? దేవదా !' అని అడిగింది పార్వతి.

దేవదాసు దృష్టి మరల్చకుండానే—'ఆఁ. కూర్చో !' అన్నాడు.

పార్వతి కూర్చోలేదు. తలవంచుకు నిలబడింది. చాలాసేపు చూసినా మాట్లాడకపోయేసరికి పార్వతి నెమ్మదిగా ఒక్కొక్క అడుగు వేసుకుంటూ రేవుకు పో సాగింది. దేవదాసు తల ఎత్తి పార్వతి పోతూ ఉండటం చూసి, 'ఇదిగో మాట !' అన్నాడు మరల నీళ్లవంక చూస్తూ.

పార్వతి తిరిగి వచ్చింది. కాని దేవదాసు ఉలీపలీ లేదు. పార్వతి తిరిగి పోయింది. దేవదాసు స్తబ్దుడై కూర్చున్నాడు. కొన్ని క్షణాలు గడిచిన తర్వాత తల తిప్పిచూశాడు. పార్వతి నీళ్ళుముంచుకొని వెళ్లబోతూ ఉన్నది.

అప్పుడు దేవదాసు గాలం తీసి చేతపట్టుకొని రేవు దగ్గరికివచ్చి నిలబడి—'నేను వచ్చాను' అని అన్నాడు.

పార్వతి బిందె క్రిందకు దించింది. మాట్లాడలేదు.

'నేను వచ్చాను పారూ !'

పార్వతి కొంచెంసేపు మాట్లాడకుండా ఉండి — 'ఎందుకూ ?' అని మెల్లగా అడిగింది.

'నువ్వు రాసివిగా జ్ఞాపకం లేదూ ?'

'ఊహుఁ.'

'అదేంటి పారూ ! ఆ రాత్రి సంగతి జ్ఞాపకం లేదూ ?'

'జ్ఞాపకముంది. కాని, ఇంకా దానితో అవసర మేముంది ?'

పార్వతి కంఠస్వరం స్థిరంగానూ, చాలా కటువుగానూ ఉన్నది. దేవదాసు దాని మర్మం గ్రహించలేకపోయాడు.

'నన్ను క్షమించు పారూ ! నే నపు డంత దూరం ఆలోచించలేదు.'

'ఇక ఆపేసేయి. ఈ సంగతి నేనిక వినదలచుకోలేదు.'

'నేనెలాగో ఒకలా నా తలిదండ్రుల్ని ఒప్పిస్తాను. ఇక నువ్వు—'

పార్వతి దేవదాసుముఖం వంక తీక్ష్ణంగా చూసి — 'నీకేనా తలిదండ్రు లున్నది, నాకు లేరా ? వారి ఇష్టాయిష్టాలతో పని లేదా?' అన్నది.

దేవదాసు సిగ్గు పడ్డాడు.

'ఎందుకు లేరు పారూ ? వారి కిష్టమేగా, ఇక నువ్వు—'

'వారికిష్టమే నని ఎలా తెలుసుకున్నావు ? బొత్తిగా యిష్టంలేదు !'

దేవదాసు నవ్వాలని వృథా ప్రయాసపడి — 'కాదే, వారికి ఏమాత్రం అయిష్టంలేదు. నాకు బాగా తెలుసు. ఇక నువ్వు—'

పార్వతి మధ్యలోనే అడ్డి—'ఇక నేను—నిన్నా ?—ఛీ !' అన్నది.

రెప్పపాటులో దేవదాసు కళ్ళు చితినిప్పులుమాదిరిగా జ్వలించినవి.

'పార్వతీ నన్ను మరచిపోయావా ?' అన్నాడు కర్కశ స్వరంతో.

పార్వతి మొదట కొంచెం తడబడింది. కాని మరుక్షణానే తమాయించుకుని—కఠినస్వరంతో—'ఎందుకు మరచాను ? చిన్నప్పటినుంచీ నిన్నెరుగుదును

నాకు జ్ఞానం వచ్చినప్పటినుంచీ నీకు భయపడుతూనే వచ్చాను. అందుకనే నన్ను భయపెట్టటానికి వచ్చావా? సరే. ఇక నన్నేనా నువ్వెరగంది?' అని నిర్భయంగా అతని వంక చూస్తూ నిలబడింది.

కాసేపు దేవదాసు నోటినుంచి మాట పెగులలేదు.

'చిన్నప్పటినుంచీ నాకు భయపడుతూనే వచ్చావా? ఇకేమీలేదా?'

'ఉహుం. ఇకేమీలేదు!' అన్నది పార్వతి దృఢ స్వరంతో.

'నిజంగా చెప్తున్నావా?'

'ఆఁ. నిజంగా చెప్తున్నాను. నీ మీద నాకేమాత్రం గౌరవంలేదు. నేను ఎవరి దగ్గరికి పోతున్నానో వారు చాలా ధనవంతులు, బుద్ధిమంతులు, శాంతులు, స్థిరులు, ధార్మికులు. నా తల్లి దండ్రులు నా మేలే కోరుతారు. అందుకనే నీవంటి అజ్ఞానికీ, చంచల చిత్తునికీ, పోకిరికీ నన్నెంత మాత్రం ఇవ్వరు—ఇక దోవ వదులు!'

దేవదాసు కొంచెం తడబడి కాస్త దోవ ఇచ్చాడు. కాని మరుక్షణానే మరల అడ్డం వచ్చి—'ఇంత అహంకారమా?' అన్నాడు.

'ఎందుకుండదు? నీ కుండవచ్చు గాని నాకుండ కూడదా? నీకు రూపం ఉన్నది, కాని గుణం లేదు—నాకు రూపమూ ఉన్నది, గుణమూ ఉన్నది. నువ్వు ధనవంతుడివి. కాని మానాన్న కూడా బిచ్చమెత్తుతూ తిరగటంలేదు. పైగా ఇకముందు నేనేవిషయంలోనూ నీకంటె తక్కువగా వుండనని తెలుసుకో?'

దేవదాసు స్తంభితుడయాడు. పార్వతి చెప్ప నారంభించింది:

'నాకు చాలా చెరుపు చేయగలనని నువ్వనుకుంటూ ఉండవచ్చు. ఎక్కువ ఏమీ చేయలేవు గాని కొద్దిగా చేయగలవని నేను కూడా ఎరుగుదును. భేష్! అదే కానీయి. నాకు మాత్రం దోవ వదిలిపెట్టు!'

దేవదాసు హతబుద్ధుడై—'చెరుపు ఎలా చేయగలను?' అన్నాడు.

'అపవాదువేసి! అదే చేయి, పోయి.' అన్నది పార్వతి తక్షణమే.

ఈ మాట విన్నంతనే దేవదాసు మీద పిడుగు పడి నట్లయింది. కాసేపు వెర్రి వానివలె చూశాడు. అతని నోటినుంచి—'నేను అపవాదు వేస్తానా?'

అని అస్ఫుటంగా వెలువడింది.

కాని దేవదాసు హృదయంలో కోపమూ అవమానమూ దావానలమువలె ప్రజ్వరిల్లినవి. అవ్యక్త స్వరంలో—'నేను అపవాదువేసి మనశ్శాంతి పొందుతానా ?' అని, మరుక్షణానే గాలంతిప్పి గట్టిగాపట్టుకొని కర్కశ స్వరంతో 'విను, పార్వతీ! నీకు అంత రూపం ఉండటం మంచిది కాదు. అహంకారాన్ని పెంచుతుంది.' అని మరల గొంతు తగ్గించి—'చంద్రునికి అంత రూపం ఉండటంచేతనే ఆ కళంకం. పద్మాలు అంత తెల్లగా ఉండటం మూలానే అందులో నల్లని భ్రమరాలు ఉంటవి. ఇదిగో, నీ ముఖానకూడా కొంచెం కళంకచిహ్నం ఉండేటట్టు చేస్తాను' అన్నాడు.

దేవదాసు సహనశక్తి హద్దుమీరింది. అతను గాలం కర్ర గట్టిగా పట్టుకొని శక్తికొలది తిప్పి పార్వతి తలమీద కొట్టాడు. ఆ దెబ్బకు కపాళం దగ్గరనుంచి కుడి కనుబొమ్మవరకు చీరుకుపోయింది. రెప్పపాటుకాలంలో ముఖమంతా రక్తంకొల్లు అయింది.

పార్వతి నేలమీద విరుచుకుపడి—'ఏం పని చేశావు, దేవదా !' అని ఛీత్కారం చేసింది.

దేవదాసు గాలం తుంపులు తుంపులుచేసి నీళ్ళలోవేస్తూ — 'మరేమీ ప్రమాదం లేదు. కాస్త చీరుకు పోయింది,' అన్నాడు స్థిరంగా.

పార్వతి వ్యాకులకంఠంతో—'అమ్మో, దేవదా !' అంటూ ఏడ్చింది.

దేవదాసు పల్చని చొక్కా కొంచెం చించి నీళ్ళలో తడిపి పార్వతి తల మీద కడుతూ—'భయ మెందుకు పారూ! ఈ దెబ్బ త్వరలోనే మాని పోతుంది. మచ్చ మాత్రం ఉంటుంది. ఎవరయినా ఎప్పుడన్నా, ఆ మచ్చ ఏమిటని అడిగితే అబద్ధమాడు. లేకపోతే నిజం చెప్పి నీ కళంకాన్ని నువ్వే చాటుకో !' అన్నాడు.

'అమ్మో, నాయనో !'

'ఛీ, అలా ఏడవబోకు పారూ! నిష్క్రమణం చేసేముందు కాస్త జ్ఞాపకం పెట్టుకోతగిన చిహ్నం అట్టిపెట్టాను. ఇలాంటి బంగారంలాంటి ముఖం నువ్వు అప్పుడప్పుడూ అద్దంలో చూసుకుంటావు కాదూ ?' అని జవాబుకు

ఎదురుచూడకుండానే వెళ్ళిపోవటానికి రెండు అడుగులు వేశాడు.

పార్వతి ఆకులపాటుతో—'దేవదా!' అని పిలిచింది.

దేవదాసు తిరిగివచ్చాడు; అతని కనుకొలుకుల్ని నీటి బిందువు ఉన్నది.

'ఎందుకే పారూ?' అని స్నేహజడిత కంఠంతో అడిగాడు.

'ఎవరితోనూ చెప్పకు!'

దేవదాసు వంగి పార్వతి తలను ఓష్ఠాధరాలతో స్పృశించి—'ఛీ, నువ్వు నాకు పరాయిదానివా, పారూ? నీకు జ్ఞాపకం లేదూ? చిన్నప్పుడు కొంటె పనులు చేస్తే నీ చెవులు ఎన్నిసార్లు మెలిపెట్టాను!' అన్నాడు.

'నన్ను క్షమించు దేవదా!'

'అది నువ్వు చెప్పాలటే! నిన్ను నేనెప్పుడు కొట్టలేదు; ఎప్పుడు క్షమించలేదు?—నిజం చెప్పు పారూ; నువ్వు నన్ను పూర్తిగా మర్చిపోయావా?' 'దేవదాదా!—'

'పార్వతీ! నాకు ఎక్కువ మాటలు చెప్పటం చేతకాదనీ, ఎక్కువ ఆలోచించి పనులు చేయననీ, తలుచుకున్నది చేసిందాకా నిద్రపోననీ—నీకు తెలుసునుగా!' అని పార్వతి తలను చేతితో స్పృశించి—'నువ్వు మంచిపనే చేశావు. నా దగ్గర నువ్వు సుఖపడేదానివి కావు—కాని ఈ దేవదాసు స్వర్గ సౌఖ్యం అనుభవించేవాడు!' అని ఆశీర్వదించాడు.

ఈ సమయంలో నదికి అవతలనుంచి ఎవరో వస్తూ కనపడ్డాడు. పార్వతి మెల్లగా నీళ్ళలో దిగింది. దేవదాసు వెళ్ళిపోయాడు. పార్వతి ఇంటికి తిరిగి వచ్చేవరకు వేళ చాలా మిగిలిపోయింది. పార్వతి నాయనమ్మ—'నదికి పోయి నీరు తెచ్చావా తల్లీ!' అని అనబోయింది. కాని పార్వతిమీద దృష్టిపడగానే 'అమ్మో; కొంప మునిగిందే పారూ!' అని చీత్కారం చేసింది.

గాయంనుంచి అప్పుడుకూడా రక్తం కారుతూనే ఉన్నది. దాదాపు కట్టుగుడ్డ అంతా తడిసిపోయింది—'అమ్మమ్మో! నీపెళ్ళి ఎలానే పారూ?' అన్నది ఏడుస్తూ.

పార్వతి స్థిరభావంతో బిందె దించింది. తల్లివచ్చి—'అయ్యో, కొంప మునిగిందే పారూ!' అని ఏడుస్తూ అన్నది.

పార్వతి—'రేవులో కాలుజారి పడ్డాను. కొయ్యరాయి తగిలి తల గీచుకు పోయింది' అన్నది.

తర్వాత అందరూ కలిసి శుశ్రూష చేయనారంభించారు. దేవదాసు చెప్పింది నిజమే—దెబ్బ అంత పెద్దదికాదు. నాలుగైదురోజులకే మానిపోయింది. ఇంకా ఒక వారం ఇలానే గడిచిపోయింది. తర్వాత ఒకనాటిరాత్రి హాతీపోతా గ్రామ జమీందారు—శ్రీ భువన మోహన చౌదరి—వరవేషం ధరించి వివాహం చేసుకోవడానికి వచ్చారు. ఉత్సవంలో విశేష ఆడంబరాలేవీ లేవు. భువనబాబు అంత తెలివి తక్కువవాడు కాడు. ప్రౌఢ వయస్సులో పెళ్లి చేసుకోవడానికి వచ్చి కుర్రవాని వేషం వేసుకోవటం మంచిదికాదని గ్రహించాడు.

వరుని వయస్సు నలభైకి తక్కువకాదు, కొంచెం ఎక్కువే. గౌరవర్ణం. దొండు శరీరం. నెరసీనెరవని మీసాలు, బట్టతల. వరుని చూసి కొందరు నవ్వారు. కొందరు మూతివిరిచారు. భువనబాబు శాంత గంభీరముఖంతో—ఏదో తప్పుచేసినవానివలె, లగ్నం దగ్గర కూర్చున్నాడు. పెళ్ళిలో చెవులు మెలిపెట్టటం, గంధం మొదలగు ఆచారాలేవీ జరగలేదు. కారణం, ఇంత పెద్దనూ, ఇంత గంభీరునీ, చెవులు మెలిపెట్టటానికి ఎవరిచేతులూ లేవలేదు. శుభదృష్టి సమయంలో పార్వతి రెప్పవాల్చకుండా భర్తవంక చూసింది. ఆమె పెదవులమీద మందహాసం కనిపించింది—భువనబాబు పసిపిల్లవాడిమాదిరిగా తలవంచుకున్నాడు. స్త్రీలందరూ కిలకిల నవ్వారు. చక్రవర్తిగారు ఎక్కడా కాలు ఆనకుండా తిరుగుతూ ఉన్నారు. పిల్లతరఫు పెత్తనమంత జమీందారు నారాయణముఖర్జీ గారిది. అనుభవజ్ఞుడు—పెళ్లిలో ఏమాత్రం లోటు జరగనివ్వలేదు. శుభకార్యం నిర్విఘ్నంగా సమాప్తమైంది.

మర్నాడు ఉదయాన్నే చౌదరిగారు ఒక పెట్టెడు అలంకారాలు బయటకు తీశారు. పార్వతి సర్వాంగాలూ తళతళ మెరిసినవి. అవి చూసి పార్వతి తల్లి చీంచెరుగుతో కను కొలుకులు ఒత్తుకున్నది. ప్రక్కనే నిలబడి ఉన్న జమీందారుగారి భార్య—'ఇవ్వాళ కళ్ళవెంట నీళ్ళుకార్చి అమంగళం చేయబోకు!' అని స్నేహపూరితంగా మందలించింది.

సాయంకాలం మనోరమ పార్వతిని ఒంటరిగా గదిలోకి తీసుకువెళ్ళి ఆశీర్వదించింది. 'జరిగిందల్లా మంచికే జరిగింది. ఇకనుంచిచూడూ, ఎంత సుఖంగా ఉంటావో!' అన్నది.

పార్వతి మందహాసంచేసింది: 'ఎందుకుండను? నిన్ననేగా యముడితో పరిచయమైంది!' అన్నది.

'అదేమిటే!'

'దాని సమయం వచ్చినప్పుడు చెప్తాను.'

మనోరమ ప్రసంగం మార్చి అన్నది:

'ఒకమాటు దేవదాసును పిలిచి ఈ బంగారాన్ని చూపించాలని ఉంది!'

పార్వతికి మత్తు వదలినట్లయింది. 'ఆ పని చేయగలవా, అక్కయ్యా! ఒకమాటు పిలుచుకు రాలేవా?' అన్నది.

'ఎందుకు పారూ?' కంఠస్వరంలో తొట్రుపాటున్నది.

పార్వతి దండకడియం తిప్పుతూ అన్యమనస్కంగా అన్నది. 'ఒక్క మాటు పాదధూళి తీసుకోవాలని ఉన్నది. ఇవ్వాళ వెళ్తాను కదూ?'

మనోరమ పార్వతిని హృదయానికి దగ్గరగా లాక్కున్నది. ఇద్దరూ చాలా సేపు ఏడ్చారు. ప్రొద్దు కుంకింది. గదిలో అంతా చీకటి.

పార్వతి నాయనమ్మ తలుపు నెట్టుకొని గదిలోకివచ్చి 'ఓపారూ, ఓమనో, బయటికి రండి తల్లుల్లారా!' అని పిలిచింది.

ఆ రాత్రే పార్వతి కాపురానికి వెళ్లిపోయింది.

* * *

ఇక దేవదాసు? ఆరాత్రి అతను కలకత్తా ఈడెను గార్డెనులో ఒక బెంచీ మీద కూర్చుని గడిపాడు. 'అతనికి చాలా క్లేశం కలిగింది. అతని హృదయం వక్కలైంది' అనటానికి వీల్లేదు. ఏదో జడత్వం, ఉదాసీనత నెమ్మదిగా అతని హృదయంలో కూడుకొంటూ ఉన్నది. నిద్రపోతూ ఉండగా శరీరంలో ఏ పార్శ్వానికైనా పక్షవాతం వస్తే, నిద్రనుంచి మేలుకోగానే అది మన చెప్పు చేతల్లో ఉండకపోవడంచూసి—తన అజన్మ సంగీ, తనకు నమ్మినబంటూ తన పిలుపుకి ఎందుకు జవాబివ్వటంలేదో తెలియక, మనస్సు మొదట విస్మయంతో

ఎలా సంభ్రమించిపోతుందో; తర్వాత నెమ్మదిగా అది ఇక తనది కాదని ఎలా తెలుసుకుంటుందో, అలానే దేవదాసు ఇప్పుడు ప్రపంచానికంతకూ పక్షవాతం వచ్చిందనీ, దానితో తనకు చిరవిచ్ఛేదం కలిగిందనీ గ్రహించాడు. అవవసరంగా ఇప్పుడు దానిమీద కోపించినా లాభంలేదు; భీష్మించినా ఫలముండదు. అసలు, ఒకప్పుడు దానిమీద తనకు అధికార ముండినదని ఆలోచించటంకూడా వ్యర్థం!

సూర్యుడు ఉదయిస్తూ ఉన్నాడు. దేవదాసు లేచి నిలబడి, ఎక్కడికి వెళ్ళుదామా అని ఆలోచించాడు. అతనికి మెస్ జ్ఞాపకం వచ్చింది. చున్నీలాల్ అక్కడే ఉన్నాడు. దేవదాసు బయలుదేరాడు. దోవలో ఒకరిద్దరితో ఢీకొన్నాడు—ఎదురుదెబ్బకు వేళ్లన్నీ పగలగొట్టుకున్నాడు—తిప్పు వచ్చి, ఒక మనిషి మీద పడబోయి అతనిచేత తాగుబోతని పడ నెట్టించుకున్నాడు. ఇలా తిరిగి తిరిగి పొద్దు కుంకుతూ ఉండగా మెస్ దగ్గరకు చేరాడు. చున్నీబాబు గుడ్డలవీ వేసుకొని అప్పుడే బయలుదేరుతున్నాడు.

'ఎవరూ? దేవదాసా!' అన్నాడు చున్నీ. దేవదాసు మాట్లాడలేదు. కుడ్లు వప్పగించాడు.

'ఎప్పుడొచ్చావోయ్? ముఖమంతా వాడిపోయింది—ఇంకా స్నానం కూడా చేసినట్టు లేదే!—అఁ. అఁ! అదేమిటి! అదేమిటి!'

దేవదాసు రోడ్డుమీద కూర్చోబోతూ ఉండగా చున్నీ అతన్ని చేయిపట్టుకొని గదిలోకి తీసుకువెళ్లాడు. తన పక్కమీద కూర్చోపెట్టి శాంతపరచి—'సంగతులు ఏమిటోయి దేవదాస్!' అని అడిగాడు.

'నిన్ననే ఇంటిదగ్గరనుంచి వచ్చాను.'

'నిన్ననా! ఇవ్వాళ పగలంతా ఎక్కడున్నావ్? మరి రాత్రో?'

'ఈడెన్ గార్డన్‌లో.'

'పిచ్చా ఏమిటి! అసలు సంగతేమిటో చెప్పు, వింటాను?'

'వింటే ప్రయోజన మేమిటి?'

'అయితే అక్కర్లేదు! ముందు తిండి తిప్పలూ చూడు—సామానంతా ఎక్కడ?'

'తీసుకురాలేదు.'

'సరేమంచిది—ముందు భోజనానికి లే.'

బలవంతంగా చున్నీలాల్ అతన్ని భోజనం చేయించి, పండుకోమని చెప్పి తలుపులు వేస్తూ—'నేను రాత్రికివచ్చి లేపుతాను. కాస్త నిద్ర పోవటానికి ప్రయత్నించు' అని చున్నీ వెళ్లిపోయాడు. రాత్రి పదిగంటలకు వచ్చి చూస్తే దేవదాసు మంచంమీద గాఢనిద్ర పోతున్నాడు. చున్నీ అతన్ని లేపకుండా కంబళి ఒకటి లాక్కుని చాపమీదవేసి పండుకున్నాడు. ఆరాత్రి దేవదాసుకు మెలకువ రాలేదు. ఉదయం పది గంటలకు లేచి కూర్చుని—

'చున్నీ! ఎప్పుడొచ్చావోయ్?' అని అడిగాడు.

'ఇప్పుడే వచ్చాను.'

'నీకేం ఇబ్బంది కలగలేదు కదా?'

'ఏమీ లేదు.'

దేవదాసు కాసేపు అతనివంక చూస్తూ ఉండి—'చున్నీ, నాకిప్పుడు 'నా' అనేది ఏమీ లేదు! నువ్వు నన్ను పోషిస్తావా?' అని అడిగాడు.

చున్నీ నవ్వాడు. దేవదాసుతండ్రి చాలా భాగ్యవంతుడని అతనికి తెలుసు. అందుకనే నవ్వుతూ—'నేను పోషించనా! మంచిదే, నీ ఇష్టమొచ్చినంత కాలముండు ఇక్కడ, ఏమీ ఫరవాలేదు!' అన్నాడు.

'చున్నీ, నీ ఆదాయ మెంత?'

'నాకు ఆదాయం మామూలే భాయీ! ఇంటి దగ్గర పొలం పుట్రా కొద్దిగా ఉన్నది. అది అన్నయ్యకు వప్పజెప్పి ఇక్కడ ఉంటున్నాను. నెలకు డెబ్బయి రూపాయల చొప్పున పంపుతూ ఉంటాడు. వీటితో నీకూ నాకూ సుఖంగా గడిచిపోతుంది.'

'నువ్వు ఇంటికి వెళ్ళ వెందుకనీ?'

చున్నీలాలు ముఖం కొంచెం చాటుచేసుకొని—'దానికి చాలా గొడవ ఉంది' అన్నాడు. దేవదాసు ఇకేమీ అడగలేదు. ఇంతలో భోజనాల పిలుపువచ్చింది. ఇద్దరూ లేచి స్నానాలు, భోజనాలు పూర్తిచేసుకొని మళ్ళీ గదిలోకి వచ్చి కూర్చున్నారు.

'మీ నాయనతో పోట్లాడావా దేవదాస్?' అని అడిగాడు చున్నీ.

'లేదు.'

'ఇంకెవ్వరితోనన్నా?'

'ఎవ్వరితోనూ లేదు.'

తర్వాత చున్నీ ఏదో జ్ఞాపకం వచ్చినవానిలా నవ్వుతూ—'ఓహో! నీకింకా పెళ్లి కాలేదు కదూ?' అన్నాడు.

దేవదాసు ఈలోన ముఖం గోడవైపుకి తిప్పి పండుకొని నిద్రపోయాడు. ఇలా రెండురోజులు నిద్రలోనే గడిచిపోయినవి. మూడోనాటి ఉదయం దేవదాసు కొంచెం స్వస్థుడయి లేచి కూర్చున్నాడు. ముఖంమీది నుంచి ఆ కారుమబ్బులు చాలావరకు తొలిగినట్లుగా కనిపించినవి.

'ఇవ్వాళ నీవంట్లో ఎలా వున్నది?' అని చున్నీ అడిగాడు.

'చాలా బాగా ఉన్నట్టుగానే ఉంది—సరేగాని చున్నీ, నువ్వు రాత్రిపూట ఎక్కడికి వెళ్తావు?'—ఇవ్వాళ చున్నీలాలు సిగ్గుపడ్డాడు.

'ఆఁ, నేనా!...పోయేమాట నిజమే—ఇప్పుడా సంగతి ఎందుకు? సరే నువ్విక కాలేజీకిపోవా?' అన్నాడు తడబడుతూ.

'ఊహుఁ. చదువు మానేశాను.'

'ఛీ మానేసినందువల్ల ప్రయోజనం? రెండు మాసాల్లోనే నీపరీక్ష. చదువు కూడా బాగానే చదివావు. ఈమాటు పరీక్ష కెందుకు కూర్చోవు?'

'ఊహుఁ, మానేశాను.'

చున్నీలాలు ఇకేమీ మాట్లాడలేదు. దేవదాసు అడిగాడు:

'ఎక్కడికి వెళ్తావో చెప్పవూ? నేనుకూడా నీవెంట వస్తాను.'

చున్నీలాలు, దేవదాసు ముఖంవంక చూస్తూ—'నీకు తెలియదా దేవదాస్! నే నంత మంచి చోటుకు పోను' అన్నాడు.

'మంచీ, మన్నూ! ఏదయితేనేం?' అని దేవదాసు మనస్సులో అనుకొని—'చున్నీ! నన్నుకూడా నీ వెంట తీసుకుపోవూ?' అని అడిగాడు మళ్ళీ.

'ఎందుకు తీసుకుపోను? నీవే రావు!'

'తప్పకుండా వస్తాను, బాగా ఉండకపోతే మళ్ళీరాను. నువ్వు ప్రతి

రోజూ ఏ సుఖం కోసమై ఇంత ఆతురతతో ఎదురుచూస్తూ ఉంటానో, అది ఎలాంటిదైనా సరే, చున్నీ! నేను తప్పకుండా వస్తాను'.

చున్నీ ముఖం చాటుచేసుకొని నవ్వి—'నా సుఖమా!' అని మనస్సులో అనుకుని—'సరే, అలాగే తీసుకుపోతాను.' అన్నాడు పైకి.

మూడు ఘంటలకు సామాను తీసుకొని ధర్మదాసు వచ్చాడు. దేవదాసును, చూడగానే ఏడుస్తూ—'దేవదా, అమ్మ ఈవమూడు రోజులనుంచీ ఎంత ఏడుస్తున్నది!' అన్నాడు.

'ఎందుకోయ్?'

'ఎవరితో చెప్పకుండా ఇలా ఎందుకు వచ్చావు?' అని ఒక కాగితం తీసి దేవదాసుకిచ్చి—'అమ్మగారు రాశారు!' అన్నాడు.

చున్నీ ఉత్తరంలో సంగతులు తెలుసుకోవాలని చాలా ఉత్సుకత చూపించాడు. దేవదాసు ఉత్తరం చదివి క్రిందపెట్టాడు. తల్లి ఇంటికి రమ్మని చాలా చాలా రాసింది. ఆ ఇంటిలోకల్లా దేవదాసు ఇలా హఠాత్తుగా మాయం కావటానికి కారణం ఏమిటో కొంతవరకయినా ఊహించింది, ఈమే! ధర్మదాసు చేతికిచ్చి, చాటుగా, చాలా పైకంకూడా పంపించింది. ధర్మదాసు పైకం చేతికిచ్చి—'ఇంటికి పోదాం పద, దేవదా!' అన్నాడు.

'నేను రాను, నువ్వు వెళ్ళిపో!'

రాత్రి మిత్రులిద్దరూ చక్కగా ముస్తాబయి బయలుదేరారు. దేవదాసుకు ఈ ముస్తాబంటే అంత ఇష్టంలేదు. కాని చున్నీలాలు మామూలు వేషంతో బయలు దేరటానికి సమ్మతించలేదు. రాత్రి తొమ్మిది గంటలకు ఒక బాడుగ బండి చిత్పూరు రోడ్డులో ఒక రెండంతస్థుల మేడక్రింద నిలబడింది. చున్నీలాలు దేవదాసు చేయిపట్టుకొని లోపల ప్రవేశించాడు. ఇంటి ఆవిడ పేరు చంద్రముఖి. స్వయంగావచ్చి ఆహ్వానించింది. ఆమెను చూడగానే దేవదాసు శరీరమంతా ఏవగింపుతో జ్వలించిపోయింది. ఇన్నాళ్లనుంచీ అతనికి స్త్రీల పొడ అంటేనే గిట్టటంలేదు. ఈ సంగతి అతనికి తెలియనే తెలియదు. చంద్రముఖిని చూడగానే అతని అంతరంగంలో దాగిన ఏవగింపంతా, దావానలంవలె ఒక్కమాటు ప్రజ్వరిల్లింది. అతను చున్నీలాలు ముఖంవంక తీవ్రంగా

చూస్తూ, కనుబొమలు చిట్లించుకొని 'చున్నీ! న న్నీ నరకానికి తీసుకొచ్చా వెందుకు?' అన్నాడు.

అతని కంఠస్వరమూ, చూపూ చూసి చంద్రముఖీ, చున్నీలాలూ స్తబ్ధులయ్యారు. కాని వెంటనే చున్నీ తనను సంబాళించుకున్నాడు. దేవదాసు చెయ్యి పట్టుకుని మెల్లగా—'పద. లోపలికి పోయి కూర్చుందాము'అన్నాడు.

దేవదాసు ఇకేమీ అనలేదు. గదిలోకిపోయి విచారంతో తలవంచుకు కూర్చున్నాడు. చంద్రముఖి కూడా మాట్లాడకుండా దాపునే కూర్చున్నది. దాసీ వెండి పొదిగిన హుక్కాలో పొగాకు వేసుకొని, తీసుకు వచ్చింది. దేవదాసు తీసుకోలేదు. చున్నీలాలు ముఖమంతా భారంగా పెట్టుకొని కూర్చున్నాడు. దాసీకి ఏమి చేయాలో తెలియక చివరికి, హుక్కా చంద్రముఖి చేతికిచ్చి వెళ్ళిపోయింది. చంద్రముఖి ఒకటి రెండు సార్లు పీల్చింది. దేవదాసు ఆమె ముఖం వంక చుర చుర చూసి—'ఎంత అసహ్యం! ఎంత రోత!' అని చీదరించుకున్నాడు.

ఇంతకుపూర్వం మాటల్లో ఎవ్వరూ చంద్రముఖిని ఓడించలేక పోయారు. అసలామెను చిన్న బుచ్చటమే చాలా కష్టం. కాని దేవదాసు హృదయం లోనించి, ఏవగింపుతో వచ్చిన ఈ సరళ కఠినోక్తులు ఆమె హృదయంలోకి సూటిగాపోయి నాటినై! ఒక్క క్షణం ఆమె మతిపోయింది. కాని, కానే పున్న తర్వాత ఒకటి రెండుసార్లు గుడగుడమని శబ్దం వినపడింది. పొగమాత్రం చంద్రముఖి నోటినుంచి రాలేదు. తర్వాత హుక్కా చున్నీలాలు చేతికిచ్చి, దేవదాసు ముఖం వంక ఒకమాటు చూసి, మౌనంగా కూర్చున్నది. ముగ్గురి నోటా మాటలేదు. హుక్కామాత్రం 'గుడ గుడ' మని చప్పుడుచేస్తూ ఉన్నది—అదీ భయపడుతూ, భయపడుతూ! మిత్రులు నలుగురు కూర్చుని చర్చిస్తూ ఉండగా, ఆ చర్చ అవసరంగా కలహం క్రిందకు మారితే, చప్పున తర్కం ఆపివేసి, ప్రతివ్యక్తీలోపల ఉడికిపోతూ—'ఇలా ఎందుకు వచ్చిందీ?' అని ఎలా అనుకుంటారో, అలానే ఈ ముగ్గురూ, 'ఇలా ఎందుకు వచ్చిందీ!' అని మనస్సులో అనుకో సాగారు.

ఎలాగైనా రానీయండి, ఇందులో ఎవ్వరికీ స్వస్థత లేదు. చున్నీలాలు

హుక్కా కిందపెట్టి క్రిందకు దిగిపోయాడు. అతనికి చేసే పనేమీ కనపడలేదు—బహుశా అందుకనే కావచ్చును. గదిలో దేవదాసు ఒక్కడే ఉండిపోయాడు.

'నువ్వు డబ్బు తీసుకుంటావా?' అని దేవదాసు తల ఎత్తి ప్రశ్నించాడు.

చంద్రముఖి వెంటనే జవాబివ్వలేకపోయింది. ఇప్పుడామెకు ఇరవై నాలుగో ఏడు. గత తొమ్మిది సంవత్సరాల్లో, ఎన్నోరకాల స్వభావం కల వ్యక్తులతో ఆమెకు దగ్గర పరిచయంకూడా వున్నది. కాని ఇలాంటి చిత్రమైన వ్యక్తిని ఆమె ఎప్పుడూ చూడలేదు. కొంచెం సంకోచిస్తూ అన్నది:—'తమ రాకచే మా గృహం పావనమైన—'

దేవదాసు మాటపూర్తి చెయ్యనివ్వకుండా—'పావనం సంగతి అలా ఉంచు; డబ్బు తీసుకుంటావా?' అని అడిగాడు.

'ఎందుకు తీసుకోను ! లేకపోతే మాకెలా గడుస్తుంది?—'

'ఆగు—ఇక నేను విన దలచుకోలేదు.' అని జేబులోనుంచి ఒకనోటు తీసి చంద్రముఖి చేతిలోపెట్టి పోవటానికి ఉద్యమించాడు—ఎంత డబ్బిచ్చానని ఒక్కమాటు తిరిగికూడా చూచుకోలేదు.

'అప్పుడే వెళ్ళిపోతారేం?' అని చంద్రముఖి వినయంగా అడిగింది.

దేవదాసు మాట్లాడలేదు. వరండాలోకి వచ్చి నిలబడ్డాడు.

చంద్రముఖి ఒకమాటు, డబ్బు తిరిగి ఇచ్చివేయాలనుకున్నది. కాని సంకోచం మూలాన ఇవ్వలేకపోయింది. బహుశా కొంచెం భయపడి ఉండవచ్చు. ఇంతేకాక తిట్లూ, తిరస్కారాలూ సహించే అలవాటు ఆమెకు ఉండటంచేత నిశ్శబ్దంగా, కొయ్యవలె ద్వారబంధము పట్టుకుని ఉండిపోయింది. దేవదాసు మెట్లుదిగి వస్తూ ఉండగా, దోవలో చున్నీలాలు ఎదురైనాడు. అతనికి ఆశ్చర్యంవేసి—'ఎక్కడికి పోతున్నావు, దేవదాస్!' అని అడిగాడు. 'బసకు వెళుతున్నాను.'

'అదేమిటోయ్!'

దేవదాసు ఇంకా రెండు మెట్లు దిగాడు.

'పద, నేనుకూడా వస్తున్నాను.' అన్నాడు చున్నీలాలు.

దేవదాసుదగ్గరకువచ్చి చేయిపట్టుకొని—'రా' అన్నాడు.

'కొంచెం ఆగు, ఒకమాటు పైకిపోయి వస్తాను.'

'కాదు నేనిప్పుడే పోవాలి. నువ్వు తర్వాత రా' అని దేవదాసు వెళ్ళిపోయాడు.

చున్నీలాలు పైకివచ్చాడు. చంద్రముఖి తలుపు పట్టుకుని ఇంకా అలాగే నిలబడి ఉన్నది. చున్నీని చూడగానే—'నీ స్నేహితుడు వెళ్లిపోయాడా?' అని అడిగింది.

'ఆఁ.'

చంద్రముఖి, చేతిలోని నోటు చూపిస్తూ—'ఇది చూశావా? మర్యాద దక్కించుకోవాలంటే, దీన్ని తీసుకెళ్ళి నీ స్నేహితుడి కివ్వు.' అన్నది.

'అతను ఇష్టమై ఇచ్చిపోయాడు. నేను మళ్ళీ ఎందుకు తీసుకువెళ్ళి ఇస్తాను?'

ఇంతసేపటికి చంద్రముఖి కొంచెం నవ్వ గలిగింది. కాని ఆ నవ్వులో ఆనందం లేదు. 'ఇష్టమై ఇచ్చిపోలేదు, నేను డబ్బు తీసుకుంటానని కోపంతో ఇచ్చిపోయాడు. సరే కాని చున్నీబాబూ! అతని కేమన్నా పిచ్చా?'

'ఏమాత్రం లేదు. కాని, కొన్నాళ్లనుంచి అతని మనస్సు సరిగా ఉండటం లే దనుకుంటాను.'

'ఎందుకు సరిగా ఉండటంలేదో నీకేమన్నా తెలుసునా?'

'తెలియదు, బహుశా ఇంటిదగ్గర ఏదన్నా జరిగి ఉంటుంది.'

'అయితే ఇక్కడి కెందుకు తీసుకొచ్చావు?'

'నేను తీసుకు రాలేదు. అతనే బలవంతాన వచ్చాడు.'

చంద్రముఖికి ఈమాటు నిజంగా విస్మయం కలిగింది—'బలవంతాన వచ్చాడా? అంతా ఎరిగే!' అన్నది.

చున్నీలాలు కొంచెం ఆలోచించి—'అంత కాక! అతనికి అంతా తెలుసు. నేను మోసపుచ్చి తీసుకు రాలేదు.' అన్నాడు.

చంద్రముఖి కొంచెంసేపు మాట్లాడలేదు. కాసేపు ఏదో ఆలోచించుకుని—'చున్నీ! నాకొక సహాయం చేసిపెడతావా?' అని అడిగింది.

'ఏమిటి?'

'నీ స్నేహితుడు ఎక్కడ ఉంటాడు?'

'నా దగ్గరే.'

'ఇంకోమాటు అతన్ని తీసుకు రాగలవా?'

'బహుశా తీసుకురాలే ననుకుంటాను. ఇంతకు ముందు ఇలాంటిచోటి కెప్పుడూ రాలేదు. ఇక ముందు కూడా రాడనుకుంటాను. సరే గాని, ఎందుకో కాస్త చెప్పు, విందాం?'

చంద్రముఖి మ్లానహాసంతో 'చున్నీ! ఎలాగైనా, ఆఖరికి మోసగించైనా అతన్ని ఇంకోమాటు తీసుకురావూ?'

చున్నీ నవ్వి—'చీదరింపుతో ప్రేమ పుట్టుకొచ్చిందా ఏమిటి?' అని కన్ను కొట్టుతూ అడిగాడు.

చంద్రముఖి కూడా నవ్వింది—'చూడకుండానే నోటు పారేసి పోయాడు. ఇంకా గ్రహించలేదా?' అన్నది.

చున్నీలాలు చంద్రముఖిని కొంతవరకు అర్థం చేసుకున్నాడు. తల తిప్పుతూ 'వద్దు వద్దు. ఆ రకం మనుష్యులు వేరు. ఆట్టే పెట్టుకో; కాని నిజ మేమిటో నాకు చెప్పవా?' అన్నాడు.

'నిజంగానే అతనిమీద నాకు కొంత మమత కలిగింది.'

చున్నీకి నమ్మకం కలగలేదు—'ఈ అయిదు నిమిషాలకేనా?' అన్నాడు నవ్వుతూ. ఈ మాటు చంద్రముఖి కూడా నవ్వుతూ—'అం—అతని మనసు సరిగా ఉన్నప్పుడు ఒక మాటు తీసుకురా, చూడాలి! తీసుకు వస్తావా?' అని అడిగింది.

'ఎలా చెప్తాను!'

'నా మీద ఒట్టు!'

'సరే చూస్తాను!'

* * *

పార్వతి అత్తగారింటికి వచ్చి చూసింది—ఇల్లు చాలా పెద్దది, కాని ఆధునిక పద్ధతిది కాదు. అంతా పురాతన ఫక్కీ, అంతఃపురం వేరుగా ఉంది. పూజా

గృహము, నాట్యశాల, భండార గృహము, కచేరీ చావిడి, ఎంతో మంది దాసదాసీలు! పార్వతి విస్తు పోయింది. భర్తగారు జమీందారనీ, భాగ్యవంతులనీ ఆమె విని ఉన్నది. కాని ఇంత ధన వంతులని తలచ లేదు. ఇకలో ఎల్లా మనుష్యులే; ఆత్మీయులు ఎవరూ లేరు. అంతఃపురమంతా జన శూన్యం! పార్వతి కొత్త పెళ్ళి కూతురు. ఒక్క మాటే గృహిణి అయి కూర్చున్నది. ఆమెను ఆహ్వానించి ఇంట్లోకి తీసుకు పోవటానికి, ఒక ముసలి మేనత్త మాత్రం ఉన్నది. ఈమెను మినహాయిస్తే అంతా దాసదాసీలే.

సాయంకాలం చక్కని, ఇరవై సంవత్సరాల యువకుడు వచ్చి, పార్వతికి దగ్గరగా నిలబడి నమస్కరించి-'అమ్మా! నేను మీ పెద్ద అబ్బాయిని' అన్నాడు.

పార్వతి మేలిముసుగులోనుంచే చూసింది. మాట్లాడలేదు. ఆ కుర్రవాడు మళ్ళీ నమస్కరించి—'అమ్మా, నేను మీ పెద్దబ్బాయిని—నమస్కరించటానికి వచ్చాను' అన్నాడు.

పార్వతి మేలిముసుగు పైకి లాక్కుని—'రా నాయనా, కూర్చో'! అని ఈ మాటు మృదు స్వరంతో అన్నది. కుర్రవాని పేరు మహేంద్రుడు. అతను కొంచెం సేపు పార్వతి ముఖంవంక సబుడై చూస్తూ ఉండి పోయాడు. తర్వాత దగ్గరగా కూర్చుని, గొంతు తగ్గించి చెప్పనారంభించాడు:

'ఇప్పటికి రెండు సంవత్సరాలైంది' మా తల్లి చనిపోయి. ఈ రెండు సంవత్సరాలూ ఎంత కష్టంతోనూ, దుఃఖంతోనూ గడిపామో చెప్పలేక్యం కాదు. ఇవ్వాళ మీరు వచ్చారు. ఇకనన్నా మేము సుఖపడేటట్టు ఆశీర్వదించు తల్లీ!'

పార్వతి చాల సహజ స్వరంతో మాట్లాడింది. ఒక్కమాటే గృహిణి అయి, అనేక సంగతులు తెలుసుకోవలసి, మాట్లాడవలసి వచ్చినప్పుడు, మాట్లాడక ఏమి చేస్తుంది? కాని చాలామందికి ఇది అస్వాభావికంగా కనపడవచ్చు. పార్వతిని బాగా ఎరిగినవారు మాత్రం, అవస్థా భేదాల వల్ల పార్వతి ఈడుకు మించి పరిపక్వమైందని తెలుసుకుంటారు. ఇంతేకాక, అనవసరంగా సిగ్గు పడటం, అహేతుకంగా సంకోచ పడటం, ఆమె కెప్పుడూ అలవాటులేదు.

'నా మిగతా పిల్లలు ఎక్కడున్నారు, నాయనా?' అని అడిగింది.

మహేంద్రుడు కాస్త నవ్వి-'చెప్తాను, మీ పెద్దమ్మాయి-నా చెల్లెలు-అత్త

గారింటి దగ్గరనే ఉన్నది. నేను ఉత్తరంకూడా రాశాను-కాని యశోద రావటానికి వీలు పడలేదు!' అన్నాడు.

పార్వతికి విచారం కలిగింది—'రాలేకపోయిందా? లేక రావటానికి ఇష్టం లేకనా!' అని అడిగింది.

మహేంద్రుడు సిగ్గుపడుతూ—'సరిగా తెలియదమ్మా!' అన్నాడు.

కాని అతని మాటలూ, ముఖభంగిమనూ పట్టి యశోద అలిగే రాలేదని పార్వతి గ్రహించింది.

'మరి చిన్నబ్బాయి ?'

'వాడు త్వరలోనే వస్తాడు. కలకత్తాలో ఉన్నాడు—పరీక్షలు కాగానే వస్తాడు.'

* * *

భువన చౌదరి జమీందారీ పనులు స్వయంగానే చూస్తూఉండేవాడు. ఇంతే కాక సాలిగ్రామ పూజ,సత్రంలో సాధుసన్యాసులకు పరిచర్య,తానేస్వయంగా చేస్తూ ఉండేవాడు. వ్రత ఉపవాసాలుకూడా ఉంటూ ఉండేవాడు. ఈ పనుల్లో అతనికి రాత్రి పది గంటలదాకా తెమిలేది కాదు. కొత్తగా పెళ్లి చేసుకున్న సంతోషం వారిలో ఏమీ కనపడ లేదు. ఎప్పుడైనా ఒకరోజున అంతఃపురంలోకి వచ్చేవాడు. లేకపోతే అదీలేదు. వచ్చినా కూడా మామూలు సంభాషణే జరిగేది. పక్కమీద, బాలీసు తలక్రిందకు లాక్కుని, పండుకుని, కళ్ళు మూసుకుని బిగ్గరగా—'ఇప్పుడు నీవే ఈ ఇంటికంతా యజమానురాలివి! కాస్త అంతా చూసి, చేసి, సంసారం దిద్దు.' అనేవాడు.

'అలాగే' అనేది పార్వతి తల తిప్పుతూ.

'ఇదిగో, ఈ పిల్లలంతా నీవాళ్లే—' అనేవాడు భువనబాబు. భర్త సిగ్గుపడటం చూసి పార్వతి పెదవులమీద నవ్వు కనిపించేది. భువనబాబు కొంచెం నవ్వుతెచ్చుకొని మరల అనేవాడు :

'ఆc—మహేంద్రుడు నీ పెద్దబ్బాయి, బి. ఏ. కూడా ప్యాసయినాడు—ఎంత మంచివాడు!—ఎంత దయాధర్మాలు కలవాడు!—కాస్త ఆత్మీయతా కొంచెం ఆదరమూ చూపిస్తే—'

పార్వతి నవ్వు నాపుకుని 'నాకు తెలుసు. వాడు మన పెద్దబ్బా'యని అనేది.

'అవును, ఎందుకు తెలియదు! అలాంటివాణ్ణి ఎవ్వరూ చూసి ఉండరు. ఇక యశోద పిల్ల కాదు ప్రతిమ. తప్పకుండా వస్తుంది; ఎందుకురాదు? ముసలి తండ్రిని చూడటానికి ఎందుకు రాదూ? వచ్చినప్పుడు కాస్త దాన్ని—'

పార్వతి భర్త దగ్గరకువచ్చి అతని బట్టలమీద మెత్తని చేయివేసి 'మీరా సంగతి ఆలోచించ నక్కర్లేదు. నేను యశోదను తీసుకురావటానికి మనిషిని పంపుతాను. లేకపోతే మహేంద్రుడే పోతాడు' అనేది.

'పోతాడా? సరే! నేను చాలా రోజులనుంచి చూడ లేదు—మనిషిని పంపుతావా?'

'ఎందుకు పంపను? నా అమ్మాయిని తీసుకు రావటం నాకు తెలియదా?'

వృద్ధుడు ఉత్సాహంతో లేచి కూర్చుని, ఇద్దరికీ ఉన్న సంబంధంకూడా మరిచిపోయి, పార్వతి తలను స్పృశించి ఆశీర్వదించేవాడు: 'నీకు శుభం కలుగుతుంది. నువ్వు సుఖపడతావు. భగవంతుడు నీకు...' తర్వాత అవృద్ధునికి ఏవేవో సంగతులు జ్ఞాపకం వచ్చేని. మళ్ళీ పక్కమీద పండుకుని, కళ్ళు మూసుకుని—'ఒక్కగాని ఒక్క అమ్మాయి—నన్ను ఎంత ప్రేమించేది!' అని మనస్సులో అనుకునేవాడు.

ఈ సమయంలో అతని నెరసిన మీసాల పక్కగా అశ్రుబిందువులు జారి బాలీసు మీద పడేవి. పార్వతి తుడిచేది. అతను మెల్లగా గొణుక్కునేవాడు—'ఆహా, మళ్ళీ అందరూ వస్తారు. ఇంకోమాటు ఇల్లూ వాకిలీ కళ కళ లాడుతుంది—ఒక్కమాటుగా వెలిగిపోతుంది. పూర్వం సంసారం ఎంత బాగుండేది? కొడుకులు, కూతురు, భార్య—తిరణాలగా ఉండేది; పండగగా ఉండేది. తర్వాత ఒకనాడు అంతా చల్లారి పోయింది. కొడుకులు కలకత్తా వెళ్ళారు. యశోద అత్తవారింటికి పోయింది—మళ్ళీ అంధకారమూ, శ్మశానమూ—'

ఈ సమయంలో అతని మీసాలు రెండూ తడిసి బాలీసుకూడా తడిసేది. పార్వతి ఆకులపాటుతో కన్నీరు తుడిచి—'మహేనుకు పెళ్ళెందుకు చేయలేదు?' అని అడిగేది.

వృద్ధుడు అనేవాడు—'అలా అయితే నాకు మంచిరోజులు వచ్చేవే! నేను

కూడా చేద్దామనే అనుకున్నాను. కాని వాడి మనస్సులో ఏమున్నదో ఎవరికి తెలుసు! వాడు పట్టుపట్టి వివాహం చేసుకోలేదు. అందుకనే ఈ ముసలి తనంలో, ఇల్లంతా బావురుమంటూ ఉంటే—దరిద్రుని కొంప మాదిరి బోసి కొట్టుతూ ఉంటే—లక్ష్మి వదలిపెట్టి వెళ్లిపోయినట్లుగా ఉంటే—ఇంట్లో ఎక్కడా వెలుగు అనేది కనపడకపోతే—ఈ—'

ఈ మాటలు వింటే పార్వతికి చాలా దుఃఖం వచ్చేది. ఆమె లేచి నవ్వు తెచ్చుకుని, కరుణస్వరంతో—'మీరు ముసలివారైతే, నేనూ త్వరగా ముసలిదాన్నవుతాను. ఆడవాళ్ళు ముసలివాళ్ళు కావటానికి కొంత కాలం పడుతుంది!' అనేది.

భువన చౌదరి లేచి కూర్చుని, చేత్తో ఆమె గడ్డం పట్టుకుని ముఖంవంక చాలాసేపు చూస్తో ఉండి పోయేవాడు. శిల్పి ప్రతిమను అలంకరించి, తల మీద కిరీటంపెట్టి, అటూ ఇటూ వంగి, చాలాసేపు ఎలా చూస్తూఉంటాడో, కొంచెం గర్వమూ, చాలా స్నేహమూ అతని ముఖంలో ఎలా కూడుకుం టుందో, అలానే భువనబాబు ముఖంలోనూ కూడుకునేవి. ఎప్పుడన్నా అతని నోటినుంచి అస్ఫుటంగా-'అయ్యో! నేను మంచిపనిచేయలేదు!'అని వెలువడేది.

'ఏమిటండీ, మంచిది కానిది ?'

'ఈ యింట్లో నీవు శోభించవని అనుకుంటున్నా—'

'బాగానే శోభిస్తాను. మా కింకా శోభించడం, శోభించకపోవడం ఏ ముంది? ' అనేది నవ్వుతూ. వృద్ధుడు మళ్ళీ పండుకుని మనస్సులో అనుకునే వాడు. 'ఆఁ! ఆ సంగతి నాకు తెలుసు—తెలుసును! తప్పక నీకు మేలు కలుగుతుంది. భగవంతుడు నిన్ను కనిపెట్టి ఉంటాడు.'

* * *

ఈ విధంగా ఒక మాసం గడిచింది. ఈమధ్య ఒకమాటు చక్రవర్తి కుమా రైను తీసుకుపోవటానికి వచ్చాడు. కాని పార్వతి పోవటానికి ఇష్టపడలేదు; 'దారీ తెన్నూ లేని సంసారం నాన్నా! ఇంకా కొన్నాళ్లుండి వస్తాను' అన్నది తండ్రితో. తండ్రి ముఖం చాటు చేసుకుని నవ్వుకొని—'స్త్రీజాతే యిటు వంటిదని మనస్సులో అనుకున్నాడు.

తండ్రి వెళ్ళిపోయిన తర్వాత పార్వతి మహేంద్రుని పిలిచి— 'నాయనా! ఒకమాటు మన అమ్మాయిని తీసుకురా!' అన్నది.

మహేంద్రుడు తప్పించుకోవాలని చూశాడు. యశోద ఎంతమాత్రం రాదని అతనికి తెలుసు: 'నాన్న పోతే బాగుంటుం దనుకుంటాను' అని సంకోచిస్తూ అన్నాడు. 'ఛీ, అది బాగా ఉంటుందా? అంత కంటె మనిద్దరం పోయి తీసుకువద్దాము,' అన్నది పార్వతి!

'మీరు వస్తారా?' అన్నాడు మహేంద్రుడు ఆశ్చర్యంతో.

'తప్పేముంది నాయనా! సిగ్గుపడవలసిన విషయం ఇందులో నాకేమీ కనపడటం లేదు. నేను వెళ్లినందువల్ల యశోద వస్తే, దానికోపం తగ్గిపోతే— రావటం నా కేమంత కష్టం!'

మర్నాడు మహేంద్రుడు ఒంటరిగానే యశోదను తీసుకు రావటానికి పోయాడు. అక్కడ ఏమి కౌశలం చూపించాడో తెలియదు, కాని నాలుగో నాడు యశోదను వెంటపెట్టుకుని వచ్చాడు.

ఆ రోజున పార్వతి వొంటిమీద కొత్తవీ, చిత్రమైనవీ, విలువగలవీ, చాలా నగలున్నవి. కొన్ని ఆనాడే భువనబాబు కలకత్తానుంచి తెచ్చి యిచ్చాడు. పార్వతి అవి పెట్టుకుని కూర్చున్నది. దోవను వచ్చేటప్పుడు, యశోద కోపంతోనూ, అభిమానంతోనూ అనేకమాటలు వల్లించుకుంటూ వచ్చింది. కాని, పినతల్లిని జూడగానే ఆమె స్తంభీభూతురాలైంది. ఆమె అనాలని, ద్వేషంతో వల్లించుకుంటూ వచ్చిన మాటలన్నీ మరచిపోయి అస్ఫుటంగా— 'ఈమేనా!' అని అన్నది.

పార్వతి యశోదను చేయిపట్టుకొని ఇంట్లోకి తీసుకుపోయింది. దగ్గర కూర్చోపెట్టుకుని విసనకర్రతో విసురుతూ—'ఏం తల్లీ! అమ్మమీద కోపమా?' అని అడిగింది.

యశోద ముఖం సిగ్గుతో కందిపోయింది. పార్వతి అప్పుడు తన వొంటి మీది నగలను ఒక్కొక్కటే తీసి యశోదను అలంకరింప నారంభించింది. యశోద విస్మయంతో 'ఇదేమిటి?' అని అన్నది.

'ఏమీలేదు. ఇది మీ అమ్మ అభిలాష!'

నగలు పెట్టుకోవటం యశోదకు ఇష్టంలేకపోలేదు. అలంకారం పూర్తి అయినాక ఆమె పెదవులమీద చిరునవ్వుకూడా కనిపించింది. యశోదను అలంకరించి నిరాభరణయై, పార్వతి—'అమ్మమీద కోపమా తల్లీ?' అని అడిగింది.

'ఊహుం. కోపమెందుకు?—కోప మేముంది?'

'అంతకాక మరేముంది తల్లీ! ఇది మీ తండ్రిగారిల్లు, పెద్దయిల్లు—ఎంతోమంది దాసదాసీలు కావలసి ఉంటారు. నేనూ ఒక దాసీనేగా. ఛీ, దాస దాసీలమీద అలగటం బాగా ఉంటుందా తల్లీ!'

యశోద ఏళ్లకు పెద్ద దయినా మాటల్లో ఇంకా చాలాచిన్నది. ఆమె కలవరపడింది. పార్వతి విసనకర్రతో విసరుతూ అన్నది:

'దరిద్రుల బిడ్డను, మీదయవల్ల ఇక్కడ కొంచెం చోటు చిక్కింది. ఎంత మంది దీనులూ, అనాథలూ మిమ్మల్ని ఆశ్రయించి బ్రతకటం లేదు?—నేను కూడా వారిలో ఒకతెను, ఆశ్రితులను—'

పార్వతి ఆమె రెండు చేతులూ పట్టుకున్నది.

'నా తప్పులన్నీ ఎంచబోకు తల్లీ!' అన్నది.

మరునాడు మహేంద్రుడు యశోదను చాటుకు పిలిచి—'ఏం, కోపం ఏమన్నా తగ్గిందా?' అని అడిగాడు.

యశోద చప్పున అన్న కాళ్లు పుచ్చుకుని—'అన్నా! కోపంలో—ఛీఛీ—ఏమేమో వాగాను. చూడు, అ వెక్కడా వెల్లడించకు!' అన్నది మహేంద్రుడు నవ్వ నారంభించాడు.

'మాకు తల్లి ఎక్కడన్నా ఇంత ప్రేమ చూపిస్తుందా, అన్నాయి!' అని యశోద అడిగింది.

రెండు దినాలు గడచినాక యశోద తండ్రి దగ్గరికిపోయి—'ఇంకా రెండు మూడు మాసాలదాకా రానని వారికి ఉత్తరం రాయి నాన్నా!' అన్నది.

'ఎందుకు తల్లీ?' అన్నాడు భువనబాబు ఆశ్చర్యంతో.

యశోద సిగ్గుపడుతూ, మందహాసం చేసి—'నా వొంట్లో అంత బాగా లేదు. కొన్నాళ్లు పిన్నిదగ్గర ఉంటాను.' అన్నది.

ఆనందంతో వృద్ధుని కళ్ళవెంట జల జల నీరుకారింది. సాయంత్రం

పార్వతిని పిలిచి—'నువ్వు నా పరువు నిలిపావు? నూరేళ్ళు బ్రతుకు—నూరేళ్ళు బ్రతుకు!' అని ఆశీర్వదించాడు.

'అదేమిటండీ—?' అన్నది పార్వతి.

'అదేమిటో నే నిప్పుడు సరిగా చెప్పలేను—భగవంతుడా! ఇప్పుడు నువ్వు నన్నెంత అవమానంనుంచీ, మనోదుఃఖంనుంచీ తప్పించావు?'

ఆ సందె చీకటిలో భర్త కళ్లలో నీరు నిండటం పార్వతికి కనిపించలేదు. ఇక వినోదలాల్, భువనబాబు చిన్న కొడుకు, మిగిలాడు. వాడు పరీక్షకు కూర్చుని వచ్చినాక మళ్ళీ చదవటానికి పోలేదు.

*   *   *

చంద్రముఖి ఇంటినుంచి తిరిగివచ్చినాక దేవదాసు, పిచ్చివానిలాగా రోడ్ల వెంట తిరిగాడు! ఒకనాడు ధర్మదాసు ఏమో చెప్పబోతే, వాడిని గుడ్లురిమి బెదరించాడు. దేవదాసు ధోరణి చూసేవరకు చున్నీలాలుకుకూడా ఏమీ చెప్పటానికి ధైర్యం లేకపోయింది; ధర్మదాసు ఏడుస్తూ 'చున్నీబాబూ! ఎందుకు వీరిలా మారిపోయారు?' అని చున్నీని అడిగాడు.

'అదే, ధర్మదాస్! ఏమి జరిగిందేమిటి?' అని చున్నీ మరల ప్రశ్నించాడు.

ఒక అంధుడు ఇంకో అంధుణ్ణి దోవ చూపించమని అడిగాడు! అసలు సంగతేమిటో వీరిద్దరికీ తెలియదు. ధర్మదాసు కళ్లు తుడుచుకుంటూ—'చున్నీ బాబూ! ఏలాగైనాసరే, దేవదాసును ఒకమాటు వాళ్ల తల్లి దగ్గరికి పంపించు. ఇక చదవ దలచ నప్పుడు ఇక్కడ ఉండి ఏమి చేస్తాడు?' అన్నాడు.

ఆమాట నిజమే. చున్నీలాలు ఆసంగతే ఆలోచించ నారంభించాడు.

నాలుగైదు రోజులు గడిచాక ఒకనాడు చున్నీబాబు సాయంకాలం బయటకుపోతూ ఉండగా దేవదాసు ఎక్కడనుంచో వచ్చి అతని చేయిపట్టుకొని—'అక్కడికే పోతున్నావా, చున్నీబాబూ?' అని అడినాడు.

చున్నీలాలు సగం చచ్చి—'ఆఁ. ఇక వద్దంటే పోను,' అన్నాడు.

'ఉహుఁ, నేనువద్దనను. కాని నాకొక సంగతిచెప్పు—నువ్వు ఏఆపేక్షతో అక్కడికి పోతున్నావు?'

'వేరే ఆపేక్షేముంది, కాలం గడపటానికే.'

'గడుస్తుందా ? ఏమీ, నాకు గడవటం లేదే; నేను కూడా కాలం గడ పాలను కుంటున్నాను !'

చున్నీలాలు కాసేపు అతని ముఖం వంక చూస్తూ ఉండి పోయాడు— అతని మనస్సులోసంగతులు ముఖాన్ని బట్టి తెలుసుకోవా లన్నట్టుగా! తర్వాత— 'దేవదాస్ ! అసలు వ్యవహారమేమిటో కాస్త చెప్పుతావా ?' అని అడిగాడు.

'ఏమీ లేదు ?'

'చెప్పవా ?'

'కాదు చున్నీ, చెప్పఁగాని కేమీ లేదు.'

చున్నీ చాలాసేపు నేలవంక చూసి— 'దేవదాస్ ! నా మాట ఒకటి నిలు పుతావా ?' అని అడిగాడు.

'ఏమిటి ?'

'అక్కడికి ఇంకోమాటు రావాలి, నేను మాట ఇచ్చాను.'

'ఆవాళ మనం వెళ్ళినచోటుకే కదూ ?'

'ఆఁ—'

'ఛీ, నాకు బాగుండదు.'

'నీకు బాగా ఉండేటట్టు నేను చేస్తానుగా.'

దేవదాసు కొంచెంసేపు అన్యమనస్కునివలె మాట్లాడకుండా ఉండి— 'సరే, వెళ్ళుదాము, పద !' అన్నాడు.

*　　　*　　　*

దేవదాసును అధోగతిలోకి ఒక మెట్టు క్రిందకు దించి చున్నీలాలు ఎటో తప్పుకుపోయాడు. దేవదాసు ఒక్కడే చంద్రముఖి గదిలో క్రింద కూర్చుని మద్యం తాగుతున్నాడు. చంద్రముఖి అతని దగ్గరనే కూర్చుని, విచారంతో అతని ముఖం వంక చూస్తూ 'దేవదాస్, ఇక త్రాగబోకు' అంది భయంతో

దేవదాసు గ్లాసు క్రిందపెట్టి ముఖం చిట్లించుకుని— 'ఎందుకు' అన్నాడు.

'మద్యం అలవాటు చేసుకుని కొద్ది రోజులే అయింది. అంత ఎక్కువ భరాయించలేవు.'

'భరాయించటం కోసం కాదు నేను మద్యం త్రాగటం, ఇక్కడ ఉండటానికే త్రాగుతున్నాను.'

ఈ మాట చంద్రముఖి అనేకసార్లు విని ఉన్నది. ఒక్కొక్కప్పుడు తల గోడకువేసి పగలగొట్టుకుని చద్దామని కూడా అనుకున్నది—దేవదాసును ఆమె ప్రేమించింది. దేవదాసు మద్యం గ్లాసు విసిరివేశాడు. అదిపోయి సోఫాకోటికి కొట్టుకొని చూర్ణమైపోయింది. తర్వాత దేవదాసు బాలీసు లాక్కొని పండుకుని తొట్రుపడుతున్న స్వరంతో చెప్పనారంభించాడు:—'నాకు లేచిపోయే సత్తువలేదు. అందుకనే ఇక్కడ కూర్చున్నాను. నాకు స్మృతి ఉండటం లేదు — అందుకనే నీముఖం వంక చూసి మాట్లాడ గలుగుతున్నాను. చం—ద—రా—ఇంకా నాకు పూర్తిగా తెలివి పోలేదు. కాస్త ఉన్నది— నిన్నంటుకోలేను. నీ వంటే నాకు పరమ అసహ్యం.'

చంద్రముఖి కళ్లు తుడుచుకొని, మెల్లగా—దేవదాస్! ఇక్కడికి ఎంతో మంది వస్తారు. కాని వాళ్లెవరూ మద్యం అంటుకోరు' అన్నది.

దేవదాసు కళ్లు విప్పుకుని లేచి కూర్చుని తడబడుతూ, చేతులు అటూఇటూ తిప్పుతూ—'అంటుకోరా ? నాదగ్గర తుపాకి ఉంటే వాళ్ళని కాల్చివేసే వాణ్ణి. వాళ్ళు నాకంటే కూడా పాపిష్టులు చంద్రముఖీ.' కొంచెం సేపాగి మళ్ళీ 'ఎప్పుడైనా తాగుడు వదలి పెట్టితే-అసలు వదలిపెట్టనులే-మళ్ళీ నేను నీ దగ్గరకి రాను. నాకు ఈ మాత్రమైనా దోవ కనపడుతున్నది, కాని వారికేదీ ?' అన్నాడు.

కాసేపు ఆగి మద్యాన్ని సంబోధించి మళ్ళీ చెప్పనారంభించాడు :

'ఓ నా ఆపద్బంధువా ! నేను చాలా కష్టంలో ఉండి నిన్ను అలవాటు చేసుకున్నాను, నిన్ను నేను వదలిపెట్టను. వదలి పెట్టలేను.'

దేవదాసు బాలీసు మీద ముఖం రుద్ద నారంభించాడు — చంద్రముఖి తొందరగా అతని దగ్గరికి వచ్చి ముఖంపైకి ఎత్తింది. దేవదాసు ముఖం చిట్లించుకుని అన్నాడు :

'ఛీ, నన్ను అంటుకోబోకు. ఇంకా నాకు తెలివి ఉన్నది. చంద్రముఖీ ! నీకు బాగా తెలియదు—నాకు తెలుసును, నిన్ను నేను ఎంత అసహ్యించు

కుంటున్నదీ ? నిన్ను ఎప్పుడూ ఏవగిస్తాను. అయినా నీ దగ్గరికి వస్తాను, కూర్చుంటాను, మాట్లాడతాను. లేకపోతే నాకు గత్యంతరంలేదు: ఈ సంగతి నీకు అర్థమవుతుందా ? హా, హా, హా—ఎవరైనా, పాపం చీకట్లో తప్పు చేయరు, నేను ఇక్కడికి వచ్చి తాగుబోతు నవుతున్నాను, ఇంతకంటే మంచి చోటు ఈ ప్రపంచంలో ఇంకెక్కడ ఉన్నది. ఇక మీరంతా—'

దేవదాసు దృష్టిని కేంద్రీకరించి కాసేపు చంద్రముఖి విచారముఖంవంక చూసి—'అహా ! సహనశక్తి నీలో ఉట్టిపడుతూంది. స్త్రీలు ఎంత అవమానమూ, తిరస్కారమూ, ఎన్ని అత్యాచారాలూ, ఉపద్రవాలూ సహింపగలరో దానికి నువ్వే తార్కాణం !'

తర్వాత వెల్లికిల పండుకొని మెల్లగా అనుకొసాగాడు :

'చంద్రముఖంట, నన్ను ప్రేమిస్తున్నదంట !—నాకక్కర్లేదా ప్రేమ—అక్కర్లేదు. లేదంటేలేదు. నాటకాలు ఆడేవాళ్లను చూశాముగా, ముఖానికి నామూ మసీ పూసుకొని, దొంగలవుతారు—బిచ్చమెత్తుతారు—రాజులవుతారు—రాణీలవుతారు—ప్రేమిస్తారు—ఎన్నో ప్రేమ సంగతులు చెప్తూతారు—ఎంతో ఏడుస్తారు—అంతా నిజమయనట్టుగా! అలాగే చంద్రముఖి కూడా నాదగ్గర నాటకం ఆడుతున్నది, నేను చూస్తున్నాను... కాని నాకు దాని సంగతే జ్ఞాపకం వస్తూఉంటుంది. ఒక్క క్షణంలో అంతా అయిపోయింది. అది ఎటు వెళ్ళి పోయింది ? నేను ఎటు వచ్చేశాను ? ఇక నా జీవితానికంతకూ మంచి అభినయం ఆరంభమైంది. ఒకరు పక్కా తాగుబోతు, ఇంకొకతె—సరే, అదే కానీయి—అదేకానీయి—పోయేదేముంది ! ఆశ లేదు, భరవాసా లేదు, సుఖంలేదు, శోకలేదు. వహ్వా ! అదేకానీయి !'

తర్వాత దేవదాసు ప్రక్కకు పొర్లి ఏమేమో గొణగ నారంభించాడు. చంద్రముఖికి ఏవీ అర్థం కాలేదు. కాసేపట్లో దేవదాసు నిద్రపోయాడు—అప్పుడు చంద్రముఖి దగ్గరకువచ్చి కూర్చున్నది. కొంగుతడిపి ముఖమంతా తుడిచి, తడిసిన దిండు మార్చింది. విసనకర్ర తీసుకొని కాసేపు విసిరి, చాలా సేపు తల వంచుకు కూర్చున్నది. రాత్రి ఒంటిగంట అయాక దీపం పెద్దచేసి, తలుపు దగ్గరకు లాగి ఇంకో గదిలోకి వెళ్ళిపోయింది.

దేవదాసూ, అతని అన్న ద్విజదాసూ, ఇంకా గ్రామస్థులు కొందరూ జమీందారు నారాయణ ముఖర్జీకి అగ్ని సంస్కారంచేసి ఇంటికి తిరిగివచ్చారు. ద్విజదాసు బిగ్గరగా ఏడుస్తూ ఉన్నాడు. అతని స్థితి పిచ్చివానిలాగా ఉన్నది. గ్రామస్థులు ఐ దారుగురు కూడా అతన్ని పట్టుకుని ఆపలేకుండా ఉన్నారు. దేవదాసు శాంతంగా స్తంభానికి ఆనుకొని కూర్చున్నాడు. అతని నోట మాటా లేదు; కంట తడీ లేదు. ఎవ్వరూ వచ్చి అతన్ని పట్టుకోవటమూ లేదు—ఓదార్చాలనే ప్రయత్నమూ లేదు. మధుసూదన ఘోషు మాత్రం ఒకమాటు అతని దగ్గరికివచ్చి—'ఏమిచేస్తాం, నాయనా! నొస్ట రాసింది—' అంటూ ఏమేమో చెప్పబోయాడు, కాని దేవదాసు చెప్పనీ చెప్పకుండానే ద్విజదాసువంక వేలు చూపించి 'అక్కడ' అని అన్నాడు. ఘోషు మహాశయుడు అప్రతిభుడై—'అవును. వారికెంతే దుఃఖం—' అంటూ వెళ్ళిపోయాడు. ఇక ఎవ్వరూ అతని దగ్గరికి రాలేదు. రెండు ఝాము లయినాక దేవదాసు అర్ధ మూర్ఛితావస్థలో ఉన్న తల్లి దగ్గరికిపోయి కాళ్ళ దగ్గర కూర్చున్నాడు. ఆమెను చాలామంది స్త్రీలు చుట్టి ఉన్నారు. పార్వతి నాయనమ్మకూడా అక్కడనే ఉన్నది. ఆమె శోకాతురాలైన సద్యవిధవను భగ్న స్వరంతో సంబోధించి—'అమ్మాయీ! ఒకమాటు కళ్ళు తెరచి చూడు, దేవదాసు వచ్చాడు' అన్నది.

దేవదాసు—'అమ్మా' అని పిలిచాడు.

ఆమె ఒక్కమాటు కళ్ళు తెరచి — 'నాయనా' అన్నది. తర్వాత మూసిన కనుకొలకుల నించి కట్టతెగిన ప్రవాహంలాగ అశ్రుధార ప్రవహించింది. స్త్రీలు ఒక్కమాటుగా గొల్లుమని ఏడ్చారు. దేవదాసు కాసేపు తల్లి కాళ్ళ మీద తలపెట్టి, తర్వాత నెమ్మదిగా తండ్రి చనిపోయిన గదిలోకి పోయాడు. అతని కంట నీరు లేదు. శాంత-గంభీర మూర్తి. ఎర్రని కళ్ళతో పైవంక చూస్తూ నేలమీద కూర్చున్నాడు. అప్పుడు అతని వాలకం చూస్తే ఎవరైనా భయపడతారు. కణతల మీది నరాలు తాళ్లవలె ఉబ్బినవి. సంస్కారం లేక వెంట్రుకలు నిక్కబొడుచుకున్నవి. దబ్బపండు వంటి శరీరం మీద సిరా పూసినట్టుగా ఉన్నది. కలకత్తాలోని అనాచారలే కాక ఒక రాత్రల్లా జాగరణ చేశాడు; పైన తండ్రిచావు ఒక సంవత్సరం క్రిందట చూసినవా

క్కెవరూ అతన్ని ఇప్పుడు చప్పున గుర్తించలేరు.

కొంచెం సేపయినాక పార్వతి తల్లి అతనిని వెతుకుతూ తలుపు తెరచుకొని లోపలికి వచ్చి—'దేవదాస్ !' అని పిలిచింది.

'ఏమి, అత్తయ్యా ?'

'ఇలా ఉంటే జరగదు, నాయనా !'

దేవదాసు ఆమెవైపుకు తిరిగి—'ఏం చేశాను అత్తయ్యా ?' అన్నాడు.

ఏమి చేసిందీ ఆమెకు తెలుసు. కాని జవాబివ్వలేకపోయింది. ఆమె దేవదాసు తలను దగ్గరికి తీసుకొని—'మా తండ్రివి కాదూ !' అన్నది.

'ఏమిటి అత్తయ్యా ?'

'మా బాబువి కాదూ !'

దేవదాసు ఆమె హృదయంలో తలపెట్టి ఒక అశ్రుబిందువు రాల్చాడు.

దుఃఖ పరివారాలకు కూడా కాలం గడుస్తుంది. క్రమంగా తెల్లవారింది. ఏడుపులూ మొత్తుకోళ్ళూ చాలవరకు తగ్గినవి. ద్విజదాసు ఒక్కమాటుగా మామూలు స్థితిలోకి వచ్చి వేశాడు. వాళ్ళ తల్లి కూడా లేచింది—కళ్లు తుడుచుకుంటూ నిత్యకృత్యాలు చేసుకో నారంభించింది.

రెండు రోజులు గడిచినాక ద్విజదాసు తమ్ముణ్ణి పిలిచి—'దేవదాస్! తండ్రిగారి శ్రాద్ధానికి ఎంత ఖర్చుపెట్టటం మంచిది ?' అని అడిగాడు.

దేవదాసు అన్నముఖం వంక చూసి—'మీ కుచితమని తోచినంత'అన్నాడు.

'కాదు భాయీ ! ఇప్పుడు నా ఒక్కడి ఇష్టంతో పని జరగదు. నీవూ పెద్దవాడి వయావు. నీ అభిప్రాయం తెలుసుకోవడం కూడా అవసరం.'

'రొఖ్ఖం ఎంత నిలవున్నది ?'

'ఉమ్మడిని లక్షా యాభైవేలు ఉంటవి. పది పన్నెండు వేలు ఖర్చుపెట్టితే సరిపోతుందని నా ఉద్దేశం. ఏమంటావు ?'

'నాకెంత వస్తుంది ?'

ద్విజదాసు సంకోచిస్తూ—'ఆ, నీకూ సగం వస్తుంది. పది వేలు ఖర్చుపెట్టితే నీకో డెబ్బయి వేలూ నాకో డెబ్బయి వేలూ మిగులుతవి.

'మరి అమ్మకో ?'

'అమ్మ రోజ్యం ఏమి చేసుకుంటుంది? ఈ ఇంటికి పెద్దతల ఆమే నాయె, మనమే పోషిద్దాం.'

దేవదాసు కాసేపు ఆలోచించి—'నీ వంతు అయిదు వేలు, నా వంతు ఇరవై అయిదు వేలు ఖర్చు పెడదాము. మిగతా యాభై వేలలో నేను పాతిక వేలు తీసుకుంటాను, శేషించిన పాతిక వేలూ తల్లిగారి పేర జమఉంటవి. మీ అభిప్రాయం ఏమిటి?'

మొదట ద్విజదాసు సిగ్గు పడ్డాడు. తర్వాత—'చాలా మంచి సంగతి. నాసంగతి తెలుసు గా-భార్యా, కొడుకులు, కూతుళ్లూ...వాళ్లకు ఒడుగులూ, పెళ్ళిళ్ళూ-బోలెడు ఖర్చు పెట్టాల్సి ఉంటుంది. ఈ ఉద్దేశం బాగా నేఉన్నది.' అని కొంచెంసేపు ఆగి— 'సరే, కొంచెం రాసుకుంటే—' అన్నాడు.

'రాత కూతలవల్ల వచ్చేదేమున్నది—నలుగురిలో నగుబాటు తప్పితే? డబ్బు వ్యవహారం గోప్యంగా జరిగి పోవటమే మంచిదని నా ఉద్దేశం.'

'మంచిదే. కాని ఏ కాలానికి ఎలా ఉంటుందో—'

'సరే, నేను రాసిస్తాను.' అని దేవదాసు ఆ రోజునే కాగితం వ్రాసి ఇచ్చాడు.

మర్నాడు మధ్యాహ్నం దేవదాసు క్రిందకు దిగివస్తూ, పార్వతి మెట్టు ఎక్కి వస్తూ ఉండటం చూసి, ఆగి పోయాడు. పార్వతి అతన్ని చూసింది. ఆమెకు కొంచెం దుఃఖం కూడా కలిగింది. దేవదాసు ఆమె దగ్గరికి వచ్చి శాంత గంభీరస్వరంతో—'ఎప్పుడొచ్చావు పార్వతీ?'—అని అడిగాడు.

మూడు సంవత్సరాలు గడచినాక విన్నా అదే గొంతు!

పార్వతి తల వంచుకుని—'ఉదయమే వచ్చాను,' అన్నది.

'చాలా రోజుల నుంచి చూడటం పడలేదు. కులాసాగా ఉన్నావా?'

పార్వతి తల తిప్పింది.

'చౌదరిగారు బాగున్నారా? పిల్లా జల్లా అంతా క్షేమమా?'

'అంతా క్షేమమే.' అని పార్వతి ఒక మాటు దేవదాసు ముఖంవంక చూసింది. కాని అతను ఏ విధంగా ఉన్నదీ, ఏమి చేస్తున్నదీ ఒక్క ప్రశ్న కూడా అడగలేక పోయింది. అసలు నోటివెంట మాటే రాలేదు.

'ఇంకా కొన్నాళ్ళుంటావుగా?'

'ఆఁ.'

'అయితే ఇంకేం—' అని దేవదాసు బయటకు వెళ్ళిపోయాడు.

శ్రాద్ధం సక్రమంగా జరిగిపోయింది. దాని వివరాలు ఎత్తుకుంటే చాలా వ్రాయవలసి ఉంటుంది. అందుకని దాన్ని వదలివేస్తున్నాను. శ్రాద్ధం అయిన మర్నాడు పార్వతి ధర్మదాసును చాటుకు పిలిచి అతని చేతిలో బంగారపు గొలుసు పెట్టి—'ధర్మా, ఇది మీ అమ్మాయికి పెట్టుకో.' అని అన్నది.

ధర్మదాసు ఆమె వంక చూసి, అసలే తడిగా ఉన్న కళ్ళల్లో నీరు తెచ్చుకుని—'అహా! నిన్ను చూసి ఎంత కాలమైంది! అంతా క్షేమమేనా తల్లీ?' అని అడిగాడు.

'అంతా క్షేమమే. నీ పిల్లలందరూ బాగున్నారా?'

'ఆఁ. బాగానే ఉన్నారు.'

'నువ్వు బాగున్నావా?'

ఈమాటు ధర్మదాసు ఒక నిట్టూర్పు విడిచి—'ఇంకా ఏం బాగు! వారు కూడా పోయారు. నేను కూడా దాటిపోతే బాగుంటుందని అనుకుంటాను.' అని ధర్మదాసు శోకావేశంలో ఏమేమో చెప్పబోతున్నాడు. కాని పార్వతి అడ్డు వచ్చింది. ఈ సంగతులన్నీ వింటానికి ఆమె హారం ఇవ్వలేదు.

'అదేమిటి ధర్మా, నువ్వు లేకపోతే దేవదాసును ఎవరు చూస్తారు?'

ధర్మదాసు తల బాదుకొని-'చిన్నవాడుగా ఉన్నప్పుడు ఎలానో చూశాను. ఇప్పుడు చూడకుండా ఉండటమే మంచిదిపారూ, బతికిపోతాము' అన్నాడు.

పార్వతి ఇంకా కొంచెం దగ్గరికి వచ్చి—'ఒక్క సంగతి నాకు నిజం చెప్తావా, ధర్మా?' అని అడిగింది.

'ఎందుకు చెప్పను తల్లీ?'

'అయితే నిజం చెప్పు, దేవదా ఇప్పుడు ఏం చేస్తున్నాడు?'

'ఏం చేస్తాడు? నా తలకాయ!'

'విప్పి చెప్పు ధర్మా?'

ధర్మదాసు ఇంకోమాటు తల బాదుకుని—'ఇంకా ఏమి విప్పిచెప్పేది తల్లీ? అవన్నీ చెప్పే సంగతులా! ఇప్పుడు తండ్రి కూడా లేడు—చేతికి బోలెడు

డబ్బు వచ్చింది. ఈమాటు పట్టపగ్గా లుంటువా ?' అన్నాడు.

పార్వతి ముఖం ఒక్కమాటుగా నల్లబడింది. వా డిచ్చిన సూచనల బట్టి ఆమె కొంత గ్రహించి, స్తబ్ధురాలై 'ఏమిటి నువ్వు చెప్పేది ధర్మా?' అన్నది.

మనోరమ వ్రాసిన ఉత్తరాన్ని బట్టి ఆమె ఇదివరకు కొంత తెలుసుకున్నది. కాని అప్పుడు నమ్మలేదు.

ధర్మదాసు తను చెప్పేది నిజమన్నట్టుగా తల తిప్పి, చెప్ప నారంభించాడు:

'తిండిలేదు, నిద్రలేదు, ఎప్పుడూ బుడ్లకు బుడ్లు బ్రాంది తాగుతూ ఉంటాడు. ఒకోమాటు నాలుగైదు రోజుల దాకా కనపడడు—ఎక్కడ పడి ఉంటాడో, అంతు తెలియదు. బోలెడు డబ్బు తగలేశాడు! ఎన్నో వేలవి నగలే చేయించాడని విన్నాను.' పార్వతి ఆపాద మస్తకమూ కంపించింది.

'ఈ సంగతి నిజమేనా ధర్మదాస్ ?' అని అడిగింది.

ధర్మదాసు వెనుకటి ధోరణిలోనే చెప్ప నారంభించాడు :

'బహుశా నీ మాట వింటా డనుకుంటాను. ఒకమాటు విచారించ కూడదూ? బంగారమంటి వళ్లు గుల్లయి పోయింది. ఇలా తిరుగుతూ ఇంకెన్నాళ్ళు బ్రతుకుతాడు? ఈ సంగతులు ఎవరికి చెప్పేది? తల్లీ, తండ్రీ, అన్నలకూ చెప్ప వల్ల కాదాయె !' అని ధర్మదాసు తల తపతప బాదుకుని— 'తల పగులగొట్టుకుని చావ బుద్ధేస్తున్నది, పారూ. నాకు బతకాలనే కోరికే లేదు.' అన్నాడు. పార్వతి లేచి వెళ్ళిపోయింది.

నారాయణబాబు మరణవార్తవిని పార్వతి ఇక్కడకు పరుగెత్తు కొచ్చింది. ఈ అపత్సమయంలో దేవదాసు దగ్గరికి పోవటం ఉచితమని ఆమె తలచింది. కాని, ఆమెకు ప్రియమైన దేవదా ఇక్కడ ఇలా అయిపోతున్నాడు ! ఆమెకు ఎన్నో సంగతులు జ్ఞాపకం రా నారంభించినవి. దేవదాసుకంటే తన్నే ఆమె ఎక్కువ తిట్టుకున్నది. తానుంటే దేవదాసు ఇలా అయిపోయే వాడా? అని ఆమె లక్షసార్లు అనుకున్నది. పూర్వం ఆమె తన చేత్తో తాను ఉరితాడు మెడకు తగిలించుకున్నది. ఇప్పు డది బిగుసుకున్నది. దేవదాసు ఇక్కడ ఇలా పాడై పోతూ ఉంటే ఆమె పరుల కుటుంబం చక్క బెట్టటంలో నిమగ్నురాలై ఉంది! ఇక్కడ ఆమె సర్వస్వం తిండిలేకుండా

మాడిపోతూ ఉంటే— అక్కడ పరులు తన వారనుకుని అన్నదానం చేస్తూ ఉంది! ఇవ్వాళ ఆమె దేవదాసు కాళ్ళదగ్గర తల పగలగొట్టుకు చావాలని ప్రతిజ్ఞ చేసుకున్నది.

పొద్దు ఏటవాలింది. పార్వతి దేవదాసు గదిలో ప్రవేశించింది. దేవదాసు పక్కమీద కూర్చుని లెఖ్ఖలు చూసుకుంటున్నాడు. పార్వతి మెల్లగా తలుపువేసి నేలమీద కూర్చున్నది. దేవదాసు తలెత్తిచూసి నవ్వాడు. అతని ముఖం విచారంగా ఉన్నప్పటికీ శాంతంగా ఉన్నది. అతను హాఠాత్తుగా— 'అపవాదు వేస్తే?' అన్నాడు కౌతుకంగా.

పార్వతి మాట్లాడలేదు. సిగ్గుపడింది. నల్ల కలువలవంటి నేత్రాలలో ఒక మాటు అతని వంక చూసి తల వంచుకున్నది. ఆ చూపులతోనే 'ఈ మాట నా హృదయంలో శూలంవలె ఎప్పటికీ గుచ్చుకున్నది. ఇంకా నన్నెందుకు హేళన చేస్తావు?' అని తెలిపింది. పార్వతి ఏమేమో చెప్పాలని వచ్చింది. కాని అంతా మరచిపోయింది. దేవదాసు దగ్గర ఆమె మాట్లాడలేదు. దేవదాసు మరల నవ్వుతూ—'నేను గ్రహించాను లేవే, గ్రహించాను! సిగ్గు పడుతున్నావు కదూ!' అన్నాడు.

పార్వతి అప్పటికీ మాట్లాడ లేక పోయింది. దేవదాసు మరల చెప్ప నారంభించాడు.

'దానికింకా సిగ్గుపడటం ఎందుకూ? ఇద్దరం కలిసి ఏదో కుర్రతనం చేష్టలు చేశాము—కాని మధ్యలో రసాభాస అయింది. కోపంవచ్చి నీ నోటికి వచ్చింది నీ వన్నావు. నేనూ ముఖాన గుర్తుపెట్టాను. ఏం బాగాలేదూ?'

దేవదాసు మాటలలో శ్లేష కానీ, వ్యంగం కానీ ఏ మాత్రమూ లేదు. ప్రసన్నుడై నవ్వుతూ నవ్వుతూ గడిచిపోయిన దుఃఖగాథ వినిపించాడు. కాని పార్వతి హృదయం పగిలిపోతూ ఉన్నది. ఆమె నోట గుడ్డ పెట్టుకుని, శ్వాస బిగబట్టి మనస్సులో—'ఈ మచ్చే నాకు ఓదార్పు దేవదా—నా మూలధనం! నీవు నన్ను చాల ప్రేమతో చూసేవాడివి, అందుకనే మన బాల్యచరిత్రను నా నొసట రాశావు. ఇది సిగ్గుచేటు కాదు. నాకు గౌరవ చిహ్నం!' అని అనుకున్నది.

'పారూ !'

పార్వతి నోటిమీదనుంచి గుడ్డ తియ్యకుండానే—'ఏమిటి?' అని అడిగింది.

'నీమీద నాకు చాలా కోపం వస్తున్నది!' ఈమాటు దేవదాసు కంఠస్వరం కొంచెం మార నారంభించింది—'నాన్న గతించాడు. ఇప్పుడు నా కెంత కష్ట దినాలో చూడు; నువ్వంటే నాకేమీ దిగులుండేది కాదు కదా! వదెన్ను నువ్వెరుగుదువు. ఇక అన్నయ్య స్వభావం నీకు తెలియందికాదు. అమ్మను ఏంచెయ్యమంటావో నీవే చెప్పు? ఇక నా సంగతా అగమ్యగోచరంగా ఉన్నది. నువ్వు ఉన్నట్లయితే నిశ్చితంగా అంతా నీ చేతికి అప్పగించి.., అదేమిటి పారూ ?'

పార్వతి వెక్కి వెక్కి ఏడవసాగింది. 'ఏడుస్తున్నావా? అయితే ఈ ప్రసంగం ఇంతటితో కట్టిపెట్టాను.' అన్నాడు దేవదాసు.

పార్వతి కళ్ళు తుడుచుకుంటూ—'కాదు, చెప్పు.' అన్నది.

దేవదాసు ఒక్క క్షణంలో గొంతు మార్చుకుని—'పారూ, నువ్వు పక్కా ఇల్లాలి వయ్యావే !' అన్నాడు.

పార్వతి పెదవి కొరుక్కుని మనస్సులో—'ఇల్లాలు కాదు. మన్ను ! గన్నేరుపూలు దేవుడి పూజకు పనికి వస్తాయా?' అని అనుకున్నది.

దేవదాసు పకపక నవ్వుతూ—'నాకు భలే నవ్వు వస్తుంది, పారూ ! కాస్త దానివి, ఇప్పుడెంత పెద్దదాని వయావు ? పెద్ద మేడా, పెద్ద జమీందారీ, పెద్ద పెద్ద పిల్లలూ-ఇంకా చౌదరిగారూ-అందరూ పెద్దవారే కాదు పారూ?' అని అడిగాడు.

పార్వతి మనస్సును రంజింపజేసే వాటిలో చౌదరిగారు కూడా ఒకరు. వారు తలపుకు రాగానే ఆమెకు నవ్వు వచ్చేది. అందుకనే ఇటువంటి దుఃఖంలో కూడా నవ్వు వచ్చింది.

దేవదాసు కృత్రిమ గాంభీర్యంతో—'ఒక సహాయం చేసి పెట్ట గలవా?' అని పార్వతిని అడిగాడు.

పార్వతి ముఖం ఎత్తి—'ఏమిటి?' అని అడిగింది.

'మీ దేశంలో మంచి పిల్లలు దొరుకుతారా ?'

పార్వతి నోట ఊట మింగి ఒకమాటు దగ్గి—'మంచి పిల్లా! ఎందుకు? ఏమి చేసుకుంటావు?' అని అడిగింది.

'దొరికితే పెళ్లి చేసుకుంటాను. ఒకమాటు సంసారిని కావాలని ఉన్నది.'

'మంచి చక్కనిది కావాలా?'

'ఆఁ. నీ మాదిరిది.'

'మెత్తనిది కూడానా?'

'మెత్తనిది లాభం లేదు. గడుసుది కావాలి! నీమాదిరిగా నాతో పోట్లాడాలి.'

పార్వతి మనస్సులో—'అలా ఎవరూ పోట్లాడలేరు, దేవదా! అలా పోట్లాడాలంటే నా మాదిరిగా ప్రేమించిన వారు కూడా కావాలి.' అని అనుకుని, పైకి—'ఇక నాసంగతే చెప్పు! నా వంటివాళ్ళు కొన్ని వేలమంది దొరుకుతారు, నువ్వు కావాలంటే' అన్నది.

దేవదాసు నవ్వుతూ—'ఏదీ పారూ! కనీసం ఒక్క పిల్లనైనా మాట్లాడి పెట్టు' అని అడిగాడు.

'నువ్వు నిజంగా పెళ్ళిచేసుకుంటావా, దేవదా?'

'చెప్పితినిగా—' అన్నాడు దేవదాసు.

కాని ఈ జీవితంలో నువ్వు మినహా నాకు ఏ స్త్రీమీదా కోరిక లేదని మాత్రం అతను విప్పి చెప్పలేదు.

'ఒక్క మాట అడగనా దేవదా!' అన్నది పార్వతి.

'ఒక్కటికాదు, లక్ష అడుగు.'

పార్వతి తన్ను తాను కొంత సంబాళించుకొని—'నువ్వు త్రాగుడు ఎందుకు నేర్చుకున్నావు?' అని అడిగింది.

'త్రాగటం కూడా నేర్చుకోవాలా?' అన్నాడు దేవదాసు నవ్వుతూ.

'అదికాదు; నువ్వు ఎందుకు అలవాటు చేసుకున్నావు?'

'ఎవరు చెప్పారు! ధర్మదాసా?'

'ఎవరైనా చెప్పనీ, నిజమా, అబద్ధమా?'

దేవదాసు దాచలేదు.—'కొంతవరకు నిజమే!' అన్నాడు.

పార్వతి కొంచెం సేపు స్తబ్ధురాలై కూర్చున్నది. తర్వాత—'ఎన్ని వేలు పెట్టి నగలు చేయించి యిచ్చావు ?' అని అడిగింది.

దేవదాసు నవ్వుతూ—'ఇంకా ఇవ్వలేదు. చేయించి అట్టేపెట్టాను; నీకు కావాలా ?' అన్నాడు.

పార్వతి చెయ్యి చాపి—'ఇవ్వు, నా ఒంటిమీద ఒక్క నగకూడా లేదు.' అన్నది.

'జమీందారుగారు ఇవ్వలేదా ?'

'ఇచ్చారు. అవన్నీ వారి పెద్ద కూతురికి ఇచ్చాను.'

'నీకు అవసరమే లేదా ?'

పార్వతి తల అడ్డంగా తిప్పి ముఖం వంచుకున్నది. ఈ మాటు నిజంగా దేవదాసు కళ్ళల్లో నీళ్లు తిరిగాయి. ఎంతో దుఃఖంలో తప్ప స్త్రీలు తమ ఒంటిమీది నగలుతీసి ఇతర్ల కివ్వరని అతను గ్రహించాడు. కన్నీటిని ఆపుకుని ఉత్తదే పారూ ! నేను ఏ స్త్రీనీ ప్రేమించలేదు. ఎవ్వరికీ నగలివ్వలేదు' అన్నాడు దేవదాసు.

పార్వతి నిట్టూర్చి—'నాకూ అదే నమ్మకం.' అని మనస్సులో అనుకున్నది. చాలాసేపు నిశ్శబ్దంగా ఉన్నారు ఇద్దరూ. తర్వాత పార్వతి— 'ఇక మద్యం తాగనని ప్రతిజ్ఞ చెయ్యి.' అని అన్నది.

'అది నావల్ల కాదు. నువ్వు నన్ను ఒక్కమాటు కూడా తలచనని ప్రతిజ్ఞ చేయగలవా ?' అన్నాడు దేవదాసు.

పార్వతి మాట్లాడలేదు.

ఈ సమయంలోనే పూజాగృహంలో సాయంకాలపు జేగంటా; శంఖధ్వనీ వినిపించింది. దేవదాసు చకితుడై కిటికీలోనుంచి బయటకు చూసి—'చీకటి పడుతూ ఉంది ! ఇక ఇంటికి పో పారూ,' అన్నాడు.

'నేను పోను, నువ్వు ప్రతిజ్ఞ చెయ్యి !'

'నేను చేయలేను.'

'ఎందుకు చేయలేవు ?'

'అందరూ అన్ని పనులూ చేయగలరా ?'

'చేయదలచుకుంటే తప్పకుండా చేయగలరు.'

'నువ్వు ఈ రాత్రికి నాతో లేచి రాగలవా ?'

హఠాత్తుగా పార్వతి గుండె ఆగినట్టయింది. ఆమెకు తెలియకుండానే 'అదెలా సంభవం !' అని ఆమె నోటినుంచి వెలువడింది.

దేవదాసు మంచం మీద కొంచెం జరిగి కూర్చుని—'తలుపు తియ్యి పారూ!' అన్నాడు. పార్వతి లేచి తలుపుకు ఆనుకుని, అడ్డుగా కూర్చుని 'ముందు ప్రతిజ్ఞ చేయి !' అన్నది.

దేవదాసు లేచి నిలబడి, ధీర భావంతో—'పారూ, బలవంతాన ప్రతిజ్ఞ చేయించటం మంచిదా ? దానివల్ల ఏమన్నా లాభమున్నదా? ఇవ్వాళ చేసిన ప్రతిజ్ఞ రేపటికి ఉండదు. ఎందుకు నన్ను మిధ్యావాదిని కూడా చేస్తావు !'

తర్వాత చాలాసేపు నిశ్శబ్దంగానే గడచిపోయింది. గడియారం 'టంగ్, టంగ్' అని తొమ్మిది కొట్టింది. దేవదాసు వ్యాకులపాటుతో—'ఓ పారూ, తలుపు తెరవవే !' అన్నాడు. పార్వతి జవాబివ్వలేదు.

'ఓ పారూ !'

'నేను యిక్కడనుంచి కదలను !' అని పార్వతి ఆవేగాన్ని ఆపుకో లేక అక్కడే ఏడ్వ నారంభించింది. ఆమె చాలాసేపటివరకు ఏడుస్తూనే ఉన్నది. గదిలో కారు చీకటి-ఏమీ కనపడటం లేదు. పార్వతి నేలమీదపడి ఏడుస్తున్నదని మాత్రం దేవదాసు వూహించి మెల్లగా—'పారూ !' అని పిలిచాడు.

'దేవదా, నాకు చాలా కష్టంగా ఉన్నది.' అని పార్వతి ఏడుస్తూనే అన్నది. దేవదాసు దగ్గరికి వచ్చాడు. అతని కంటా తడి ఉన్నది. కాని స్వరం మారలేదు—'ఆ సంగతి నాకు తెలియదటే పారూ !' అన్నాడు.

'దేవదా, నేను చచ్చిపోతున్నాను, నీకు నేనెప్పుడూ సేవచేయ లేక పోయాను—నా ఆ జన్మ వాంఛ—'

'దానికీ సమయం వస్తుంది.' అన్నాడు దేవదాసు ఆ చీకట్లో కళ్ళు తుడుచుకుంటూ.

'అయితే నాదగ్గరకురా. ఇక్కడ నిన్ను చూచేవారెవరూ లేరు.'

'నీ ఇంటికి వస్తే బాగా చూస్తావా ?'

'నాకు చిన్నప్పటినుంచీ ఉన్న కోరిక ఇదే. నా యీ కోర్కె నెరవేర్చు భగవంతుడా! తర్వాత చచ్చిపోయినా నాకు దిగులులేదు.' అన్నది పార్వతి భగవంతుని ఉద్దేశించి.

ఈమాటు దేవదాసు కళ్ళనుంచి కూడా బొట బొట నీళ్ళు కారినవి.

'మా ఇంటికి రా, దేవదా!' అని పార్వతి మళ్లీ అడిగింది.

దేవదాసు కళ్ళు తుడుచుకుని—'సరే, అలాగే వస్తాను.' అన్నాడు.

'నన్ను తాకి చెప్పు, వస్తావా?'

దేవదాసు ఆ చీకట్లో ఊహించి, పార్వతి పాదాలను అంటుకుని 'ఈ మాట ఎప్పటికీ మరచిపోను. నాకు సేవచేస్తే నీ దుఃఖం తగ్గిపోయే ట్టయితే నేను తప్పక వస్తాను. చనిపోయేముందు కూడా నాకీమాట తప్పక జ్ఞాపకం ఉంటుంది.' అని అన్నాడు.

* * *

తండ్రి చనిపోయిన తర్వాత దేవదాసు ఆరుమాసాలదాకా ఇల్లు కదలలేదు. అతనికి ఏకాంత జీవనం అంటే విసుగెత్తిపోయింది. సుఖం లేదు శాంతి లేదు. పైన ఎప్పుడూ పార్వతి చింత. ఏపని చేద్దామన్నా పార్వతే జ్ఞాపకం వస్తూ ఉంటుంది. ఇక అన్న ద్విజదాసూ, భర్తగారి అడుగు జాడల్లో నడిచే వదినా, దేవదాసును ఇంకా విసిగించారు. అతని తల్లి స్థితి కూడా ఇలానే ఉన్నది. భర్తచావులో ఆమె సుఖాలన్నీ తుడుచుకు పోయినవి. పరాధీనంగా ఈ ఇంట్లో ఉండటం ఆమెకు క్రమంగా అసహ్యం వేసిపోయింది. కొన్నాళ్ళ నుంచీ ఆమె కాశీ వెళ్ళాలని అనుకొంటోంది. దేవదాసుకు పెళ్లి చేయకుండా ఎలా వెళ్ళడమా అనే ఆగింది. 'పెళ్ళిచేసుకో దేవా! నేను చూసిపోతా'నని ఆమె చాలా సార్లు చెప్పింది కూడా. కాని దానికి ఒక ఇబ్బంది ఉన్నది. ఇంకా ఏటినూతకం వెళ్లలేదు. పైగా అతనికి నచ్చినపిల్ల దొరకాలి. పార్వతిని ఎందుకు చేయక పోతినా? అని ఇప్పుడిప్పు డామె విచారిస్తూ ఉన్నది. ఒకనాడు దేవదాసును పిలిచి—'ఇక, ఇక్కడుండ లేను దేవా! కొన్నాళ్ళ పాటు కాశీ వెళ్తాను.' అని చెప్పింది.

దేవదాసు ఉద్దేశం కూడా ఇదే—'నేనుగూడా అదే చెప్పుదా మనుకుంటు

స్తాను. ఈ ఆరుమాసా లుండి వస్తే సరిపోతుంది.' అన్నాడు దేవదాసు.

'ఆఁ-అలాగేచేయి నాయనా! సంవత్సరీకం అయ్యాక నీ పెళ్ళిచేసి, నీ సంసారం చూచి మళ్ళీ నిశ్చింతగా నేను కాశీ వెళ్తాను.'

దేవదాసు తల్లిని కాశీలో వదిలిపెట్టి తను కలకత్తా వచ్చాడు. కలకత్తా వచ్చి నాలుగైదు రోజులు చున్నీలాలుకోసం తిరిగాడు. అతను కనపడలేదు. బసమార్చివేశాడట. ఒకనాటి సాయంత్రం దేవదాసుకు చంద్రముఖి జ్ఞాపకం వచ్చింది. ఒకమాటు చూడగూడదా? అనుకున్నాడు. ఇన్నాళ్లనుంచీ అమె జ్ఞాపకమే రాలేదు. దేవదాసు కొంచెం సిగ్గుపడ్డాడు కూడా. బాడుగబండి మాట్లాడుకుని చంద్రముఖి ఇంటి ముందుకు వచ్చి ఆగాడు. చాలాసేపు కేకలు వేసిన మీదట—'ఇక్కడ లేదు.' అని ఎవరో ఆడమనిషి జవాబిచ్చింది.

ఇంటి కెదురుగా లాంతరు స్తంభం ఉన్నది. దేవదాసు దాని దగ్గరకు వచ్చి 'ఎక్కడికి వెళ్ళిందో చెప్పగలవా?' అని మళ్ళీ అడిగాడు.

ఇంట్లో ఉన్న మనిషి కిటికి తలుపు తెరచి, కొంచెంసేపు అతనివంక నిదానించిచూసి 'నువ్వు దేవదాసువా?' అని అడిగింది.

'ఆఁ.'

'ఆగు—తలుపు తెరుస్తాను.' అనివచ్చి తలుపుతీసి 'రండి' అని పిలిచింది. దేవదాసుకు గొంతు ఎరిగిన దానిలాగానే కనిపించింది. కాని గుర్తించలేక పోయాడు; పైగా చీకటి కూడా పడింది—'చంద్రముఖి ఎక్కడ ఉందో చెప్పగలవా?' అని అడిగాడు.

స్త్రీ మందహాసం చేస్తూ—'పైకి రండి చూపిస్తాను.' అన్నది.

దేవదాసు ఈమాటు గుర్తించి—'నీవా?' అన్నాడు.

'ఆఁ, నేనే నన్ను బొత్తిగా మరిచి పోయారా?'

దేవదాసు పైకి వచ్చాడు. చంద్రముఖి నల్లకమ్ముల సాదాచీర కట్టుకుని ఉన్నది. చీరె మాసింది. చేతిని గాజులు మాత్రం ఉన్నవి; ఇక ఒంటి మీద ఒక్క నగకూడా లేదు. కొన్నాళ్ళ నుంచి తల దువ్వుతున్న లక్షణాలేవీ ఆమెలో కనిపించలేదు. దేవదాసు విస్మయంతో—'నువ్వేనా!' అని తర్వాత పరీక్షగా చూశాడు. చంద్రముఖి వెనకటికంటే చాలా కృశించి పోయింది.

'నీ కేమైనా జబ్బు చేసిందా?' అని దేవదాసు అడిగాడు.

చంద్రముఖి నవ్వుతూ—'శారీరకంగా ఏమీ లేదు. మీరు కాస్త తీరికగా కూర్చోండి' అన్నది.

దేవదాసు మంచంమీద కూర్చున్నాడు. గది అంతా మారిపోయింది. యజమానురాలికి మల్లే దాని ముఖాన కూడా దౌర్భాగ్య చిహ్నాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. చైర్లూ, టేబిల్సూ, అలమారు—వగైరాలు పెట్టేచోటు ఖాళీగా ఉన్నది. ఒక్క సామాను కూడా లేదు. మంచంమాత్రం ఉన్నది. దానిమీద పరచిన గుడ్డ కూడా, మాసింది. గోడల మీద ఒక్క చిత్రం కూడా లేదు; ఇంకా మేకులు మాత్రం ఉన్నాయి. వాటికి కట్టిన ఎర్రత్రాళ్ళు కూడా వ్రేలాడుతూనే ఉన్నాయి. గడియారం గోడనే ఉన్నది; కాని ఆడటం లేదు. దానిచుట్టూ సాలీళ్లు జాలరు అల్లినవి. గదిలో ఒక మూలను ఆముదం దీపం వెలుగుతూ ఉన్నది. దాని సహాయంతోటే దేవదాసు ఈ కొత్త అలంకరణ చూశాడు. అతనికి విస్మయంతోపాటు కొంచెం కోపంకూడా వచ్చింది.

'ఇలాంటి దుస్థితి ఎలా సంభవించింది, చంద్రా?' అని అడిగాడు.

చంద్రముఖి మ్లానంగా నవ్వి — 'ఇది దుస్థితి అని ఎవరు చెప్పారు? నాభాగ్యం పండింది.' అన్నది.

దేవదాసుకు ఏమీ అర్థం కాలేదు.—'నీ ఒంటిమీద నగలన్నీ ఏమయినై?' అని అడిగాడు.

'అమ్మేశాను.'

'సామాను?'

'అదికూడా అమ్మాను?'

'పటాలుకూడా అమ్మావా?'

చంద్రముఖి నవ్వుతూ, ఎదురుగా ఉన్న ఇల్లు చూపించి—'ఆ ఇంట్లో ఉండే క్షేత్రమణి కిచ్చాను.' అన్నది.

దేవదాసు కొంచెంసేపు ఆమె ముఖంవంక చూసి—'చున్నీబాబు ఎక్కడ?' అన్నాడు.

'నాకు తెలియదు. రెండు మాసాల క్రిందట పోట్లాడి వెళ్లిపోయాడు.'

దేవదాసుకు ఇంకా ఆశ్చర్యం కలిగింది- 'పోట్లాడటం ఎందుకు?' అన్నాడు.

'ఇక పోట్లాటలే రావా?'

'వస్తవి. కాని ఎందుకు వచ్చిందా అని?'

'బేరం కుదర్చటానికి వస్తే వెళ్లగొట్టాను.'

'ఏమి బేరం?'

'పశువుల బేరం!' అని చంద్రముఖి నవ్వి—'మీకు అర్థం కాలేదా? ఒక సాహుకారును పట్టుకొచ్చాడు. నెలకు రెండువందల రూపాయలు; ఒంటి నిండా నగలు; కొసరు, వాకిట్లో బాట్రోతు; తెలిసిందా?' అన్నది.

దేవదాసు అర్థంచేసుకొని—'ఏవీ, ఆ లక్షణాలేవీ కనపడవే?' అన్నాడు నవ్వుతూ.

'ఉంటే మీకు కనపడేవే. నేను వాళ్ళను వెళ్ళగొట్టాను.'

'వాళ్ళ అపరాధం?'

'అంత గొప్పదికాదు. నాకే ఇష్టం లేకపోయింది.'

దేవదాసు కాసేపు ఆలోచించి— 'అప్పటినుంచీ ఇంకెవ్వరూ రాలేదా?' అని అడిగాడు.

'అప్పటినుంచేం? మీరు వెళ్ళిన మర్నాటినుంచీ ఎవ్వరూ రాలేదు. చున్నీ మాత్రం ఎప్పుడన్నా వచ్చి కూర్చునేవాడు. రెండు మాసాలనుంచి అతను కూడా రావటం లేదు.'

దేవదాసు మంచంమీద పండుకున్నాడు; కాసేపు అన్యమనస్కంగాఉండి —అయితే వ్యాపారమంతా ఎత్తేసినట్టేనా, చంద్రముఖీ?' అని అడిగాడు.

'ఆc—దివాళా తీసింది!'

'మరి నీ పొట్ట గడవటం ఎలా?'

'ఇంతకు ముందే చెప్పానుగా, నగల లమ్మానని.'

'ఎన్ని రూపాయలొచ్చినై?'

'ఎక్కువలేదు. ఏడెనిమిది వందలున్నాయి. అవి ఒక మహాజను దగ్గర అట్టి పెట్టాను. నెలకు ఇరవైరూపాయల చొప్పున ఇచ్చే ఏర్పాటు.'

'ఇరవైరూపాయలతో వెనక నీవు గడిచేది కాదుగా ?'

'ఊహుఁ. ఇప్పుడూ గడవటం లేదు. మూడు నెలల అద్దెకూడా బాకీ ఉన్నది. అందుకనే, చేతులగాజులమ్మి ఎటన్నా వెళ్లుదా మనుకుంటున్నాను.'

'ఎక్కడికి వెళ్తావు ?'

'ఇంకా స్థిరపరచుకోలేదు. ఏదన్నా పల్లెటూరు—ఇరవైరూపాయలతో గడిచేచోటికి ఎక్కడికైనా.'

'మరెందుకు వెళ్ళలేదు? నీ కేదో ప్రయోజనం లేకపోతే ఇన్నాళ్ళనుంచీ వృథాగా అప్పెందుకు పెంచావు?'

చంద్రముఖి తలవంచుకొని ఆలోచనలోపడింది. ఆమె తన జీవితంలో మాట్లాడటానికి సిగ్గుపడటం ఇదే మొదటిసారి.

'మాట్లాడవేం ?' అన్నాడు దేవదాసు.

చంద్రముఖి మంచంమీద ఒక ప్రక్కన ఒత్తుకు కూర్చుని మెల్లగా చెప్ప నారంభించింది :—'కోప్పడకండి, వెళ్లేముందు మిమ్మల్ని ఒక మాటు చూసి పోదామని ఆగాను. మీరు తప్పక వస్తారనే నమ్మకం నా కున్నది. ఇవ్వాళ వచ్చారు. ఇక నేను రేపే వెళ్ళిపోవటానికి ప్రయత్నిస్తాను. ఎక్కడికి వెళ్తానో చెప్పమంటారా ?'

దేవదాసు విస్మితుడై లేచి కూర్చున్నాడు :—'ఊరక చూడాలనేనా ! ఎందుకు ?'

'అదొక ఖర్మ్యాళి. నేనంటే మీరు అసహ్యించుకుంటారు. ఇంతగా నన్నెవ్వరూ ఎప్పుడూ అసహ్యించుకోలేదు—బహుశా అందుకే ననుకుంటాను. ఆనాటి సంగతి మీ కిప్పుడు జ్ఞాపకమున్నదో లేదో తెలియదు, కాని నాకు బాగా జ్ఞాపకం ఉంది, మీరు మొట్ట మొదట వచ్చిన రోజునే నన్ను ఆక ర్షించారు. మీరు ధనికుల బిడ్డలని కూడా నాకు తెలుసును. కాని మీధనం నన్నాకర్షించ లేదు. మీకు పూర్వం ఇక్కడకు 'ఎంతోమంది' వచ్చారు, పోయారు. కాని వారి ఒక్కరిలోగూడ నాకు తేజస్సు కనిపించలేదు. మీరు రాగానే నన్ను గాయపరచారు. నేను అనుకోని విధంగా, నాతో అతి మోటుగా వ్యవహరించి, అసహ్యించుకుని ముఖం తిప్పుకున్నారు. చివరకు

తమాషాగా డబ్బు పారవేశారు—ఇవన్నీ మీకు జ్ఞాపకం ఉన్నాయా ?'

దేవదాసు మాట్లాడలేదు. చంద్రముఖి మరల చెప్ప నారంభించింది :

'అప్పటినుంచీ నేను మీమీద ఒక కన్నుంచాను ; ప్రేమించీ కాదు, ద్వేషించీ కాదు ; ఒక చిత్రమైన వస్తువును చూస్తే మనకు ఎలా జ్ఞాపకం ఉంటుందో, అలానే నేను మిమ్మల్ని మరచిపోలేక పోయాను. మీరు వస్తే నేను చాలా భయంతోనూ, జాగ్రత్తగానూ మెలగేదాన్ని. కాని రాకపోతే మాత్రం ఏమీ తోచేది కాదు. తర్వాత నాకేమి మతిభ్రమ వచ్చిందో తెలియదు —ఈ కళ్ళతో ప్రతి విషయాన్నీ ప్రతి వస్తువునూ ఇంకో దృష్టితో చూడ నారంభించాను. నాలో ఉన్న పూర్వపు 'నేను' పోయి కొత్త 'నేను' వచ్చింది. ఆ తర్వాత మీరు త్రాగుడు అలవాటయ్యారు. మద్యమంటే నాకు తగనిరోత ; త్రాగుబోతును చూస్తే నాకు మండిపోయేది. అదేమి ఖర్మమో మిమ్మల్ని చూస్తే నాకు కోపం వచ్చేది కాదు. తాపం వచ్చేది' అని చంద్రముఖి దేవదాసు కాళ్లమీద చేతులుపెట్టి బొట బొట కన్నీళ్ళు కారుస్తూ—'నేను చాలా అధమురాలిని, నా తప్పులు లెఖ్ఖచేయకండి. నేనంటే మీరు దూరంగా ఉండేవారు—తిట్టేవారు, చీదరించుకునేవారు. కాని మీరు ఎంత చీదరించుకుంటే అంత దగ్గరకు రావాలనుకునేదాన్ని. ఆఖరికి నిద్రపోయాక—పోనీయండి. ఆసంగతి చెప్పితే మీకు కోపం వస్తుంది.' అన్నది.

దేవదాసు ఏమీమాట్లాడలేదు. ఈ కొత్తరకం మాటలు అతనికి వేదన కలిగిస్తున్నాయి. చంద్రముఖి చాటుగా కళ్లు తుడుచుకుని మరల చెప్పసాగింది:

'ఒక రోజున మీరన్నారు జ్ఞాపకమున్నదా—'మీరు ఎంత అవమానమూ, అత్యాచారమూ, ఉపద్రవమూ, తిరస్కారమూ సహిస్తా' రని ! అప్పటినుంచీ నాకు అభిమానం పుట్టుకొచ్చింది. ఈ వృత్తి అంటే అసహ్యం వేసింది.'

దేవదాసు లేచి కూర్చుని—'మరి నీపొట్ట గడిచే దెలా ?' అని అడిగాడు.

'ఆ సంగతి ఇందాకనే చెప్పాను.'

'ఒక వేళ వాడు డబ్బు ఎగవేస్తే—'

చంద్రముఖి భయపడలేదు. చాలా శాంతంగానూ సహజంగానూ అంది :

'అలా జరిగినా ఆశ్చర్యం లేదు. ఆలాంటి అవాంతరం వస్తే మిమ్మల్ని యాచిద్దా మనుకున్నాను.'

దేవదాసు కొంచెం ఆలోచించి — 'అలాగే తీసుకో. ఇక నువ్వెక్కడికన్నా వెళ్ళే ప్రయత్నాలు చెయ్యి.' అన్నాడు.

'రేపే వెళ్తాను. గాజులు అమ్మి, ఒకమాటు మరాబును కలుసుకోవాలి.'

దేవదాసు జేబులోనుంచి వందరూపాయల కాగితం తీసి దిండు క్రింద పెట్టి 'గాజులు అమ్మకోకు, మరాబును మాత్రం కలుసుకో. అయితే ఎక్కడికి వెళ్తావు? ఏదన్నా తీర్థానికా?' అన్నాడు.

'ఊహుం! తీర్థాలమీద నాకు నమ్మకం లేదు! కలకత్తాకు ఎక్కువ దూరం కూడా పోను; దగ్గరలో ఏదన్నా పల్లెటూరులో ఉంటాను.'

'ఎవరింట్లో నన్నా దాసీపని చేస్తావా?'

చంద్రముఖి కళ్ళల్లో నీరు తిరిగింది. కళ్ళు తుడుచుకుని— 'నాకిష్టం లేదు. స్వతంత్రంగా ఉంటాను. అస లెందుకు శ్రమపడాలి? శరీరకష్టం నేనెప్పుడూ చేయలేదు—ఇప్పుడూ చేయలేను. ఎక్కువ పీకులాడితే ఈ పుల్లలు కాస్త రాలి పోతవి.' అన్నది.

దేవదాసు విషణ్ణముఖంతో మందహాసం చేశాడు.

'పట్నానికి దగ్గరగా ఉంటే ప్రలోభాలు ఎక్కువవుతవిగా? మనస్సును నమ్మకూడదు!' అన్నాడు.

ఈ మాటకు చంద్రముఖి ముఖం వికసించింది. నవ్వుతూ—'ఆమాట నిజమే. మానవుని మనస్సు విశ్వసించకూడదు. కాని నేనలాంటి ఎరలకు చిక్కను. స్త్రీలకు ప్రలోభాలు ఎక్కువని నేనూ ఒప్పుకుంటాను. కాని అవన్నీ నేను స్వేచ్ఛగా వదులుకున్నప్పుడు నాకింకా భయమేముంది? హఠాత్తుగా ఏదన్నా ఉద్రేకంలో వదులుకున్నట్టయితే, నేను జాగ్రత్తపడాల్సి ఉండేది. ఇన్నాళ్ళనుంచీ నేను ఒక్కనాడు కూడా పశ్చాత్తాప పడలేదు! సుఖంగా ఉన్నాను.'

దేవదాసు నమ్మనట్టుగా తల తిప్పుతూ—'స్త్రీల మనస్సు చాలా చంచలం —నమ్మదగింది కాదు' అన్నాడు.

ఈ మాటు చంద్రముఖి బాగా దగ్గరికి వచ్చి కూర్చుని, అతని చేతులు

రెండూ పట్టుకుని—'దేవదాస్ !' అన్నది.

దేవదాసు ఆమె ముఖంవంక చూశాడు. కాని ఈ మాటు — 'నన్ను ముట్టుకోవద్దని అనలేక పోయాడు.

చంద్రముఖి స్నేహ విస్ఫారిత నేత్రాలతో అతనివంక చూస్తూ, చేతులు రెండూ దగ్గరికి లాక్కుని, కంపితస్వరంతో అన్నది:

'ఇది ఆఖరిరోజు, ఇవ్వాళ నన్ను కోప్పడకండి! ఒక్కమాట మిమ్మల్ని అడగాలని నాకు చాలా కుతూహలంగా ఉన్నది'—అని ఒక్క క్షణం రెప్ప వాల్చకుండా దేవదాసు ముఖంవంక చూసి—'పార్వతి మిమ్మల్ని మోసం చేసిందా!' అన్నది.

'నీ కెందు కా సంగతి?' అని దేవదాసు కనుబొమ్మలు చిట్లించాడు.

చంద్రముఖి తొణకలేదు, శాంత దృఢ స్వరంతో అన్నది:

'నా కవసరం ఉన్నది. నేను నిజం చెప్తున్నాను—మీరు కష్టపడుతూ ఉంటే నాకు ఎలానో ఉంటుంది. ఇంతేగాక, మీ సంగతులు నాకు చాలా తెలుసు ననుకుంటాను. కైపులో ఉండగా మీరు అనేక సంగతులు వెల్లడించే వారు. కాని వాటినిబట్టి చూస్తే పార్వతి మిమ్మల్ని మోసగించినట్టు నా కేమీ నమ్మకం కలగలేదు. పైగా మిమ్మల్ని మీ రే మోసపుచ్చుకున్నట్లు తోచేది. నేను మీకంటె పెద్దదాన్ని. బోలెడు ప్రపంచం చూసిన దాన్ని. అప్పుడు నే నే మనుకునేదాన్నో ఎరుగుదురా? మీదే పొరపాటని అనుకునేదాన్ని. స్త్రీలు చంచల చిత్తలనీ, స్థిరత్వంలేనివారనీ ప్రఖ్యాతి. నిజానికి, వారంత అపకీర్తి తగిన వారు కారని నా ఉద్దేశం. కీర్తి తెచ్చినా అపకీర్తి తెచ్చినా మీరే. మీరు అనదలచిం దేమిటో అనాయాసంగా అనేస్తారు. వారలా అనలేరు. తమ మనస్సులోని మాట వెల్లడించలేరు. అథవా వెల్లడించినా ఎవ్వరూ గ్రహించలేరు. ఎందుకంటే, అది చాలా అస్పష్టంగా ఉంటుంది—మీ నోళ్ళ ముందు అణగిపోతుంది. ఇక అపకీర్తి మాత్రమే లోకు లందరికీ వినిపిస్తుంది.'

చంద్రముఖి కొంచెం ఆగి గొంతు సవరించుకుని చెప్ప నారంభించింది:

'ఈ జీవితంలో నేను ప్రేమ వ్యాపారం చాలాకాలం చేశాను. కాని ఒక్కమాటు మాత్రమే ప్రేమించాను. ఆ ప్రేమకు చాలా విలువకూడా

కున్నది! ఎరుగుదురా? ప్రేమ వేరు; రూపమోహం వేరు. వీటిల్లో చాలా తికమక ఉంది. ముఖ్యంగా పురుషులే చాలా తికమకపడుతూ ఉంటారు. రూప—మోహం మీకంటే మాకు చాలా తక్కువ; మనిషిని చూడగానే మేము ఉన్మత్తులం కాము. మాదగ్గరికి వచ్చి మీరే ప్రేమను ఎన్నో రకాల హావ భావాలతో వ్యక్తంచేస్తారు. మేమేమీ మాట్లాడము. మీ మనస్సును కష్ట పెట్టటానికి మాకు సిగ్గూ, సంకోచమూ, దుఃఖమూ అడ్డువస్తూ ఉంటయి. మీ ముఖం మాకు అసహ్యం వేస్తున్నా, మిమ్మల్ని మేము ప్రేమించటం లేదని చెప్పలేము; కారణం సిగ్గు అడ్డు పడుతూ ఉంటుంది. ఇక ప్రణయాభినయం ఆరంభమౌతుంది. తర్వాత కొన్నాళ్ళకైనా అసలు సంగతి బయట పడక మానదు. అప్పుడు మీరు కోపంతో అసిరులై—'విశ్వాస ఘాతకి!' అంటారు. అందరూ అదే వింటారు. నమ్ముతారు కూడా. మేము అప్పటికీ మౌనంగానే ఉంటాము. మా మనస్సు ఎంతో కష్టపడుతుంది. కాని అ దెవరు చూస్తారు?'

దేవదాసు మాట్లాడలేదు. చంద్రముఖి కాసేపు మాట్లాడకుండా అతని ముఖం వంక చూస్తూ ఉన్నది; తర్వాత మరల చెప్ప నారంభించింది:

'ఆ సమయాన మా మనస్సులో కొంచెం మమత కలిగినా కలగవచ్చు, స్త్రీలు దాన్నే ప్రేమ అనుకుంటారు; వారు శాంతంగానూ స్థిరంగానూ ఇంటి పనులు చేసుకుంటూ మీ కష్టాలకు ఆదుకొంటూ ఉంటే—ఓ, మీరు వాళ్లని ఎంత పొగుడుతారు! ఎంత ఆదర్శంగా చెప్పుకుంటారు! కాని ఆ సమయంలో వాళ్ళకు బహుశా ప్రేమంటే ఏమిటో. కూడా తెలియదు. తర్వాత వారి హృద యం తీరని వేదనతో తపించి, ఏదన్నా అశుభ ముహూర్తాన ఇల్లు వదలిపెట్టితే అప్పుడు—' అని ఆమె దేవదాసు ముఖం వంక తీవ్రంగా చూసి—'అప్పుడు మీరు 'కళంకిని' అని ఛీత్కారం చేస్తారు! ఛీ, — '

దేవదాసు చప్పున చంద్రముఖి నోరు మూసి—'అదేమిటి చంద్రముఖీ?' అన్నాడు.

చంద్రముఖి నెమ్మదిగా చేయి తీసివేసి—'భయపడకు దేవదాస్! నేను మీ పార్వతి సంగతి చెప్పటం లేదు' అని ఊరుకున్నది.

దేవదాసు కాసేపు మాట్లాడకుండా ఊరుకుని, అన్యమనస్కునిమాదిరిగా

'కాని కర్తవ్యం అనేది ఒక టున్నదిగా! ధర్మాధర్మాలు ఉన్నైగా' అన్నాడు.

'ఎందుకు లేవు! అందుకనే, దేవదాస్! నిజంగా ప్రేమించిన వారు అన్నీ సహించి ఉంటారు. అంతరంగంలో ప్రేమించినంత మాత్రంచేతనే ఎంత సుఖం ఎంత తృప్తికలుగుతుందో గ్రహించినవాళ్లు అనవసరంగా కుటుంబాల్లో కలవరం తీసుకురారు. ఆఁ. నేను ఏమి చెప్పుతున్నానూ?—పార్వతి మిమ్మల్ని ఎంత మాత్రం మోసపుచ్చలేదు. మిమ్మల్ని మీరే వచించు కున్నారని నాకు గట్టి నమ్మకం. కాని, ఈ సంగతి ఇప్పుడు మీరు గ్రహించలేరు. దాని సమయం వచ్చినప్పుడు మాత్రం నేను నిజం చెప్పానని మీరు తప్పక అనుకుంటారు.'

దేవదాసు కళ్లు నీటితో నిండిపోయినవి. ఇవ్వాళే అతనికి చంద్రముఖి మాటలే సత్యంగా తోచ నారంభించినవి. చంద్రముఖి కన్నీరు చూసింది. కాని తుడవ ప్రయత్నించలేదు. మనస్సులో అనుకోసాగింది :

'నేను అనేకసార్లు అనేక విధాలుగా మిమ్మల్ని చూశాను. మీ మనస్సు నేను ఎరుగుదును. సామాన్య పురుషులవలె మీరు మీ ప్రేమను వెల్లడించరని కూడా నాకు తెలుసును; ఇక రూపం సంగతి! రూపాన్ని ఎవరు ప్రేమించరు? కాని, కేవలం రూపంకోసం మీరు మీ తేజాన్ని బలి ఇస్తారని నాకు నమ్మకం కలగటం లేదు. పార్వతి అందకత్తె కావచ్చును. కాని, మిమ్మల్ని ప్రేమించానని ఆమె ముందుగా మీకు తెలిపిందని నాకు తోస్తున్నది.'

ఇలా అనుకొంటూ ఉండగా హఠాత్తుగా ఆమె నోటి నుంచి—'నన్ను బట్టి గ్రహించుకున్నాను, ఆమె మిమ్మల్ని ఎంతగా ప్రేమించిందో!' అని అస్పష్టంగా వెలుపడింది.

దేవదాసు చప్పున లేచి కూర్చుని—'ఏమన్నావు?' అని అడిగాడు.

'ఏమీలేదు. ఆమె మీ అందంచూచి భ్రమపడ లేదంటున్నాను. మీకు అందం ఉన్నదికాని, దాన్నిచూసి ఎవరూ మోసపోరు. ఇక మీ తీవ్ర కటు రూపం అందకీ కనపడదు ; కాని చూచినవారు మాత్రం దాని నుంచి దృష్టి మళ్ళించుకో లేరు' అని చంద్రముఖి నిట్టూర్చి — 'మీలో ఎంత ఆకర్షణ ఉన్నదో మిమ్మల్ని ప్రేమించిన వారికే తెలుస్తుంది. ఈ స్వర్గాన్ని తనకై తాను వదలుకునే స్త్రీ ప్రపంచంలో ఉన్నదా?' అన్నది.

తర్వాత కొంత సేపు మౌనంగా అతని ముఖంవంక చూసి మరల చెప్పసాగింది:

'ఈ రూపం కళ్లకు కనపడదు! కాని, దీని ఛాయ మాత్రం హృదయం మీద పడుతుంది—'

దేవదాసు విప్పాల దృక్కులతో చంద్రముఖి వంక చూసి—'ఇవ్వాళ ఏమిటి నువ్విలా వాగుతున్నావు?' అని అడిగాడు.

చంద్రముఖి మందహాసం చేస్తూ—'దేవదాస్! తనని ప్రేమించని వాళ్లకు బలవంతంగా తన ప్రేమను వెల్లడించ బోవటం కంటే తెలివితక్కువ పని ఈ ప్రపంచంలో మరొకటి ఉండదు! నేను నాకోసం మాట్లాడటం లేదు; పార్వతి తరఫున వకాల్తా తీసుకున్నాను' అన్నది.

దేవదాసు లేవటానికి ఉపక్రమించి—'ఇక వెళ్తాను' అన్నాడు.

'ఇంకా సేపు కూర్చోండి. మిమ్మల్ని ఎప్పుడూ తెలివిలో ఉండగా నేను చూడలేదు—ఇలా ఎప్పుడూ చేతులు పట్టుకుని మాట్లాడలేదు. ఎంత తృప్తి!' అని కిలకిల నవ్వింది.

'నవ్వుతా వెందుకూ?' అన్నాడు దేవదాసు ఆశ్చర్యంతో.

'ఊరకనే—వెనకటి సంగతులు జ్ఞాపకం వచ్చాయి. పది సంవత్సరాల క్రిందట నేనూ ఒకర్ని ప్రేమించే ఇల్లు వదిలి వచ్చాను. ఎంత ప్రేమించా నను కున్నారు! అవసరమైతే ప్రాణాలు కూడా ఇవ్వగలను, అనుకునేదాన్ని. ఆఖరికి చిన్న నగకోసం మేమిద్దరం పోట్లాడుకున్నాము. అది తుదా ఒకరి మొహం ఒకరు చూసుకోలేదు! అతను నన్ను ప్రేమించలేదు; ప్రేమిస్తే ఈ చిన్న నగ తెచ్చి పెట్టే వాడు కాడా అని మనస్సును తృప్తి పరుచుకొన్నాను!' చంద్రముఖి లోలోన నవ్వుకున్నది. తర్వాత కొంచెం గంభీర స్వరంతో చెప్ప నారంభించింది:

'నీ నగలు నాశనం కాను! మామూలు తలనొప్పి నయం చేసినందుకే ఈ ప్రాణం 'ఉస్, ఉస్' అనకుండా ఇవ్వవచ్చు నని అప్పుడు నాకేమి తెలుసు! అప్పుడు సీతా దమయంతుల వ్యథ నాకు తెలియదు. జగ్గాయీ మాధాయీ కథ నేను నమ్మేదాన్ని కాను. సరే కాని, దేవదాస్! ఈ ప్రపంచంలో అంతా సంభవమే కాదూ?'

దేవదాసు జవాబివ్వలేక పోయాడు. నివ్వెరపోయిన వానివలే ఆమెవంక చూసి—'ఇక పోతాను.' అన్నాడు.

'భయ మేమీ లేదు, ఇం కొంచెంసేపు కూర్చోండి. నేనిక మిమ్మల్ని మభ్యపెట్ట దలచలేదు—ఆ రోజులు గతించాయి. ఇప్పుడు, మీరు నన్నెంత అసహ్యించు కుంటున్నారో, నేను కూడా నన్నంత అసహ్యించు కుంటున్నాను. సరే, ఆసంగతి పోనివ్వండి. మీరు పెళ్లెందుకు చేసుకో కూడదు?'

ఇంత సేపటికి దేవదాసుకు ఊపిరి సలిపింది. నవ్వుతూ—'చేసు కోవటం మంచిదే, కాని నాకు ఇష్టంలేదు' అన్నాడు.

'ఇష్టంలేక పోయినా చేసుకోండి. పిల్లల మొహం చూస్తే కొంతవరకు శాంతి లభిస్తుంది. పైగా నాకు కూడా దోవ దొరుకుంది. మీ ఇంట్లోనే దాసీగా ఉండి ఈ జీవిత శేషం సుఖంగా వెళ్ళబుచ్చుతాను.'

'ఇంకేం, నిన్నప్పుడు తప్పక పిలుస్తాను!' అన్నాడు దేవదాసు నవ్వుతూ.

చంద్రముఖి అతని నవ్వును చూడనట్టుగా—'మిమ్మల్ని ఇంకోమాట కూడా అడగాలని ఉన్నది.' అన్నది.

'ఏమిటి?'

'ఇవ్వాళ మీరింత సేపు నాతో ఎందుకు మాట్లాడారు?'

'ఏం. తప్పా?'

'ఆ సంగతి చెప్పలేను! కాని కొత్త. తప్పతాగి పడిపోనిది, మీ రెప్పుడూ నా ముఖం చూసేవారు కాదు.'

దేవదాసు ఆ మాటకు జవాబివ్వకుండా—'మా తండ్రిగారు చనిపోయి నప్పటినుంచీ మద్యం మానేశాను,' అన్నాడు విచారంగా.

చంద్రముఖి చాలా సేపు కరుణా దృక్కులతో అతని వంకచూసి—'ఇక తాగరా?' అని అడిగింది.

'చెప్పలేను.'

చంద్రముఖి అతనిచేతులు ఇంకా కొంచెం దగ్గరకు లాక్కుని ఆతు వ్యాకుల స్వరంతో—'వీలుంటే వదిలి పెట్టండి. బంగారం లాంటి శరీరాన్ని పాడుచేసుకోకండి' అన్నది.

దేవదాసు చప్పునలేచి నిలబడి—'నేను వెళ్లుతున్నాను. నువ్వు ఎక్కడ ఉన్నదీ నాకు కబురుచెయ్యి. నీ కెప్పుడన్నా, ఏదైనా అవసర మొస్తే నా దగ్గర సిగ్గు పడమాకు' అన్నాడు.

చంద్రముఖి నమస్కారం చేసి పాదధూళి తీసుకుని అన్నది—'నన్ను సుఖపడమని ఆశీర్వదించండి! ఇంకో యాచన—దేవుడు రాకుండా చేయాలి—ఎప్పుడన్నా దాసీ అవసరముంటే నన్ను పిలిపించండి.'

'అలాగే' నని దేవదాసు వెళ్ళిపోయాడు.

చంద్రముఖి చేతులు జోడించి రోదన స్వరంతో—'ఇంకో మాటు వారు కనపడేటట్టు చేయి భగవంతుడా!' అని దేవుని ప్రార్థించింది.

*　　*　　*

దాదాపు రెండేండ్లు గడిచినై. మహేంద్రుని వివాహం చేసి పార్వతి చాలావరకు నిశ్చింతురాలైంది! జలదబాల బుద్ధిమతి. పనిపాటల్లో నిపుణ. పార్వతికి బదులు ఇంటి పనులు ఆమే చూస్తూ ఉండేది. పార్వతి ఇప్పుడు మనస్సును ఇంకో వైపుకు మరల్చింది. వివాహమై చాలాకాల మయినా ఇంకా ఆమె సంతాన ముఖం చూడలేదు. తనకు సంతులేక పోవటంచేత ఎవరి పిల్లలన్నా ఆమె చాలా ఆపేక్షచూపించేది. పేదసాదలమాటలా ఉంచండి; కాస్త నోటికీ చేతికీ ఉన్నవారి సంతాన బాధ్యతకూడా తానే వహించేది. ఇంతేకాక దేవాలయంలో పూజలూ, సాధుసన్యాసులకు సేవలూ, కుంటి—గుడ్డివారికి పరిచర్యలూ చేసి ఆమె కాలం గడుపుతూ ఉండేది. భర్తతో చెప్పి ఇంకో సత్రం కూడా కట్టించింది. అందులో అనాథులూ అసహాయులూ ఇష్టం వచ్చినంత కాలం ఉండవచ్చు. జమీందారుగారే వారి తిండీ—తిప్పలూ చూస్తూ ఉంటారు. పార్వతి చాటుగా ఇంకో పనికూడా చేస్తూ ఉంటుంది; భర్తకు కూడా ఈ సంగతి తెలియ నివ్వదు. బ్రతికి—చెడ్డవారికి గుప్తంగా ధనసహాయం చేయటం. ఈ డబ్బు ఆమె సొంతది. భర్త ప్రతినెలా తన ఖర్చుకు ఇచ్చేదంతా ఇలానే ఖర్చుపెట్టుతూ ఉంటుంది. ఎంత చాటుగా ఖర్చు పెట్టినా కచేరీ గుమాస్తాలకూ, మేనేజరుకూ తెలియకుండా ఉండదు. ఇప్పుడు పూర్వం కన్న ఖర్చు చాలా ఎక్కువైందని వాళ్లల్లో వాళ్లు

తర్కించుకుంటూ ఉంటే దాసీల చెవిని పడేది. ఇక వాళ్ళ దగ్గరనుంచి జలదబాల దగ్గరికి చేరటం ఎంతసేపు పట్టుతుంది?

ఒకనాటి రాత్రి జలదబాల—'ఈ యింటితో మీకేమీ సంబంధం లేదా?' అని భర్తను అడిగింది.

'ఎందుకో చెప్పూ!'

'దాస దాసీలదాకా పోయినా మీకు కనపడటంలేదు. మామగారికి భార్యంటే చాలా తీపి—వారేమీ అనరు! మీరైనా చెప్పటం మంచిది.'

మహేంద్రునికి ఏమీ అర్థం కాకపోయినా ఉత్సుకతతో 'ఎవరి సంగతీ?' అని అడిగాడు. జలదబాల గంభీరంగా భర్తకు సలహా ఇవ్వ నారంభించింది:

'మీ పిన్నికి పిల్లా జల్లా లేరు. ఆమెకు సంసారంమీద ఎందుకు అపేక్ష ఉంటుంది? అందుకనే అస్తంతా పాడుచేస్తున్నది. మీరు చూట్టంలేదా?'

'ఏం చేస్తున్నదీ?' అన్నాడు మహేంద్రుడు కనుబొమలు చిట్లించి.

'కాస్త కళ్లు తెరిస్తే మీకే కనపడేది. ఇప్పుడు పూర్వంకంటే కుటుంబ ఖర్చు రెట్టింపవుతూ ఉంది. అతిథి అభ్యాగతులకూ, సదావ్రతాలకూ, దాన ధర్మాలకూ తెంపులేదు. సరే, ఆమె పరం ఆమె చూసుకుంటూ ఉన్నది. ఇక మన ఇహం? మన కిక పిల్లలు పుట్టరా? అప్పుడు వాళ్లేమి తింటారు?'

మహేంద్రుడు పక్కమీద నుంచి లేచి కూర్చున్నాడు.

'నువ్వెవ్వరి సంగతి చెప్పేది? అమ్మ సంగతేనా?' అన్నాడు.

'నారాత ఇలా తగలడింది! అన్నీ విప్పి చెప్పాల్సిన ఖర్మం నాకు పట్టింది.'

'నువ్వు అమ్మమీద ఫిర్యాదు చేస్తున్నావా?'

'నేను ఫిర్యాదూ చేయటంలేదు, చాడీలూ చెప్పటంలేదు. ఆ అవసరం కూడా లేదు నాకు. ఆఖరికి నామీద నెపం వేస్తారని జరుగుతున్న దేమిటో మీచెవిని వేశాను!' అన్నది జలద విసుగుగా.

మహేంద్రుడు మాట్లాడకుండా కాసేపు ఆలోచించి 'మీకన్నవారింట్లో రోజూ కుండ పొయ్యి ఎక్కదు. నీకు జమీందారుగారి ఇంటి ఖర్చు లేమి తెలుస్తవి?' అన్నాడు.

ఈ మాటకు జలద మండిపోయింది—'మీ అమ్మ కన్నవారు ఎన్నిసత్రాలు

కట్టించారో చెప్పండి ?' అని అడిగింది.

మహేంద్రుడిక తర్కించలేదు. ఉదయాన లేవగానే పార్వతి దగ్గరికి వెళ్లి—'నాకు మంచి పెళ్లే చేశావమ్మా ? నేనిక దీనితో వేగలేను, కలకత్తా వెళ్లుతున్నాను' అన్నాడు.

'ఎందుకు నాయనా ?' అన్నది పార్వతి విస్తుపోయి.

'నిన్ను తూలనాడింది. నేను దాన్ని వదిలివేశాను.'

కొన్నాళ్లనుంచి పార్వతి కోడలి ఆచరణ చూస్తూనే వస్తున్నది. కాని తన కేమీ తెలియనట్టుగా, నవ్వుతూ—'కాదు, నాయనా ! అమ్మాయి చాలా మంచిది.' అని, తర్వాత జలదబాలను చాటుకు పిలిచి 'మీ రేమన్నా పోట్లాడు కున్నారా అమ్మాయీ !' అని అడిగింది.

ఉదయానే భర్త కలకత్తా పోవటానికి ప్రయాణ సన్నాహాలు చేయటం చూసి జలదబాల భయపడింది; పశ్చాత్తాపం చెందింది. అత్త ప్రశ్న వినగానే ఏడుస్తూ—'తప్పు నాదే అత్తయ్యా ! దాసీల మాటలు విని బుద్ధి గడ్డి తిన్నది !' అన్నది.

తర్వాత వివరాలు విని పార్వతి సిగ్గుపడింది. కోడలి కళ్లుతుడుస్తూ—'నువ్వు చెప్పేదే నిజం అమ్మాయీ! నాకు సంసారం పొదుపుగా ఉండాలని తెలియదు. నేను అంత దూరం ఆలోచించలేదు కూడా' అన్నది.

పిమ్మట మహేంద్రుని పిలిచి—'తప్పులేనిది ఎవ్వరినీ శిక్షించకు నాయనా! నువ్వు భర్తవు—నీ మేలు కంటే భార్యకు కావలసింది ఏముంటుంది? అమ్మాయి నీ లక్ష్మి!' అన్నది.

ఆరోజునుంచీ పార్వతి చెయ్యి వెనకాడింది. సత్రంలోనూ, దేవాలయం లోనూ వెనుకటి మాదిరిగా సేవలు జరగటం లేదు. అనేకమంది వికలాం గులూ, అనాథులూ తిరిగి పోసాగారు. ఈ సంగతి భర్తకు తెలిసి పార్వతిని పిలిచి—'ఏమి అమ్మీ ! అన్నపూర్ణ భండారం ఖాళీ అయిందా ఏమిటి ?' అని అడిగాడు. 'ఊరకే ఇచ్చుకుంటూ పోతే కాపురం ఎన్నాళ్ళు గడుస్తుంది— కొన్నాళ్లు కూడబెట్టాలిగా. ఇప్పుడు ఖర్చెంత పెరిగిందో మీకు కనపడటం లేదా ?' అన్నది పార్వతి నవ్వుతూ.

'నే నింకా ఎన్నాళ్లు బ్రతుకుతాను? ఉన్న నాలుగు రోజులూ సత్కార్యాలుచేసి పరలోకం వంక చూడటం మంచిది.'

పార్వతి నవ్వుతూ—'ఇది చాలా స్వార్థపరుల మాటండీ! మీ సంగతే మీరు చూచుకుంటే ఇక పిల్ల లేమైపోతారు? కొంత కాలం ఊరుకోండి; తర్వాత మళ్లీ మొదలు పెట్టవచ్చును. మానవుల కార్యాలకు అంత మెప్పుడూ ఉండదు.' అన్నది.

చౌదరిగారు ఇక విధిలేక ఊరుకున్నారు.

పార్వతికి ఇప్పుడు చేసే పనులేవీ లేవు. అందుకని ఆలోచనలు ఎక్కువైనాయి. ఈ ఆలోచనలలోకూడా రకాలున్నవి. ఆశలున్న వాళ్లు ఒక రకంగా ఆలోచిస్తారు; ఆశలుడిగినవాళ్లు ఇంకోరకంగా ఆలోచిస్తారు. మొదటిరకం ఆలోచనలో జీవం ఉంటుంది. సుఖం ఉంటుంది. దుఃఖం ఉంటుంది. తృప్తి ఉంటుంది. ఎక్కువ సేపు ఆలోచించ లేరు. కాని ఆశాహీనులకు సుఖం లేదు. దుఖం లేదు. ఉత్కంఠత లేదు. కాని తృప్తి ఉంటుంది. కంటినుంచి నీళ్ళూ కారతవి. గంభీరత్వమూ ఉంటుంది. కాని సరికొత్త హృదయవేదన ఉండదు. ఆ ఆలోచన వెలిమబ్బువలె ఎటుపడితే అటు కొట్టుకు పోతుంది. గాలి తగలనిచోట నిలబడుతుంది. తగిలినచోటి నుంచి తప్పుకు పోతుంది. తన్మయావస్థలో ఉన్న మనస్సు ఉద్వేగములేని ఆలోచనలో ఒక విధమైన సఫలత పొందుతుంది. ఇప్పుడు పార్వతి స్థితి సరిగ్గా ఇలానే ఉన్నది. పూజ దగ్గర కూర్చున్నప్పుడు స్థిరత్వమూ, ఆశా, ఉద్దేశమూలేని ఆమె మనస్సు చప్పున 'తాల్‌సోనా పురం'లో ఉండే వెదురుగుమ్మలూ, మామిడితోపూ, పాఠశాలా, నది ఒడ్డూ మొదలగుచోట్లు తిరిగివచ్చేది. ఒక్కొక్కప్పుడు వాటిలో ఎందులోనైనా చిక్కుబడేది, అప్పుడు పార్వతికూడా వెతికి బయటికి తీసుకు రాగలిగేది కాదు. పూర్వం ఆమె పెదవి మీదకు నవ్వు వచ్చేది; ఇప్పుడు ఒక అశ్రుబిందువు చప్పున పంచపాత్ర నీటిలోపడి కలిసిపోతూఉంది. అయినా కాలం గడిచిపోతూనే ఉన్నది. పనిపాటలు చేస్తూ, మంచిచెడ్డలు చూస్తూ, సేవా శుశ్రూషలు చేసినా గడిచింది. అన్నీ వదిలి ధ్యాన మగ్న యోగినివలె ఉన్నా గడుస్తున్నది. కొంతమంది లక్ష్మి అన్న పూర్ణ

అనేవారు; మరికొందరు అన్యమనస్క, ఉదాసిని అనేవారు; కాని నిన్న ఉదయం నుంచి ఆమెలో ఇంకో మార్పు కనపడుతూ ఉంది. ఆమె కొంచెం తీవ్రంగానూ, కఠోరంగానూ కనపడుతూ ఉంది. నిండుగా, పాటుగా ఉండే గంగలో ఎక్కడనుంచో పోటు వచ్చింది. దీనికి కారణం ఇంటో వాళ్ళ కెవ్వరికీ తెలియదు. నాకుమాత్రం తెలుసును; మనోరమ నిన్న వాళ్ల ఊరినుంచి ఉత్తరం వ్రాసింది:—

'పార్వతీ! మనం చాలాకాలంనుంచీ ఒకరి కొకరం ఉత్తరం వ్రాసుకో లేదు. ఈ తప్పు ఉభయులమీదా ఉంది. ఇది పరిష్కారం చేసుకోవటం మంచిదని నా అభిప్రాయం. ఇద్దరమూ తప్పు ఒప్పుకొని అభిమానాన్ని చంపుకోవటం ఉత్తమం! పెద్దదాన్ని కాబట్టి ముందుగా నేనే క్షమాపణ కోరుతున్నాను. వెంటనే జవా బిస్తావనికూడా ఆశిస్తున్నాను.

'నేను ఇక్కడికి వచ్చి ఒక మాసం కావచ్చింది. మనం కాపురంచేసే స్త్రీలం కాబట్టి దేహారోగ్యాన్ని గురించి అంత శ్రద్ధ తీసుకోము. లక్ష్య పెట్టము. చచ్చిపోతే చెర విరగడ చేసుకున్నదంటాము; బ్రతికుంటే బాగానే ఉన్నా మంటాము. ఇక నాగోడవ అయింది. పోతే లోకాభిరామాయణం. విశేషాలు ఎక్కువలేవు. అయినా ఒక సంగతి నీకు వ్రాయాలని నాకు చాలా కుతూహలంగా ఉన్నది. వ్రాద్దామా వద్దా అని నిన్నటినుంచీ ఆలోచిస్తున్నాను. వ్రాస్తే నీకు దుఃఖం కలుగుతుంది; వ్రాయకపోతే నాప్రాణం మీదకు వస్తుంది —మారీచుని మాదిరి అయింది నా స్థితి! దేవదాసు సంగతి వింటే నీకు తప్పక దుఃఖం కలుగుతుంది; ఇక నీ దుఃఖంచూసి నేను విలపించకుండా ఉండలేను. దేవుడు తప్పించాడు; లేకపోతే, అతని చేతిలో పడినట్లయితే నీవంటి అభిమానిని విషమైనా తినేది లేక ఏ నుయ్యో, గొయ్యో ఐనా చూచుకునేది! ఇవ్వాళ కాకపోతే ఇంకా రెణ్ణాలకైనా అతని సంగతి నీకు తెలుస్తుంది. లోకాన్ని ఎలా మూయగలం?

'దేవదాసు ఇక్కడికి వచ్చి ఒకవారం రోజులయినది. అతను కలకత్తాలో ఉంటున్నాడనీ, తల్లి కాశీలో ఉంటుందనీ, నీకు తెలుసునుగా! అన్నతో సిల్లి కజ్జా పెట్టుకుని డబ్బు గుంజుకు పోవటానికి మాత్రం మధ్య మధ్య ఇలా

వస్తూ ఉంటాడని నాకు తెలిసింది. డబ్బు చిక్కిందాకా ఉండి చేతిలో పడగానే వెళ్ళిపోతాడట. అతని తండ్రి చనిపోయి రెండున్నర సంవత్సరాలు కూడా కాలేదు. నీకు, వింటే ఆశ్చర్యం కలగవచ్చు. ఈ మధ్యలో అతను సగం ఆస్తికిపైగా ఖర్చు పెట్టాడట. ద్విజదాసు చాలా లెఖ్ఖగాడు. పెద్దలు సంపాదించిన ఆస్తిని చెయ్యి దాటనివ్వలేదు. లేకపోతే లోకులు ఎప్పుడో కాజేసి కూర్చునేవారు. తాగుడులకీ, వేశ్యలకీ తగలేసేవాణ్ణి ఎవరు కాపాడగలరు?—ఒక్క యముడు తప్ప! బహుశా అది కూడా దగ్గరకు వచ్చిందనుకుంటాను. గుడ్డిలో మెల్ల ఏమంటే అతను పెళ్ళిచేసుకోక పోవటమే!

అయ్యో! అతన్ని చూస్తే ఏడుపొస్తుంది! పచ్చటి శరీరం నల్లబడింది. ఆ చక్కదనం పోయింది; సిరి పోయింది—గుర్తు పట్టలేము. జుట్టు ఎన్నడూ దువ్వినట్టు ఉండదు. గాలికి ఎగురుతూ ఉంటుంది. కళ్ళు పీక్కుపోయినవి. ముక్కు కోటేరు మాదిరిగా లేచింది. ఇంత రోతగా ఉన్నాడని ఏమి చెప్పేది. చూస్తే అసహ్యం పుట్టుతుంది, భయంకూడా కలుగుతుంది! పగలంతా నది ఒడ్డునే తుపాకి తీసుకుని పిట్టలు కొడుతూ ఉంటాడు. మరీ ఎండకు ఆగలేకపోతే, ఆ వంతెన దగ్గరఉన్న రేగుచెట్టు క్రింద తల వంచుకుని కూర్చుంటాడు. సాయంకాల ఇంటికి వచ్చి మద్యం త్రాగుతాడు. ఇక రాత్రి నిద్రపోతాడో గస్తీ తిరుగుతాడో దేవుడికే తెలియాలి.

'ఆవాళ సాయంకాలం నేను నీళ్ళు తేవటానికి నదికి పోయాను. దేవదాసు తుపాకి చేత పట్టుకొని నది ఒడ్డునే నడచి వస్తున్నాడు. నన్ను చూసి గుర్తించి నా దగ్గరికి వచ్చి నిలబడ్డాడు. నేను భయంతో వణికిపోయాను. రేవు దగ్గర ఒక్క పురుగు కూడా లేదు. నా పైప్రాణాలు పైనే పోయినవి. దేవుడు కాపాడాడు, తాగుబోతు చేష్టలేవీ చేయలేదు. చాల పెద్దమనిషి తరహాగా 'మనో, బాగా ఉన్నావా, చెల్లీ!' అన్నాడు శాంతంగా.

నే నేమి చేస్తాను? భయంతో—'ఊఁ' అన్నాను తల తిప్పి. అప్పుడతను నిట్టూర్చి—'సుఖంగా ఉండు చెల్లీ! మిమ్మల్ని చూస్తే నాకు చాలా ఆనందంగా ఉంటుంది.' అని నెమ్మదిగా వెళ్ళిపోయాడు. నేను పడుతూ లేస్తూ ఇంటికి పరిగెత్తాను. అమ్మయ్యో! నా అదృష్టం బాగా ఉండింది—

చెయ్యీ గియ్యీ పట్టుకొని లాగ లేదు! సరే, పోనీయి ఆ సంగతి. ఆ భ్రష్టుని సంగతులు వ్రాయాలంటే ఒక గ్రంథం అవుతుంది.

'పారూ, నిన్ను చాల కష్టపెట్టాను కాదూ? నీవు ఇప్పటికైనా అతన్ని మరచిపోలేకపోతే, నీకు దుఃఖం ఎలాగూ తప్పదు. దీనికి మరో ఉపాయమేముంది? ఈ విషయంలో నావల్ల ఏమైనా జరిగి ఉంటే నీ ప్రేమకోరే మనోదీదీని క్షమించు. నీబోటి గుణవంతురాలి కిది ఒక గొప్పకాదు.'

నిన్ననే ఈ ఉత్తరంవచ్చింది. ఇవ్వాళ మహేంద్రుని పిలిచి — 'రెండు పల్లకీలూ ముప్ఫయి ఇద్దరు బోయీలూ కావాలి. నేనిప్పుడే తాల్‌సోనాపురం పోతాను.' అన్నది.

మహేంద్రునికి ఆశ్చర్యం వేసింది. 'అలాగే సిద్ధం చేయిస్తాను. కాని రెండు పల్లకీలు ఎందుకమ్మా' అని అడిగాడు.

'నీవుకూడా వెంట రావాలి నాయనా, దోవలో నేను చనిపోతే తల కొరివి పెట్టటానికి కొడుకు ఉండాలిగా.'

మహేంద్రుడిక మాట్లాడలేదు. పల్లకీలు రాగానే ఇద్దరూ బయలుదేరారు.

చౌదరిగారికి ఈ సంగతి తెలియగానే వ్యాకులపడి దాస దాసీలను పిలిచి అడిగాడు. కాని వాళ్లెవరూ కారణం చెప్పలేకపోయారు. అప్పుడాయన బుద్ధినంతా వినియోగించి ఇంకా కొంతమంది సిపాయీలనూ దాసీలనూ పంపించాడు.

'దోవలో కనపడితే పల్లకీలు తిప్పించుకు రమ్మంటారా బాబూ!' అని ఒక సిపాయి అడిగాడు.

వారు కొంచెం ఆలోచించి — 'అఖ్ఖర్లేదు. మీరు కూడా వెంటనే పోయి ప్రమాదా లేవీ రాకుండా చూడండి.' అన్నాడు.

ఆనాడు పొద్దుకుంకేవరకు పల్లకీలు రెండూ తాల్‌సోనాపురం చేరినవి. కాని దేవదాసు ఊళ్ళోలేడు. మధ్యాహ్నమే కలకత్తా వెళ్ళిపోయాడట.

పార్వతి తల బాదుకుని — 'నా దురదృష్టం' అనుకున్నది. తర్వాత మనోరమను కలుసుకున్నది.

'ఏం పారూ! దేవదాసును చూడటానికి వచ్చావా?' అన్నది మనోరమ.

'కాదు వెంట తీసుకు పోవటానికి వచ్చాను. ఇక్కడ అతనికి 'నా' అనే వాళ్ళెవరూ లేరు.'

మనోరమ దిగ్భ్రమ చెందింది.

'ఏమిటే నువ్వువాగేది? సిగ్గన్నా వేయటంలేదూ?'

'సిగ్గెందుకు? ఎవరి వస్తువు వాళ్ళు తీసుకు వెళ్లటానికి కూడా సిగ్గేనా?'

'ఛీ. ఛీ, అలా అనకు! కాస్త చుట్టరికం అన్నా లేదు. అలాంటి మాటలు నోట రానీయకు—'

పార్వతి మ్లానంగా నవ్వి—'మనోదీదీ! నాకు జ్ఞానం తెలిసినప్పటినుంచీ మనస్సులో నాటుకుపోయిన సంగతి, ఎప్పుడన్నా బయటపడుతూ ఉంటుంది. నువ్వు నా అక్కవు. అందుకనే ఈమాట వినగలిగావు.'

మర్నాటి ఉదయం పార్వతి తల్లిదండ్రులకు నమస్కారంచేసి, మళ్ళీ పల్లకీ ఎక్కింది.

* * *

చంద్రముఖి అశ్వద్థపురంవచ్చి రెండు సంవత్సరాలైనది. వాగు ఒడ్డున కాస్త మెరకగా ఉన్నచోటుచూసి రెండు నిట్టాళ్ల పూరికొంప వేసుకున్నది. దాన్ని రెండుగదులుచేసి, ఒకదానిని వంటా సామానువేసుకోటానికీ, రెండవ దానిని పండుకోటానికీ కూర్చోటానికీ ఉపయోగించుకుంటూ ఉన్నది. ఇంటికి కొంచెం దూరంగా చోపరా. దాంట్లో నల్లావు ఉంటున్నది. ఇంటి ముంగిలి ఎప్పుడూ శుభ్రంగా ఉంటుంది. రోజూ పోలికూతురు వచ్చి పాచి ఊడ్చి కల్లాపి చల్లిపోతూ ఉంటుంది. ఇంటిచుట్టూ ఆముదాల కంచె. మెల్లాలో రేగుచెట్టు. ఇంటి వెనక తులసి కోట! నీళ్ళరేవు ఎదురుగానే ఉంది—కూలి వాళ్ళను పెట్టి ఖర్జూరపు చెట్టు మెట్టుగా వేయించింది. ఈరేవు ఈమె తప్ప ఇక నెవ్వరూ వాడరు. వానాకాలంలో ముసికి వర్షాలు కురిస్తే నీళ్లు చంద్రముఖి ఇంటిలోకి ఎక్కుతై. గ్రామస్థులు చాలా ఆదుర్దాతో పలుగులూ పారలూ తీసుకువచ్చి నీరు ఇంటికి ఎక్కకుండా కట్టవేసి పోతారు. ఈ గ్రామంలో అగ్రవర్ణాల వారు ఎవరూ లేరు. గొల్లలు, బెస్తలు, గవళ్ళూ, ఊరిబైట రెండు మాదిగ కొంపలు కూడా ఉన్నవి.

చంద్రముఖి ఈ గ్రామం వచ్చినాక దేవదాసుకు ఉత్తరం వ్రాసింది. జవాబుగా ఇంకా కొన్ని రూపాయలు పంపాడు. చంద్రముఖి ఈ డబ్బు ఊళ్లో వాళ్లకు అప్పు పెడుతూ ఉంటుంది. ఇబ్బంది వచ్చినప్పుడు వాళ్లు ఈమె దగ్గరకే పరుగెత్తుకొస్తూ ఉంటారు; డబ్బు తీసుకు వెళ్లుతూ ఉంటారు. చంద్రముఖి వడ్డీతీసుకోదు. దానికి బదులుగా వారు కూరా—నారా పండూ ఫలమూ ఇచ్చి పోతూ ఉంటారు. వడ్డీ అలా ఉంచి, అసలుకోసం కూడా ఈమె అంతగా పీడించదు. ఇవ్వలేనివారు అదీ ఇవ్వరు. చంద్రముఖి నవ్వుతూ—'ఇక నీ కెప్పుడూ ఇవ్వను!' అనేది తీర్చని వారితో.

'ఈ తఫా బాగా పండేటట్టు దీవించు తల్లీ!' అని వారు బ్రతిమాలే వారు.

చంద్రముఖి దీవించేది. మళ్లీ పంటలు సరిగా పండేవి కావు. శిస్తుకు జమీందారు వత్తిడి పెడితే మళ్ళీ ఈమె దగ్గరకు వచ్చి ఏడుస్తూ నిలబడే వారు. చంద్రముఖి లోలోన నవ్వుకుని—'వారుండగా నా కేమి తరుగు' అని అనుకునేది.

కాని అతను ఏడి? దాదాపు ఆరు మాసాలైంది, అతని దగ్గర నుంచి ఉత్తరమే లేదు. రిజిష్టరు ఉత్తరం రాస్తే తిరిగి వచ్చింది. చంద్రముఖి ఒక గొల్ల కుటుంబాన్ని తన యింటి దగ్గర అట్టి పెట్టుకున్నది. భైరవుని కొడుకు పెళ్ళికి పది రూపాయలన్నర ఓలి ఇచ్చింది; నాగలి ఒకటి కొని పెట్టింది. భైరవుడే ఈ కుటుంబానికి పెద్ద. ఈ కుటుంబం ఈమెను ఆశ్రయించుకు బతికేదే; ఈమె చెప్పినట్లు నడుచుకునేదే.

ఒకనాటి ఉదయం చంద్రముఖి భైరవుని పిలిచి—'ఇక్కడికి తాల్‌సోనాపురం ఎంత దూరముంటుందో ఎరుగుదువా?' అని అడిగింది.

భైరవుడు కాస్త ఆలోచించి—'ఎంతమ్మా! రెండు పరుగులేస్తే కచ్చేరీ వచ్చి కూర్చుంటుంది' అన్నాడు.

'అక్కడ జమీందారు ఉంటాడు కదూ?'

'ఆఁ. ఉన్నారు. ఈ గ్రామం కూడా వారిదే. మూడు సంవత్సరాలైంది, పెద్దాయన చనిపోయి. వారి శ్రాద్ధానికి కొన్ని రోజుల పాటు తిన్నాము. వారికి ఇద్దరు కొడుకు లున్నారు. వారికేమమ్మా మహారాజులు!'

'నన్నక్కడికి తీసుకుపోగలవా, భైరవ్ ?'

'ఎందుకు తీసుకు వెళ్ళలేను తల్లీ! మీ ఇష్టం వచ్చినరోజున సెలవు చేయండి'

'ఐతే ఇవ్వాళే పోదాము, భైరవ్ !' అన్నది చంద్రముఖి ఉత్సాహంతో.

భైరవుడు విస్మితుడై—'ఇవ్వాళనేనా !' అని చంద్రముఖి ముఖం వంక పరీక్షగా చూసి—'అయితే త్వరగా వంట చేసుకో తల్లీ! నేను చద్ది కట్టుకు వస్తాను' అన్నాడు.

'ఇప్పుడు కాదులే, భైరవ్ ! నువ్వు చద్ది కట్టుకురా' అన్నది చంద్రముఖి.

భైరవుడు ఇంటికిపోయి చద్దికట్టించుకుని, కర్రచేత పట్టుకుని, ఒక్క క్షణంలో తిరిగి వచ్చి—'ఇక సెలవు చేయండి. కాని, మీరుకూడా కాస్త ఎంగిలి పడకూడదా అమ్మగారూ?' అన్నాడు.

'వద్దు భైరవ్ ! నేనింకా పూజచేసుకో లేదు. వీలుంటే అక్కడికి పోయి నాక చూసు కుంటాను.'

భైరవుడు ముందు దోవచూపిస్తూ నడిచాడు. చంద్రముఖి వెనకే పిప్పి గడ్డల్లో మహా ప్రయాసపడుతూ నడుస్తున్నది. నడక అలవాటు లేకపోవటం. చేత ఆమె పాదాలు బొబ్బలెక్కినై. ముఖం కందిపోయింది ఎండకు. ఇంకా భోజనం చేయలేదు. అయినా చంద్రముఖి ఒక్కొక్క చేను దాటి పోతూనే ఉన్నది. చేలల్లో పని చేసుకొంటున్న రైతులు ఆమెముఖం వంక ఆశ్చర్యంతో చూస్తూ ఉండిపోయారు.

చంద్రముఖి ఎర్రంచుల చీర కట్టుకున్నది. చేతిని రెండు గాజులున్నవి. తలమీద ముసుగు. ఒంటి చుట్టూ దుప్పటి. ఝాము పొద్దు వుండగా ఊళ్లోకి చేరారు.

'నీ రెండు పరుగులూ ఇప్పటికి పూర్తి అయినాయా!' అన్నది చంద్రముఖి నవ్వుతూ. భైరవుడు పరిహాసం గ్రహించలేక—'వచ్చేశాంగా తల్లీ! మీద్ది సుఖపడ్డ శరీరం మళ్ళీ ఇవ్వాళే తిరిగి రాగలరా?' అన్నాడు.

'ఇవ్వాళేమిటి, రేపుకూడా బహుశా నడిచి రాలేను.' అని చంద్రముఖి మనస్సులో అనుకుని—'ఇక్కడ బండి దొరకదా?' అని అడిగింది.

'ఎందుకు దొరకదు తల్లీ, ఎడ్లబండిని పిలుస్తాను.'

బండి కుదర్చమని చెప్పి చంద్రముఖి జమీందారు గారి మేడలో ప్రవేశించింది. భైరవుడు బండి మాట్లాడటానికి వెళ్ళి పోయాడు.

మేడ రెండో అంతస్తులో పెద్దావిడ—ఇప్పటి జమీందారుగారి భార్య—కూర్చుని ఉన్నది. ఒక దాసీది చంద్రముఖిని వెంట పెట్టుకుని అక్కడికి తీసుకు వెళ్లింది. ఇద్దరూ ఒకరి నొకరు బాగా చూచుకున్నారు. చంద్రముఖి నమస్కరించి.

జమీందారుగారి భార్య ఒంటిమీద నగలు పట్టకుండా ఉన్నవి. కళ్లల్లో నుంచి అహంకారం పైకి తన్నుతూ ఉన్నది. పెదవులూ పళ్లూ, తాంబూలమూ కానూ వేసుకోవటం మూలాన నలుపుకు తిరిగినవి. ఒక బుగ్గ ఎత్తుగా ఉన్నది. బహుశా తాంబూలపు తమ్మ లోపల ఉండవచ్చు. జుట్టు ఎగదువ్వి నడినెత్తిన చుట్ట చుట్టింది. బూబుల మాదిరిగా రెండు చెవులకూ సందు లేకుండ పోగులున్నవి. ఒక ముక్కున చంద్రవంక; రెండో ముక్కున పెద్ద బెజం. బహుశా అత్తగారి అమలులో ముక్కెర పెట్టుకుని ఉంటుంది. దొందు శరీరం; నల్లగా నిగ నిగలాడుతూ ఉంది. పెద్ద కళ్లు. గుండ్రని ముఖం, నల్లని చీర కట్టి, సిల్కు జాకెట్టు తొడుక్కున్నది. ఈమెను చూసేవరకు చంద్రముఖికి అసహ్యాం కలిగింది.

చంద్రముఖి కొంచెం వయసు మిగిలిందైనా చాలా చక్కనిది. బహుశా వీరిద్దరి ప్రాయం ఒకటే కావచ్చును. కాని పెద్దావిడ దీనికి ఒప్పుకోదు! ఈ గ్రామంలో పార్వతి తప్ప ఇంత చక్కనిదాన్ని ఆమె ఎప్పుడూ చూడలేదు. ఆమె ఆశ్చర్యంతో 'ఎవరు మీరు ?' అని అడిగింది.

చం—'తమ ప్రజనేనండీ. కొంచెం శిస్తు బాకీ ఉండి చెల్లించడానికి వచ్చాను.'

పెద్దావిడ లోలోపల సంతోషించి—'అయితే ఇక్కడికి ఎందుకు? కచ్చేరీకి పోరాదా !' అన్నది.

చంద్రముఖి మందహాసం చేసి—'నేను బీదదాన్ని తల్లీ! పన్నంతా చెల్లించ లేను. మహా దయగలవారని విని తమ దగ్గరికి వచ్చాను. అనుగ్రహించి కొంత మాఫీ చేయిస్తే, చెల్లించిపోతాను.' అన్నది.

ఈ మాట పెద్దావిడ తన జీవితంలో యిదే మొదటిసారి వినటం; ఆమెకు దయ ఉన్నదట! శిస్తు మాఫీ చేయించవలదట! ఇంకేం ఆమెకు చంద్రముఖి మీద ఎన్నడూలేని దయ కలిగింది.

'అదే, అమ్మాయీ! రోజూ నన్ను ఎందరో వచ్చి వేధిస్తూ ఉంటారు. ఎంతో డబ్బు వదిలిపెడుతూ ఉంటాను! లేదనులేను. అందుకనే మావారు నన్నెప్పుడూ కోప్పడుతూ ఉంటారు! సరే కాని, నీ బాకీ ఎంత?'

'ఎక్కువ లేదు తల్లీ. రెండు రూపాయలే. కాని మాకు అవే గగనం. ఇవ్వాళ పగలల్లా పడుతూ లేస్తూ ఇంతదూరం నడచి వచ్చాను.'

'అయ్యో. మీబోటి దీనులమీద దయ చూపించవలసిందే. బిందూ, ఈమెను తీసుకు వెళ్ళి మేనేజరు గారితో నేను చెప్పావని చెప్పి రెండు రూపాయలూ తీసివేయించు. ఆఁ. నీ ఇల్లు ఎక్కడ అమ్మాయి?'

'అశ్వద్ధపురం అనే గ్రామం. మీ ఇలాకాలోదే. సరే కాని, అమ్మ గారూ! ఇప్పుడు జమీందారులు యిద్దరు కాదండీ?'

'ఇద్దరేంటి, పాడు! ఇంకా రెండు రోజులుంటే అంతా మాదే అవుతుంది.

'ఎలా తల్లీ! చినబాబుకు చాలా అప్పున్నదా?' అన్నది చంద్రముఖి ఉద్విగ్నతతో.

పెద్దావిడ మందహాసం చేసి 'ఆ సంతా మాకు తాకట్టు పెట్టాడు. మామరిది ఇక దివాళే. తప్ప తాగుతూ ముండను పెట్టుకొని కలకత్తాలో ఉంటున్నాడు. ఎంత డబ్బు తగలేశాడో లెఖ్ఖ ఉన్నదా?' అన్నది.

చంద్రముఖి ముఖం వాడిపోయింది. కాసేపు ఊరుకుని—'చిన్నబాబుగారు ఎప్పుడూ ఇంటికి రారా అమ్మగారూ?' అని అడిగింది.

'ఎందుకురాడు? డబ్బు అవసరమైనప్పుడు వస్తాడు. తాకట్టుపెట్టి తీసుకు పోతాడు. రెండు మాసాల కిందట ఒకమాటు వచ్చి పన్నెండు వేల రూపాయలు తీసుకు వెళ్ళాడు. బతికే లక్షణాలుకూడా లేవు. ఒంటి నిండా చెడు రోగాలు, ఛీ, ఛీ—'

చంద్రముఖి కంపించింది 'వారు కలకత్తాలో ఎక్కడ ఉంటారు?' అని మలిన ముఖంతో అడిగింది.

పెద్దావిడ నొసలు బాదుకుని—'పాపం రాత! అది ఎవ్వరికి తెలుస్తుంది? ఏ హోటళ్లలోనో తిని, ఎవతె కొంపలోనో పడి ఉంటాడు—అది అతనికి తెలియాలి; అతని సారాబుద్ధికి తెలియాలి!' అన్నది నవ్వుతో

'ఇక నేను వెళ్తాను' అన్నది చంద్రముఖి చప్పున లేచి నిలబడి.

పెద్దావిడ ఆశ్చర్యంతో—'వెళ్తావా?' అని బిందును కేక వేసింది.

'ఫర్వాలేదు తల్లీ! నే నొక్కదాన్ని కచ్చేరీకి పోగలను' అని నెమ్మదిగా బయలుదేరింది. బయటకు వచ్చేవరకు ఆమెకోసం భైరవుడు కనిపెట్టుకుని ఉన్నాడు. ఎద్దుబండి సిద్ధంగా ఉన్నది. ఆ రాత్రే చంద్రముఖి ఇంటికి తిరిగి వచ్చింది.

ఉదయాన మళ్ళీ భైరవుని పిలిచి—'నేను కలకత్తా పోవాలి' భైరవ్! నువ్వు ఎలానూ రాలేవు. నీ కొడుకును తీసుకుపోతాను. ఏమంటావు?' అని అడిగింది.

'మీ ఇష్టం తల్లీ. కాని కలకత్తా ఎందుకు, ఏమన్నా అవసరమైన పని ఉందా?'

'అవును భైరవ్! అవసరమైన పనే ఉంది.'। 'మళ్ళీ ఎప్పుడొస్తారు అమ్మగారూ?'

ఆ సంగతి చెప్పలేను భైరవ్! వస్తే వెంటనే రావచ్చు. లేకపోతే కొంత ఆలస్యం కావచ్చు. ఒకవేళ అసలు రావటమే పడకపోతే నా ఆస్తంతా నువ్వు తీసుకో'

భైరవుడు మొదట నిశ్చేష్టు డయ్యాడు. తర్వాత అతని కళ్ళల్లో నీరు తిరిగింది. 'అవేమి మాటలు తల్లీ; మీరు లేకపోతే ఈ గ్రామంలో ఒక్కరు కూడా బ్రతకరు!' అన్నాడు.

చంద్రముఖి కళ్లల్లో కూడా నీరు తిరిగింది—'అదేమిటి భైరవ్! నేను ఇక్కడికివచ్చి రెండు సంవత్సరాలేగా అయింది; అంతకు పూర్వం మీరు బ్రతకలేదా?'

దీనికి జవాబు మూర్ఖ భైరవుడు ఇవ్వలేకపోయాడు. కాని చంద్రముఖి అంతర్యంలో అంతా గ్రహించింది.

భైరవునికొడుకు రాముడు వెంట రావటం స్థిరపడింది. చంద్రముఖి బండిలో

అవసరమైన సామాను పెట్టి బండి ఎక్కి పోతూ ఉండగా, ఈమెను చూడ టానికి వచ్చిన గ్రామస్థులందరూ ఏడవ నారంభించారు. చంద్రముఖి కళ్లలో కూడా నీరు తిరిగింది.

'పాడు కలకత్తా! దేవదాసుకోసం వెళ్ళుతున్నాను, కాని లేకపోతే నన్ను కలకత్తాకు రాణీని చేస్తానన్నా వీరి ప్రేమను నిరసించి వెళ్లేదాన్ని కాను.' అని మనస్సులో అనుకున్నది.

చంద్రముఖి మర్నాడు క్షేత్రమణి యింటికి వచ్చి దిగింది; పూర్వం ఈమె ఉన్న ఇంట్లో ఎవరో కొత్తవాళ్ళు ఉంటున్నారు. చంద్రముఖిని చూడగానే క్షేత్రమణి విస్తుపోయి—'నువ్వా చెల్లీ! ఇన్నాళ్ళనుంచీ ఎక్కడ ఉంటు న్నావు!' అన్నది.

'అలహాబాదులో' అన్నది చంద్రముఖి నిజం దాచి.

క్షేత్రమణి ఆమెను ఎగాదిగా చూసి—'నీ నగలన్నీ ఏమయినై?' అన్నది.

'అన్నీ వున్నవి.' అన్నది చంద్రముఖి నవ్వుతూ.

చంద్రముఖి ఆనాడే దయాల్ దగ్గరికి పోయి—'నాకింకా ఎంత రావలసి ఉంటుంది, దయాల్?' అని అడిగింది.

దయాల్ చిక్కులో పడ్డాడు:—'అదే, ఇంకా అరవయ్యో డెబ్బయ్యో రావలసి ఉంటవి. నాలుగైదు రోజుల్లో సరుతాను అమ్మాయి!' అన్నాడు.

'ఇప్పుడు డబ్బుతో నాకేమీ అవసరంలేదు. నాకు కొన్ని పనులున్నై. చేసిపెట్టు.'

'ఏం పనులు?'

'నువ్వు రెండు రోజులు పని చెడవలసి ఉంటుంది. మా పేటలో ఒక యిల్లు అద్దెకు కుదర్చాలి—తెలిసిందా?'

'తెలిసిందమ్మాయి!' అన్నాడు దయాల్ నవ్వుతూ.

'మంచి ఇల్లు మాట్లాడాలి, చక్కని మంచం, పరుపూ, దిళ్ళూ, దీపాలూ, టేబిలూ—తెలిసిందా?'

దయాల్ తల ఆడించాడు.

'అద్దం దువ్వెనా, రెండు అద్దకం చీరెలూ, ఒక సిల్కు జాకెట్టూ. మంచి

గిల్టునగలు ఎక్కడ దొరుకుతాయో చెప్పగలవా ?'

దయాళ్ చోటు చెప్పాడు.

'అయితే ఒక సెట్టు మంచివిగా చూసి కొనాలి—నేను కూడా వెంట వస్తాను.' అని నవ్వుతూ—'మాకు ఇంకా ఏమేమి కావాలో నీకు తెలుసుగా; ఒక దాసీని కూడా కుదర్చాలి.' అన్నది. 'ఎప్పటిలోగా అమ్మాయీ !'

'ఎంత త్వరలో అయితే అంత మంచిది: రెండు మూడు రోజులు ఆలస్యమైనా ఫరవాలేదు.' అని అతని చేతికి వందరూపాయల కాగితం, ఒకటి యిచ్చి—'వాసి చూడబోకు. నాణ్యమైన సరుకుకొను.' అన్నది.

మూడోనాడు చంద్రముఖి కొత్త ఇంట్లోకి వెళ్ళింది. ఆ పగలంతా రామునితో తోడ్పాటుతో తన యిచ్చవచ్చినట్లు అలంకరణ ప్రారంభించింది. ముఖం సబ్బుతో కడిగి, పౌడరు అద్దుకుంది. కాళ్ళకు పారాణీ పెట్టుకొని, తాంబూలం వేసుకుంది. తర్వాత నగలు పెట్టుకుని, జుబ్బాతొడిగి, అద్దకం చీర కట్టుకున్నది. ఎన్నాళ్ళనుంచో సంస్కారం ఎరగని జుట్టును మరల దువ్వి, నెత్తిన కొండీ చుట్టుచుట్టింది. అద్దంలో ముఖం చూచుకుని లోలోన నవ్వుకొని—'ఇంకా ఏమేమి రాసిపెట్టి ఉందో ఈపాడు నొష్టని,' అనుకున్నది.

పల్లెటూరి రాముడు ఈ కొత్త అలంకారాలూ, దుస్తులూ చూసి గాభరా పడి 'ఇదేమిటి అక్కయ్యా ?' అని అడిగాడు.

చంద్రముఖి నవ్వుతూ—'ఇవ్వాళ నాథగ్త వస్తాడు రామూ !' అన్నది.

రాముడు విస్మయంలో చూస్తూ ఉండిపోయాడు. సాయంత్రం అయినాక క్షేత్రమణి ఊసుపోకకు వచ్చి—'మళ్ళీ ఇదేమిటి చెల్లీ !' అని అడిగింది.

'మళ్ళీ ఇవన్నీ కావలసిందేగా !' అన్నది చంద్రముఖి మందహాసం చేస్తూ.

క్షేత్రమణి కాసేపు అలానే చూసి—'చెల్లికి ఏళ్ళతోపాటు రూపంకూడా పెరుగుతూ ఉంది !' అన్నది.

క్షేత్రమణి వెళ్ళిపోయిన తర్వాత చంద్రముఖి మళ్ళీ వెనకటి మాదిరిగానే కిటికీ వద్ద కూర్చుని రెప్ప వాల్చకుండా రోడ్డువంక చూడ నారంభించింది. ఆమె పని ఇదే; దీనికోసమే ఆమె వచ్చింది—ఇక్కడ ఉన్నన్నాళ్ళు ఈ పనే చేస్తుంది.

ఎప్పుడన్నా కదాచితుగా కొత్తవాళ్ళు వచ్చి తలుపు తట్టుతూ ఉండేవారు. ఇంట్లో కూర్చున్న రాముడు వల్లించిన పాఠంలా—'ఇక్కడ లేరు' అని అప్పగిస్తూ ఉండేవాడు. వెనుకటి పరిచయాన్ని బట్టి ఎవరన్నా లోపలికివస్తే చంద్రముఖి వారిని కూర్చోబెట్టి నవ్వుతూ మాట్లాడేది. మాటల సందర్భంలో దేవదాసు సంగతి అడిగేది. వారికి తెలిసేది కాదు—వారు ఊరకనే పోవలసి వచ్చేది. రాత్రి చాలా పొద్దుపోయిన తర్వాత చంద్రముఖి స్వయంగా బయలుదేరి ప్రతి గల్లీ, ప్రతి ద్వారమూ వెదుకుతూ తిరిగేది! ఎవరన్నా ఇంట్లో మాట్లాడుకుంటున్నట్టు తెలిస్తే చంద్రముఖి చెవి ఆనించి వినటానికి ప్రయత్నించేది—ఏమేమో మాట్లాడుకుంటూ ఉండేవారు. కాని ఆమెకు కావలసిన మాటలు వినపడేవి కావు. అప్పుడప్పుడు ఎవరన్నా తాగుబోతులు ఈమెను పట్టుకోవటానికి వెంటపడేవారు! చంద్రముఖి ప్రాణాలు తప్పించుకు పరుగెత్తుతూ ఉండేది. ఇక మధ్యాహ్నం ఈమె ఎరిగిన ఇళ్ళకెల్లా వెళ్ళుతుండేది. మాటల సందర్భంలో 'మీలో ఎవరన్నా దేవదాసును ఎరుగుదురా?' అని అడిగేది.

'ఏ దేవదాసు?' అని వారడిగేవారు.

చంద్రముఖి కుతూహలంతో దేవదాసును వర్ణించేది:

'పచ్చని ఒళ్ళు, గొగ్గుల గొగ్గుల క్రాపు. తల మీద కుడివైపున తెగిన మచ్చ. చాలా ధనవంతుడు, డబ్బు దుబారాగా ఖర్చుచేస్తూ ఉంటారు-ఎరుగుదురా ఎవరన్నా?' అని అడిగేది.

ఎవ్వరూ జాడ చెప్పేవారు కారు. చంద్రముఖి హతాశురాలై, చిన్నపోయిన ముఖంతో ఇంటికి వచ్చేది. చాలా పొద్దుపోయేవరకు మేల్కొని రోడ్డువంకనే చూస్తూ ఉండేది. నిద్రవస్తే విసుక్కునేది. 'ఇది నీకు నిద్రపోయే సమయమా?' అని మనస్సును హెచ్చరించుకునేది.

ఇలా ఒక మాసం గడిచింది. రాముడు విసుగెత్తిపోయాడు. దేవదాసు ఇక్కడ లేడేమోనని కూడా చంద్రముఖికి సందేహం కలగనారంభించింది. అయినా ఆశను మాత్రం వదలుకోలేదు. దేవతల్ని ప్రార్థిస్తూ దినాలు గడుపుతూ ఉన్నది.

నెలా పదిహేను రోజులు గడిచినవి. ఆవాళ రాత్రి చంద్రముఖి నోము ఫలించింది; రాత్రి పదకొండు గంటలకు, వెదకి వేసారి హతాశురాలై ఇంటికి తిరిగి వస్తూ ఉండగా రోడ్డు పక్కను ఎవరో పండుకొని తనలో తాను వాక్కుంటూ ఉండటం చూసింది. చంద్రముఖి గుండె దడదడ కొట్టుకున్నది. ఈ గొంతుక ఈమె ఎరిగిందే! కోటిమందిలో ఉన్నా గుర్తింపగలదు. ఆ వ్యక్తి పడి ఉన్న చోట కొంచెం చీకటిగా ఉన్నది. పైగా అతను తప్ప తాగి బోర్లా పండుకుని ఉన్నాడు. చంద్రముఖి దగ్గరికిపోయి అతని వంటిమీద చెయ్యివేసి—'మీ రెవరండీ. ఇలా పండుకున్నా రెందుకు?' అని అడిగింది.

'విను సఖీ! నాదు మనవి, శ్యామసుందరు తోడ తేవే—' అన్నాడతను కూనిరాగంతో. చంద్రముఖి సందేహం తీరింది—'దేవదాస్!' అని పిలిచింది.

దేవదాసు ఆ విధంగానే—"ఊఁ, తోడితేవే!' అన్నాడు.

'ఇక్కడ పడుకున్నా వెందుకు? ఇంటికి వస్తావా?'

'రాను. నాకిక్కడే బాగుంది.'

'ఇంకాస్త సారా తాగుతావా?'

'తాగుతాను.' అని అతను చంద్రముఖి మెడ వాటు వేసుకు—'ఎవరు బాబూ నువ్వు, నా కింత ప్రాణ మిత్రుడివి' అన్నాడు.

చంద్రముఖి కళ్ళవెంట నీరు కార నారంభించింది. దేవదాసు ఆమె మెడ పట్టుకుని తూలుతూ ఎలాగో చాలా ప్రయాసమీద లేచి నిలబడి చంద్రముఖి ముఖం వంక చూచి—'వహ్వా! భలే నాణ్యమైన సరుకోయ్ దేవదాస్!' అన్నాడు. చంద్రముఖికి ఏడుపులో కూడా నవ్వు వచ్చింది.

'అఁ, బలే నాణ్యమైన సరుకు! సరే, నా భుజం మీద చెయ్యివేసి ఇంకాస్త దూరం నడువు. బండి కావాలి కాదూ?' అన్నది.

'ఎందుకు కావద్దూ!' అని దేవదాసు దోవను నడుస్తూ—'నువ్వు నన్ను ఎరుగుదువా, సుందరీ?' అని పట్టుకుపోయిన గొంతుతో అడిగాడు.

'ఎరుగుదును' అన్నది చంద్రముఖి.

'అంతా నన్ను మరిచిపోయిరీ, ఇక నువ్వే మిగిలావ్' అన్నాడు దేవదాసు పాడుతూ.

తర్వాత చంద్రముఖి ఆధారంతో బండి ఎక్కి ఇంటికి చేరారు. వాకిటి దగ్గర నిలబడి జేబులో చెయ్యి పెట్టి—'సుందరీ! దోవలో ఉన్న వాణ్ణి పట్టుకొచ్చావు కాని జేబులో దమ్మిడీకూడా లేదు?' అన్నాడు. చంద్రముఖి మాట్లాడకుండా లోపలికి లాక్కొచ్చి మంచంమీద పండుకోబెట్టి నిద్ర పొమ్మని చెప్పింది.

దేవదాసు పట్టుకుపోయిన గొంతుతో—'ఇంకా నేనే ఆశ లేమైనా ఉన్నాయా ఏమిటి? నేను ముందుగానే చెప్పాను—జేబు ఖాళీ. లాభం లేదని—తెలిసిందా, సుందరీ?' అన్నాడు.

సుందరి తెలుసుకుని—'రేపు ఇద్దువుగానిలే!' అన్నది.

'అంత నమ్మకం మంచిది కాదు. ఏమి కావాలో స్పష్టంగా చెప్పు.'

'రేపు విందువు గాని' అని చంద్రముఖి పక్క గదిలోకి వెళ్ళిపోయింది.

దేవదాసుకు నిద్ర తెలిసేవరకు చాలా ప్రొద్దు ఎక్కింది. గదిలో ఎవ్వరూ లేరు—చంద్రముఖి స్నానం చేసి వంట చేస్తూ ఉన్నది. దేవదాసు ఒక మాటు గది అంతా పరికించాడు. ఒక్క వస్తువును కూడా అతను గుర్తించలేక పోయాడు. క్రిందటి రాత్రి సంగతులు కూడా అతని కేమీ జ్ఞాపకం లేవు; ఎవరో మనసారా చేసిన పరిచర్య మాత్రం జ్ఞాపకం ఉన్నది—ఎవరో అతన్ని మహాప్రేమతో తీసుకువచ్చి నిద్రపుచ్చటం లీలగా తోస్తున్నది.

ఇంతలో చంద్రముఖి గదిలోకి వచ్చింది. అలంకరణలో రాత్రికీ ఇప్పటికీ ఆమెలో చాలామార్పు కనిపించింది. నగ లేమీ తీసివేయలేదు; కాని తల దువ్వలేదు. అద్దకంచీర కట్టలేదు. తాంబూలం వేయలేదు. మామూలు సాదా చీర కట్టుకున్నది. దేవదాసు ఆమెముఖంవంక చూసి నవ్వి—'నిన్న నువ్వు నన్ను ఎక్కడనుంచి దోచుకొచ్చావు?' అని అడిగాడు.

'దోచుకు రాలేదు. దోవలో పడివుంటే ఎత్తుకువచ్చాను.'

దేవదాసు గంభీరంగా—'సరే ఎలాగైతేనేం తెచ్చావు. కాని, ఏమిటి మళ్ళీ ఈవేషం? ఒంటిమీద నగలు పట్టటం లేదు. ఎవరిచ్చారు?' అన్నాడు.

చంద్రముఖి దేవదాసువంక తీక్షణంగాచూసి— 'మళ్ళీ?' అన్నది.

దేవదాసు నవ్వుతూ—'ఉహుం—అదికాదు. కాస్త సరసం ఆడితే తప్పా!

ఎప్పు డొచ్చావు?' అన్నాడు.

'నెలా పదిహేను రోజులైంది.'

దేవదాసు మనసులో లెఖ్ఖ వేసుకొని—'మా ఇంటిదగ్గరనుంచి ఇటే వచ్చావా?' అన్నాడు. చంద్రముఖికి ఆశ్చర్యం కలిగింది.

'మీ ఇంటికి వెళ్ళానని ఎలా తెలుసుకున్నారు?'

'నువ్వెళ్ళిన రెండురోజులకు నేను ఇంటికి వెళ్ళాను. నిన్ను మావదినెదగ్గరికి తీసుకువెళ్ళిన దాసీ, మొన్న అశ్వద్ధపురంనుంచి చక్కని స్త్రీఒకతె వచ్చిందని చెప్పింది. ఇక తెలుసుకోడం ఏమి కష్టం? సరేకాని ఇన్నినగలు ఎందుకు చేయించావు?'

'చేయించలేదు. ఇవన్నీ గిల్టువి, కలకత్తా వచ్చి కొన్నాను. చూడండి, మళ్ళీ విూమూలాన ఎంత ఖర్చుపెట్టవలసిన వచ్చిందో? ఇంతకూ మీరు నన్ను గుర్తించనే లేకపోయారు!'

దేవదాసు పకపకనవ్వి—'ఉహుం. బొత్తిగా! కాని నీ పరిచర్యమాత్రం గుర్తించాను. చంద్రముఖి తప్ప నాకింత పరిచర్య ఎవరు చేస్తారని చాలా సార్లు అనుకున్నాను.'

చంద్రముఖి ఆనందంపట్టలేక ఏడవా లనుకున్నది. కొంచెంసేపు మౌనంగా ఉండి—'మీరు నన్ను పూర్వంమాదిరిగా అసహ్యించుకోవటంలేదు కదూ!' అని అన్నది.

'లేదు, పైగా ప్రేమిస్తున్నాను.'

మధ్యాహ్నం దేవదాసు స్నానంచేసేటప్పుడు, అతని పొట్టమీద ప్లానలు గుడ్డకట్టి ఉండటంచూసి, చంద్రముఖి భయపడుతూ—'అదేమిటి! ఫ్లానలు కట్టారెందుకు?' అని అడిగింది.

'నీకింత ఆదుర్దా ఎందుకు? కడుపులో కొంచెం నొప్పిగా ఉన్నది.'

చంద్ర తల బాదుకుని—'కొంపముంచి లివరు జబ్బు కాదుగదా?' అన్నది.

'అలాగే కనపడుతున్నది, చంద్రముఖీ!' అన్నాడు దేవదాసు.

ఆరోజునే డాక్టరువచ్చి చాలాసేపు పరీక్షించి ఈ సందేహమే వెలిబుచ్చాడు. మందిచ్చి చాలా జాగ్రత్తగా ఉండకపోతే ప్రమాదం చేయవచ్చని

హెచ్చరించాడు. దీని అర్థం ఇద్దరూ గ్రహించారు; దేవదాసు బసకు కబురు చేసి ధర్మదాసుకు పిలిపించాడు; చికిత్సకోసం డబ్బుకూడా తెప్పించాడు. రెండురోజులు ఇలా గడిచినవి. మూడోనాడు దేవదాసుకు జ్వరం తగిలింది. చంద్రముఖిని పిలిచి—'మంచి అదనులో వచ్చావు. లేకపోతే నిన్ను చూసే వాణ్ణికాను' అన్నాడు.

చంద్రముఖి కళ్లు తుడుచుకుని ప్రాణాలు ఒడ్డి సేవచేయ నారంభించింది. 'వారి అవసరానికి అక్కరకువస్తానని అనుకోలేను—దేవదాసుకు ఆరోగ్యం కలిగించు!' అని భగవంతుని ఉద్దేశించి ప్రార్థించింది. దేవదాసు ఒక మాసం కంటే ఎక్కువే మంచంలో ఉన్నాడు. తర్వాత నెమ్మదిగా అతని జబ్బు తిరుగుముఖం పెట్టింది—ప్రమాదస్థితికి రాలేదు.

ఒకనాడు దేవదాసు చంద్రముఖితో—'చంద్రముఖీ! నీ పేరు చాలా పెద్దది. ఎప్పుడూ పిలవాలంటే చాలా ఇబ్బందిగా ఉన్నది—కొంచెం చిన్నది చేయా లనుకుంటున్నాను' అన్నాడు.

'మంచిదేగా' అన్నది చంద్రముఖి.

'అయితే. ఇవ్వాళనుంచి నేను నిన్ను 'అమ్మా' అని పిలుస్తాను.

చంద్రముఖి నవ్వి—'అలాగే పిలవండి. కాని పిలుపుకి అర్థముండాలిగా!' అన్నది.

'అన్ని మాటలకూ అర్థముంటుందా? అది నా అభిలాష.'

'అంత అభిలాషగా ఉంటే పిలవండి. కాని ఆ అభిలాష ఎందుకో చెప్తారా?'

'ఉహుం, అది నువ్వెప్పుడూ అడగకూడదు.'

'అలాగే, అడగనులెండి.' అని చంద్రముఖి ముఖం చాటుచేసుకున్నది.

దేవదాసు చాలాసేపు మాట్లాడకుండా ఉండి అకస్మాత్తుగా—'సరే! అమ్మా, నువ్వు నాకెవ్వరవని ఇంత ప్రాణప్రదంగా సేవ చేస్తున్నావు?' అని గంభీరంగా అడిగాడు.

చంద్రముఖి కొత్త పెళ్లికూతురూ కాదు. వాక్పటుత్వం లేని బాలికా కాదు దేవదాసు ముఖం వంక రెప్పవాల్చకుండా, శాంతంగా చూస్తూ—'మీరే నా

సర్వస్వం—ఇంతవరకు మీరు తెలుసుకోనేలేదా ' అన్నది, గద్గదస్వరంతో.

దేవదాసు గోడవంక దృష్టి మరల్చి మెల్లగా—' తెలుసుకున్నాను. కాని నాకిది ఏమీ ఆనందం కలిగించటంలేదు. పార్వతిని నే నెంత ప్రేమించేవాడినీ; ఆమె నన్నెంత ప్రేమించేది. అయినా ఎన్ని చిక్కులు? అనేక కష్టాలు అను భవించిన మీదట ఇక ఈ ఉచ్చుల్లో కాలు పెట్టకూడదని స్థిరపరచుకొన్నాను; నా ఇష్టంతో పెట్టనూలేదు. కాని నువ్విలా ఎందుకు చేశావు ? బలవంతాన నన్నెందుకు బంధించావు ?' అని కాసేపు ఊరుకుని — 'అమ్మో ? నన్ను ప్రేమిస్తే నువ్వుకూడా పార్వతిమాదిరిగా కష్టాల పాలవుతావు !' అన్నాడు.

చంద్రముఖి చెరుగుతో ముఖం కప్పుకుని మంచానికి ఒక పక్కన కూ చున్నది. దేవదాసు మరల మెల్లగా చెప్పనారంభించాడు.

'మీ ఇద్దరిలో ఎంత భేదమున్నది; ఎంత సామ్యమున్నది. ఒకరిలో ఎంత ఉద్ధృతం, ఎంత అభిమానం; రెండ వారిలో ఎంత శాంతం, ఎంత నిగ్రహం. ఆమెలో ఎంత మాత్రం సహనంలేదు; ఇక నీలో ఎంత సహన శక్తి; ఆమెకు ఎంత కీర్తి; నీకెంత కళంకం. ఆమెను అందరూ ప్రేమించేవారే ; ఇక నిన్ను అందరూ అసహ్యించుకునేవారే! అయినా నేను నిన్ను ప్రేమిస్తున్నాను; ఎందుకు ప్రేమించను ?' అని దేవదాసు నిట్టూర్చి మళ్ళీ చెప్ప నారంభించాడు: 'పాప పుణ్యాలను విచారించే భగవంతుడు నీకేమి శిక్ష విధిస్తాడో నాకు తెలియదు. కాని చనిపోయిన తర్వాత మళ్లీ మన మిద్దరం కలుసుకోవటం సంభవిస్తే, నిన్ను విడిచిపెట్టి ఉండను.'

చంద్రముఖి లోలోపల హృదయం కరిగిపోయేటట్టు ఏడ్చింది—'ఏ జన్మ లోనైనా, ఎప్పటికైనా ఈ పాపిష్టురాలి పాపం పరిహారమైతే నాకీ వరమే అనుగ్రహించు,భగవంతుడా!'అని దేవుని ఉద్దేశించి మనస్సులో ప్రార్థించింది.

* * *

రెండు మాసాలు గడిచినవి. దేవదాసుకు ఆరోగ్యం కలిగింది. కాని ఇంకా వంట్లో పురి రాలేదు. గాలి మార్పు అవసరమని డాక్టరు చెప్పాడు. రేపు ధర్మదాసును వెంటబెట్టుకొని అలహాబాదు వెళ్ళుతాడు.

'మీకు ఎలానూ ఒక దాసీ కావాలి; నన్ను వెంట రానివ్వండి.' అని చంద్రముఖి పట్టు పట్టింది.

దేవదాసు ఒప్పుకోలేదు:—'ఛీ—నే నంత సిగ్గు విడవలేను' అన్నాడు. చంద్రముఖి ఇక మాట్లాడలేదు. ఆమె తెలివి తక్కువది కాదు. ఈ మాటలోని అర్థం సహజంగానే గ్రహించింది. ఆమెకు ఈ ప్రపంచంలో మిగతావి ఎన్ని ఉన్నా గౌరవం మాత్రం లేదు. ఆమె వెంట ఉంటే, దేవదాసు సుఖపడతాడు కాని సన్మానం పొందలేడు. చంద్రముఖి కాసేపు మౌనంగా ఉండి, కళ్లు తుడుచుకుని—'మళ్లీ మిమ్మల్ని ఎప్పుడు చూడగలను ?' అని అడిగింది.

'చెప్పలేను, కాని నిన్ను మాత్రం నేను బ్రతికుండగా మరచిపోను. నిన్ను చూడాలనే దాహం నా కెప్పుడూ చల్లారదు.'

చంద్రముఖి అతనికి నమస్కరించి ఎడంగాపోయి — 'నాకిదే పదివేలు. ఇంతకంటె ఎక్కువ ఆశించను.' అని మెల్లగా అనుకున్నది.

వెళ్లేటప్పుడు దేవదాసు ఇంకా రెండు వేల రూపాయలు చంద్రముఖి చేతిలో పెట్టి—'దాచుకో, మానవ శరీరాన్ని నమ్మకూడదు. చివరకు నువ్వు ఎటూ కాకుండా పోతావేమో!' అన్నాడు. చంద్రముఖి ఇది కూడా గ్రహించి డబ్బు తీసుకున్నది. తర్వాత కళ్లుతుడుచుకుని—'మీరు నా ఒక్క ప్రశ్నకు జవాబు చెప్పి పోతారా?' అని అడిగింది.

'ఏమిటి ?' అన్నాడు దేవదాసు చంద్రముఖి వంక చూస్తూ.

'మీ ఒంట్లో చెడు జబ్బులు ప్రవేశించా యని మీ వదినె చెప్పింది; నిజమేనా ?'

ప్రశ్న విని దేవదాసు చాలా వ్యథ పడ్డాడు—'వదినె ఏదైనా చెప్పుతుంది; కాని ఉంటే నీకు తెలియదా ? ఒక్క విషయంలోమాత్రం నువ్వు పార్వతి కంటే మిగులు.'

'బ్రతికాను,' అని చంద్రముఖి ఇంకోమారు కళ్ళు తుడుచుకుని—'అయినా మీరు కొంచెం జాగ్రత్తగా ఉండండి. అసలే మీ వంట్లో బాగా లేదు. ఎప్పుడన్నా పొరపడతా రేమో!' అన్నది.

దేవదాసు జవాబుగా నవ్వాడు. మాట్లాడలేదు.

'ఇంకో భిక్ష—ఒంట్లో ఏమాత్రం బాగా ఉండక పోయినా నాకు—కబురు చేస్తానని మాట ఇవ్వండి.'

దేవదాసు చంద్రముఖి వంక చూస్తూ, తల తిప్పి—'ఎందుకు చేయను అమ్మా!' అన్నాడు.

చంద్రముఖి ఇంకోమాటు నమస్కరించి ఏడుస్తూ ఇంట్లోకి వెళ్ళింది.

* * *

కలకత్తా వదిలిన తర్వాత దేవదాసు కొన్నాళ్ళు అలహాబాదులో ఉన్నాడు. అక్కడ వుంటూ వుండగా ఒకనాడు చంద్రముఖికి ఇలా ఉత్తరం వ్రాశాడు:

'అమ్మా! ఇక ఎప్పుడూ ఎవ్వరినీ ప్రేమించకూడదని నిశ్చయించుకున్నాను. ప్రేమించి ఉత్త చేతులతో తిరిగి రావటం ఎవరికైనా చాలా బాధిస్తుంది. ఆ పైన నాదేనని ప్రేమించ బోవటంకంటే గొప్ప వంచన ఈ ప్రపంచంలో మరొకటి లేదు.'

చంద్రముఖి దీనికి ఏమి జవాబు రాసిందో మనకు అనవసరం. కాని చంద్రముఖిని ఇక్కడకు పిలిస్తే బాగుంటుందని దేవదాసు అప్పుడప్పుడు అనుకుంటూ ఉండేవాడు. మళ్లీ పార్వతికి తెలుస్తుందేమో! అని భయపడుతూ ఉండేవాడు.

ఇలా ఒకమాటు చంద్రముఖీ, మరోమాటు పార్వతీ అతని హృదయ రాజ్యంలో నివసిస్తూ ఉండేవారు. ఎప్పుడన్నా వారిద్దరి ముఖాలూ—వారికి ఎంతో స్నేహ మున్నట్టుగా—అతని హృదయ పటం మీద దగ్గర దగ్గరగా అంకిత మయ్యేవి; కలుసుకు పోయేవి. ఒక్కొక్కప్పుడు దేవదాసుకు వారిద్దరూ నిద్రపోతున్నారా, అని అనిపించేది. ఆ సమయంలో అతని హృదయం శూన్యంగా ఉండేది; నీరసంగా ఉండేది. ఏదో ఒక జీవంలేని అసంతృప్తి మిధ్యా ప్రతిధ్వనివలె అతని మనస్సులో తిరుగుతూ ఉండేది.

దేవదాసు అక్కడి నుంచి లాహోరు బయలుదేరాడు; చున్నీలాలు అక్కడనే ఉద్యోగం చేస్తున్నాడు. అతను ఉండేచోటు తెలుసుకుని ఇంటికి వెళ్లాడు. చాలాకాల మైనాక మిత్రులు ఒకరినొకరు చూచుకుని సిగ్గుపడ్డారు; సంతోషపడ్డారు. మళ్లీ దేవదాసు సురాదేవిని ఆరాధించాడు.

దేవదాసుకు చంద్రముఖి మద్యం అంటుకోవద్దని హెచ్చరించిన సంగతి జ్ఞాపకం వచ్చేది. 'ఆమె ఎంత తెలివికలది, ఎంత ధైర్యం కలది!' అని అతను అనుకునేవాడు. పార్వతి ఇప్పుడు నిద్రపోతున్నది; ఆరిపోయే ముందు దీపం మాదిరిగా ఎప్పుడన్నా భగ్గున వెలిగేది.

మధ్య మధ్య దేవదాసుకు జబ్బు చేస్తున్నది; పొట్టలో నొప్పిగా ఉన్నట్టు ఉండేది. ఒకనాడు ధర్మదాసు ఏడుస్తూ—'మీకు మళ్లీ జబ్బుచేస్తుంది; ఎక్కడికన్నా వెళ్లుదాము పదండి బాబుగారూ!' అన్నాడు.

దేవదాసు అన్యమనస్కంగా—'అలాగే వెళ్దాము' అన్నాడు.

దేవదాసు బసలో ఉండగా మద్యం తాగేవాడుకాడు. ఎప్పుడయినా చున్నీలాలు వస్తే తాగేవాడు; లేకపోతే బయటకు వెళ్ళి పోయేవాడు. తెల్లవారుతూ ఉండగా బసకు వచ్చేవాడు; ఒకో రోజున వచ్చేవాడు కాదు. ఇవ్వాళకు రెండు రోజులనుంచి ఇంటికి రాలేదు. ధర్మదాసు ఈ రెండు రోజులు అన్నం నీరూ ఎరగడు; ఏడుస్తూనే ఉన్నాడు. మూడోనాడు దేవదాసు పుట్టెడు జ్వరంతో వచ్చాడు. ఆ పడక పడక కొన్నాళ్లపాటు లేవలేదు. ముగ్గురు నలుగురు డాక్టర్లు వచ్చి చికిత్సచేయ నారంభించారు.

'అమ్మగారికి కబురు చేయనా, బాబూ!' అని ధర్మదాసు అడిగాడు.

తల్లి కాశీలో ఉంటున్నది.

'వద్దు ధర్మా! నేను ఈ స్థితిలో తల్లికి ముఖం ఎలా చూపించగలను!'

'రోగాలూ కష్టాలూ అందరికీ వస్తాయి. ఇలాంటి ఆపదలోకూడా తల్లికి తెలుపకుండా ఉండటమా? మీరు బిడియపడకండి బాబుగారూ, కాశీ వెళ్దాము.'

దేవదాసు ముఖం తిప్పుకుని—'ఇప్పుడు కాదులే ధర్మా, నయమయినాక చూసుకుందాం.' అన్నాడు.

ధర్మదాసు ఒకమాటు చంద్రముఖిని జ్ఞాపకం చేద్దామా అనుకొన్నాడు. కాని అతనికి చంద్రముఖి అంటే అసహ్యం. అంచేత ఆ పేరు ఎత్తలేదు.

దేవదాసుకూడా ఈ సంగతి చాలాసార్లు అనుకున్నాడు. కాని బయట పెట్టటానికి ఇష్టం లేదు. అందుకని ఈ ఊసు ఎవ్వరూ తేలేదు. తర్వా

దేవదాసుకు నెమ్మదిగా ఆరోగ్యం కలిగింది. ఒకనాడు ధర్మదాసుతో 'ధర్మా ఎక్కడికన్నా మళ్లీ వెళ్దామా ?' అన్నాడు.

'ఎక్కడకు వెళ్ళినా లాభంలేదు బాబూ ; ఇంటికన్నా, తల్లిగారి దగ్గర కన్నా వెళ్దాము పదండి.' అన్నాడు ధర్మదాసు.

సామానంతా కట్టి చున్నీలాలు దగ్గర సెలవు తీసుకుని దేవదాసు మళ్ళీ అలహాబాదు వచ్చాడు. ఒంట్లో బాగా ఆరోగ్యంగానే ఉన్నది. ఇక్కడ కొన్నాళ్ళు గడపినాక—'ధర్మా, ఏదన్నా కొత్తచోటుకు పోకూడదా ? బొంబాయి నే నెప్పుడూ చూడలేదు వెళ్దామా ?' అన్నాడు ధర్మదాసుతో.

తనకు ఇష్టం లేకపోయినా, దేవదాసు పట్టుదలచూసి, ధర్మదాసు ఒప్పుకున్నాడు. అది జ్యేష్టమాసం బొంబాయిలో ఎండలు అంత విశేషంగాలేవు. దేవదాసు ఇక్కడకు వచ్చినాక బాగుపడ్డాడు. కొన్నాళ్ళు గడిచినాక ధర్మదాసు—'ఇక యింటికి వెళ్ళకూడదా బాబూ ?' అని దేవదాసును అడిగాడు.

'ఇప్పుడు వద్దు. నా కిక్కడే బాగుంది. కొన్నాళ్ళపాటు ఉంటాను.' అన్నాడు దేవదాసు.

* * *

ఒకసంవత్సరం గడిచింది. భాద్రపదమాసంలో ఒకనాటి ఉదయాన దేవదాసు ధర్మదాసుభుజంమీద భారంవేసి బొంబాయిలోని ఒక ఆసుపత్రి నుంచి బసకు తిరిగివచ్చాడు.

'ఇప్పుడైనా అమ్మదగ్గరికిపోవటం మంచిదనుకుంటా బాబూ!' అన్నాడు ధర్మదాసు.

దేవదాసు కళ్లల్లో నీరు తిరిగింది. కొన్నాళ్ళనుంచి అతనికి ఎప్పుడూ తల్లి జ్ఞాపకం వస్తున్నది. ఆస్పత్రిలో పండుకుని అత నెప్పుడూ—'ఈ ప్రపంచంలో నాకు అందరూ ఉండి కూడా ఎవ్వరూ లేరు! తల్లి ఉన్నది, అన్న ఉన్నాడు, సోదరికంటేకూడా ,ముఖ్యమైన పార్వతి ఉన్నది—చంద్రముఖి ఉన్నది, అందరూ ఉన్నారు. కాని, నేనే ఎవరికీ కాను!' అని అనుకుంటూ ఉండేవాడు.

'అయితే తల్లిదగ్గరకే పోవటం స్థిరపరిచారా బాబూ?' అన్నాడు ధర్మదాసు ఏడుస్తూ. దేవదాసు ముఖంచాటు చేసుకుని కళ్లు తుడుచుకున్నాడు.

'లేదు ధర్మా! తల్లికి ముఖం చూపించాలని లేదు. బహుశా ఆ ఘడియ ఇంకా రాలేదనుకుంటాను.'

వృద్ధ ధర్మదాసు వెక్కి-వెక్కి ఏడుస్తూ—'ఇంకా తల్లి బ్రతికే ఉందిగా బాబూ!' అన్నాడు.

ఈమాటలో ఉన్న ధ్వని ఇద్దరూ పూర్తిగా గ్రహించారు.

దేవదాసు స్థితి నానాటికీ తీసికట్టుగా ఉన్నది. ప్లీహమూ కాలేయమూ పొట్టనంతా కమ్మివేసినవి; ఆ పైన దగ్గూ జ్వరమూ. శరీరం నల్ల బడింది. ఎముకలు లెఖ్ఖపెట్ట వచ్చును. కళ్ళు పీక్కుపోయినవి—కాని అస్వాభావిక మైన తెలుపుతో తళతళ మెరసిపోతున్నవి. తల వెంట్రుకలు పీచుమాదిరిగా లేచినవి—ప్రయత్నిస్తే లెఖ్ఖకూడా పెట్టవచ్చు. చేతి వేళ్ళ వంక చూస్తే అసహ్యంకూడా వేస్తున్నది—అసలే ఎండుకు పోయినవి; పైన పొడలు.

స్టేషను దగ్గరికి వచ్చినాక—'టిక్కెట్టు ఏక్కడికి తీసుకో మంటారు, బాబూ!' అని ధర్మదాసు అడిగాడు.

దేవదాసు కొంచెం ఆలోచించి—'ముందు ఇంటికి పోదాము పద, తర్వాత ఆలోచించుకోవచ్చు' అన్నాడు.

హుగ్లీకి టిక్కెట్లుతీసుకుని బండిరాగానే ఎక్కారు. ధర్మదాసు, దేవదాసుదగ్గరే ఉన్నాడు. సాయంకాలానికి కళ్లు మంటలతోపాటు దేవదాసుకు మళ్ళి జ్వరం వచ్చింది.

'ఇక యింటికి చేరేదాకాకూడా నమ్మకంలేదు ధర్మా!' అన్నాడు దేవదాసు.

'అలా అంటారేం బాబూ!' అన్నాడు ధర్మదాసు భయపడుతూ.

దేవదాసు నవ్వు తెచ్చుకోవాలని వృధా ప్రయాసపడి—'మళ్ళీ జ్వరం వచ్చింది, ధర్మా' అన్నాడు.

రైలు కాశీదాటి ఇంకా కొంతదూరం పోయేవరకూ, దేవదాసు వళ్ళు తెలియకుండానే పడివున్నాడు. పాట్నా సమీపంలో అతనికి తెలివివచ్చింది.

'అనుకున్నంతా ఐంది ధర్మా. అమ్మను చూడటం నిజంగానే పడలేదు!' అన్నాడు దేవదాసు.

'ముందు పాట్నాలో దిగండిబాబూ, ఎవరన్నా డాక్టరికి చూపిద్దాం.'

'ఇక్కడ వద్దు ధర్మా, ముందు ఇంటికి పోదాం పద.'

బండి 'పాండువా' స్టేషనుకు వచ్చేవరకు తెల్లవారింది. రాత్రంతా వర్షం కురిసి అప్పుడే వెలిసిన లక్షణాలు కనపడుతున్నవి. దేవదాసు లేచినిలబడ్డాడు. ధర్మదాసు ఇంకా నిద్రపోతూ ఉన్నాడు. దేవదాసు నెమ్మదిగా అతని ముఖాన చెయ్యి పెట్టాడు, కాని అతన్ని లేపటానికి బిడియపడి మెల్లగా తలుపు తెరచి బండి దిగాడు. నిద్రిస్తూ ఉన్న ధర్మదాసుతో సహా బండి ముందుకు సాగింది.

వణుకుతూ వణుకుతూ దేవదాసు స్టేషనుదాటి, ఒక గుర్రపుబండి వాణ్ణి పిలిచి—'హాతీపోతాకు బండి కడతావా?' అని అడిగాడు.

వాడొకమాటు దేవదాసు ముఖంవంక చూసి, కాసేపు, దిక్కులు పరికించి — 'రాస్తా మంచిదికాదుబాబూ, వర్షాకాలంలో గుర్రపుబండి అక్కడికి పోలేదు.' అన్నాడు.

దేవదాసు ఉద్విగ్నుడై...'పల్లకీ దొరుకుతుందా?' అని అడిగాడు.

'దొరకదు బాబూ!'

అయితే ఇక పోవటం పడదా? అనే సందేహంతో దేవదాసు కూర్చొబడినాడు. అతని ముఖంమీద, మృత్యుచిహ్నాలు అచ్చు గుద్దినట్టుగా కనబడుతున్నవి—గుడ్డివాడుకూడా చదవగలడు; బండివానికి జాలి వేసింది.

'ఎడ్లబండి మాట్లాడి పెట్టమంటారా, బాబూ?' అని అడిగాడు.

'ఎప్పటికి చేరుతుంది?'

'దోవ సరిగాలేదు బాబూ, రెండురోజులు పట్టుతుం దనుకుంటాను.

ఇంకా రెండురోజులదాకా నేను బ్రతికి ఉంటానా? అని దేవదాసు మనస్సులో గుణించుకున్నాడు; కాని అతను పార్వతిదగ్గిరికి పోక తప్పదు. చిన్నితనం నుంచీ అతను ఆమెతో ఆడిన అబద్ధాలన్నీ జ్ఞాపకం వచ్చినవి. కాని ఆఖరుతఫా అతను ఆమెకు యిచ్చిన మాట నెరవేర్చ వలసిందే; ఎలాగైనా

సరే, ఆమెను కడసారి చూపు చూడవలసిందే. కాని జీవితావధి సమీపించింది; ఇదే భయపడవలసిన విషయం!

దేవదాసు ఎడ్లబండి ఎక్కాడు. తల్లి జ్ఞాపకం వచ్చి అతని కళ్ల వెంట నీరు ధారగా కారింది. ఇంకో ముఖంకూడా ఈ అంతిమ దశలో అతనికి మహాపవిత్రంగా కనిపించింది—అది చంద్రముఖిది. పాపిష్ఠురాలని అతను ఎవరినైతే మొదటినుంచీ ఏవగిస్తూ వచ్చాడో, ఆమె ఈనాడు తల్లితోపాటు తలపుకు రావటం చూసి అతని కళ్ళ వెంట అశ్రువులు రాలినవి. ఇక ఈ జీవితంలో ఆమె కనపడదు. బహుశా చాలా కాలం వరకు ఆమె ఈ సంగతే తెలుసుకోలేదు. అయినా అతను పార్వతి దగ్గరికే వెళ్ళాలి! ఇంకోమాటు కనపడతానని అతను మాట ఇచ్చాడు! ఈ మాట తప్పకూడదు; నెరవేర్చవలసిందే!

డొంక బాగా లేదు. వర్షపు నీరు అక్కడక్కడ గుంటల్లో నిల్చి ఉన్నది. ఎక్కడన్నా గళ్ళుకూడా పడినవి. దోవంతా బురద. బండి పూటీల వరకూ దిగబడుతూ ఉన్నది. అప్పుడప్పుడూ బండివాడు దిగి చక్రం ఎత్తివేయవలసి వస్తున్నది; ఎడ్ల తోకలు మెలి వేసి నిర్దయగా కొట్టవలసి వస్తున్నది. ఎన్ని తంటాలు పడైనా సరే, ఈ పదహారు కోసులూ దాటాలి!

రయ్యిమని చలి గాలి వీస్తూ ఉన్నది. ఇవ్వాళ సాయంత్రంకూడా దేవదాసుకు బాగా జ్వరం వచ్చింది. అతను భయపడుతూ—'అబ్బీ ఇంకా ఎంత దూరం ఉంది?' అని అడిగాడు.

'ఇంకా పది కోసు లుంది బాబూ!'

'త్వరగా తీసుకెళ్లు నాయనా! ఎంత డబ్బయినా ఇస్తాను' అని జేబులో నుంచి వంద రూపాయల కాగితం ఒకటి తీసి — 'వంద రూపాయలిస్తాను దబ్బున చేర్చు' అన్నాడు.

తర్వాత దేవదాసుకు ఆ రాత్రి ఏవిధంగా గడిచిందో తెలియ లేదు. ఒళ్ళు తెలియకుండా పడిపోయినాడు. ఉదయం తెలివి రాగానే—'అబ్బీ, ఇంకా ఎంత దూర ముంది?' అని అడిగాడు.

'ఇంకా ఆరు కోసులు బాబూ!'

దేవదాసు నిట్టూర్చి—'కాస్త త్వరగా తీసుకెళ్ళు నాయనా, నాకిక వ్యవధి లేదు. గడువు సమీపించింది' అన్నాడు.

బండివానికి ఏమీ అర్థం కాకపోయినా, నూతనోత్సాహంతో ఎడ్లను బూతులు తిడుతూ అదలింప నారంభించాడు. ఎడ్లు శక్తి కొలదీ నడుస్తున్నవి! లోపల దేవదాసు మహా వ్యాకుల పడుతున్నాడు. అతనికి ఒకటే ఆలోచన—చూడటానికి పడుతుందా ? చేరగలనా ? అని.

మధ్యాహ్నం బండివాడు బండిని ఆపి ఎడ్లను విప్పి మేత వేశాడు. చద్దిమూట విప్పి తాను భోంచేయటానికి కూర్చుని 'బాబుగారూ, మీరేమీ తినరా ?' అని దేవదాసును అడిగాడు.

'తినను అబ్బీ, కాని చాలా దాహం వేస్తున్నది. కాసిని మంచినీళ్లు తెచ్చి పెట్టగలవా ?'

బండివాడు డొంక పక్కన ఉన్న చెరువుకుపోయి నీళ్ళు తెచ్చియిచ్చాడు.

ఇవ్వాళ సాయంత్రం జ్వరంతోపాటు దేవదాసు ముక్కులోనుంచి ఒక్కొక్క బొట్టు నెత్తురుకూడా పడ నారంభించింది. అతను ప్రాణాలన్నీ ఒడ్డి ముక్కు బిగించి పట్టుకున్నాడు. తర్వాత పళ్ళ చిగుళ్ళలోనుంచి రక్తం రావటానికి ప్రయత్నిస్తున్నట్టుగా అతనికి తోచింది. కొంచెం ఎగశ్వాసకూడా పుట్టింది.

దేవదాసు ఆయాసంతో—'ఇంకా ఎంత దూరముంది ?' అని బండివాణ్ణి అడిగాడు.

'ఇంకా రెండు కోసులు, రాత్రి పది గంటలకు చేరతాము.'

దేవదాసు చాలా కష్టంతో తల ఎత్తి దోవవంక చూసి—'భగవంతుడా!' అన్నాడు.

'ఎందుకలా అంటారు బాబూగారూ ?' అన్నాడు బండివాడు.

దేవదాసు ఈ ప్రశ్నకు జవాబివ్వలేక పోయినాడు. బండి సాగి పోతూనే ఉన్నది. కాని అతను చెప్పినట్టు పది గంటలకు కాకుండా రాత్రి పన్నెండు గంటలకు పాతిపోతా జమీందారుగారి దేవిడీ ముందున్న రావిచెట్టు క్రింద ఆగింది.

'దిగండి బాబూగారూ !' అని బండివాడు దేవదాసును పిలిచాడు.

జవాబులేదు. మళ్ళీ పిలిచినా మారులేదు. అప్పుడు వాడు భయపడి దేవదాసు ముఖం దగ్గరికి దీపం తీసుకువచ్చి—'నిద్ర పోతున్నారా బాబుగారూ !' అన్నాడు.

దేవదాసు చూస్తూనే ఉన్నాడు. పెదవులు కూడా కదిలించాడు. కాని మాట మాత్రం బయటికి రాలేదు.

'ఓ బాబుగారూ !' అన్నాడు మళ్ళా బండివాడు.

దేవదాసు చెయ్యి ఎత్తాలనుకున్నాడు; కాని లేవలేదు. అతని కను కొలకుల వెంట రెండు అశ్రు బిందువులు జారినవి. బండివాడు అప్పుడు తన బుద్ధి నంతా వినియోగించి రావిచెట్టు చుట్టూ కట్టిన దిమ్మెమీద గడ్డితో పక్క పరిచాడు. తర్వాత చాలా ప్రయాసతో దేవదాసును ఎత్తి దానిమీద పండుకో బెట్టాడు.

బయట ఒక పురుగుకూడా లేదు. జమీందారుగారి ఇల్లు, నిశ్శబ్దంగా నిద్రిస్తూ ఉంది. దేవదాసు మహా కష్టంతో జేబులోనుంచి వందరూపాయల కాగితం తీసి బండివానికి ఇచ్చాడు. దేవదాసు తన వంకనే చూస్తూఉండటం, ఆ లాంతరు వెలుతురులో బండివాడు చూశాను. కాని అతనేమీ చెప్పలేకుండా ఉన్నాడు. అతని స్థితి గ్రహించి బండివాడు నోటు బొడ్డున కట్టుకున్నాడు; శాలువా దేవదాసు గొంతువరకూ కప్పినాడు. లాంతరు, ఎదుటనే వెలుగుతూ ఉంది. కొత్త మిత్రుడు దేవదాసు కాళ్లదగ్గర కూర్చుని ఆలోచిస్తున్నాడు.

తెల్లవారింది. జమీందారు ఇంట్లోనుంచి మనుష్యులు బయటకు వచ్చి ఈ దృశ్యం చూసి విస్తు పోయినారు:—చెట్టుక్రింద ఎవరో మనిషి చనిపోతున్నాడు. ధనవంతుడు ! ఒంటిమీద విలువగల శాలువా, కాళ్ళను తళ తళ మెరిసే బూట్లూ ! ఒక్కరొక్కరే చాలామంది పోగయారు. క్రమంగా ఈ సంగతి భువనబాబు చెవిదాకా పోయింది. ఆయన డాక్టరుకు కబురు చేసి అక్కడకు వచ్చాడు.

దేవదాసు ఒక్కమాటు అందరి వంకా చూశాడు. కాని అతనికి మాటలు పడిపోయినవి. ఏమీ చెప్పలేక పోయినాడు. కళ్ళ వెంట మాత్రం నీరు కారుస్తున్నాడు. బండివాడు తనకు తెలిసినంత వరకు చెప్పాడు కాని అందు వల్ల ఏమీ ఆచూకీ చిక్కలేదు.

ఇంతలో డాక్టరువచ్చి—'ఎగశ్వాస పుట్టింది, ఇక లాభం లేదు' అని తేల్చాడు.

'అయ్యో, పాపం!' అన్నారు అక్కడ ఉన్నవారంతా.

మేడపైన కూర్చున్న పార్వతి కూడా ఈ సంగతి విని—'అయ్యో పాపం!' అన్నది.

ఏవరో పుణ్యాత్ముడు దయదలచి దేవదాసు నోట్లో ఒక నీటిబొట్టు వేశాడు. దేవదాసు అతని వంక కరుణా దృక్కులతో చూశాడు. అంతే, ఆ తర్వాత కళ్ళు మూయటం ఇక తెరవనే లేదు.

ఇక ఎవరు దహనం చెయ్యాలి అనే ప్రశ్న కలిగింది. ఎవరు అంటు కుంటారు? ఏ జాతి అనే సమస్య మీద కాసేపు చర్చ జరిగింది. భువనబాబు దగ్గర ఉన్న పోలీసు స్టేషనుకు కబురు చేశాడు. ఇన్‌స్పెక్టరు వచ్చి రిపోర్టు రాసుకో నారంభించాడు.

ప్లీహం, కాలేయం పెరగటంవల్ల మృత్యువు; ముక్కూ నోటా నెత్తురు డాగులు; జేబులో రెండు ఉత్తరాలు దొరికినవి. ఒకటి తాల్‌సోనాపురంలో ఉన్న ద్విజదాసు ముఖర్జీ బొంబాయిలో ఉన్న దేవదాసు ముఖర్జీకి రాశాడు- 'ఇక డబ్బు పంపటం అసంభవం' అని, రెండవది కాశీలో ఉన్న హారిమతీదేవి దేవదాసు ముఖర్జీకి, 'ఎలా వున్నావు?' అని రాసింది. కుడిచేతిని అతని పేరు ఇంగ్లీషు పొడి అక్షరాల్లో పచ్చ పొడిచి ఉన్నది. ఇన్‌స్పెక్టరు ఇవన్నీ పరీక్షించి, అతను తప్పక దేవదాసే నని తేల్చాడు.

వ్రేలిని ఒక నీలం తాపిన ఉంగరం—ధర షుమారు 150 రూపాయలు, శాలువాలు రెండు—ధర రెండువందల రూపాయలు, ఇంకా చొక్కా ధోవతీ—ఇన్‌స్పెక్టరు ఇవన్నీ లెక్క రాసుకున్నాడు.

భువనబాబూ మహేంద్రుడూ అక్కడనే ఉన్నారు. తాల్‌సోనాపురం

మాట విని మహేంద్రుడు—'పిన్నిది ఆ ఊరే. ఆమె చూస్తే—'అన్నాడు.

'ఇక్కడ శవాన్ని గుర్తించటానికి వస్తుందా. ఏమిటి మీ పిన్ని?' అని భువనబాబు మహేంద్రుని గద్దించాడు.

'చాదస్తుడంటే ఇలాంటివాడే!' అన్నాడు ఇన్స్పెక్టరు నవ్వుతూ.

బ్రాహ్మణుని శవమైనా ఆపల్లెటూళ్లో అగ్రజాతుల వారెవరూ దహనం చేయటానికి ఇష్టపడ లేదు, వెట్టివాళ్లు వచ్చి కట్టుకు పోయారు. వాళ్ళు ఆ శవం సరిగ్గా తగలబడక ముందే వదలిపెట్టి వెళ్ళిపోయారు. కాకులూ, గద్దలూ వచ్చి శవం మీద వాలినవి. కుక్కలూ నక్కలూ శవం కోసం కీచులాడినవి. అప్పుడు కూడా విన్న వాళ్ళంతా 'అయ్యో పాపం!' అన్నారు.

దివాణంలో ఉన్న దాస దాసీ లందరూ ఈ సంగతే చెప్పుకో నారంభించారు:

'అయ్యో పాపం, కులీనుడు, ధనవంతుడు, రెండువందల రూపాయల శాలువాలూ, నూటయాభైరూపాయల ఉంగరం. అన్నీ ఇన్స్పెక్టరుగారి దగ్గరే ఉన్నాయి. ఉత్తరాలు రెండూకూడా వారే తీసుకు వెళ్ళారు.'

ఈ సంగతి పార్వతికి ఉదయమే తెలిసింది. కాని ఇప్పుడామె ఏ విషయంలోనూ అంతగా కుతూహలం చూపించటం లేదు; అందువల్ల వివరాలు తెలుసుకోలేదు. కాని ప్రతివాళ్ళ నోటా ఈ మాట వింటూ ఉండటం చేత పార్వతి సాయంత్రం ఒక దాసీని పిలిచి—'ఏమిటే సంగతి? చచ్చింది ఎవరు?' అని అడిగింది.

'అయ్యో! ఎవరికి తెలుసు తల్లీ, పూర్వజన్మలో ఈగడ్డను కొని ఉంటాడేమో' అందుకనే ఇక్కడకు మట్టి కావడానికి వచ్చాడు. చలిలో మంచులో రాత్రంతా ఇక్కడే పడి ఉన్నాడు. ఇవ్వాళ తొమ్మిది గంటలకు చచ్చి పోయాడు.'

పార్వతి నిట్టూర్చి—'అయ్యో పాపం! ఇంతకూ అతనెవరో తెలియనే లేదా?' అని అడిగింది.

'చిన్నబాబు గారికి అంతా తెలుసును. నాకు బాగా తెలియదమ్మా.

మహేంద్రునికి కబురు చేస్తే అతను వచ్చి—'మా ఊరువాడే. దేవదాసు ముఖర్జీ' అని చెప్పాడు.

పార్వతి మహేంద్రుని దగ్గరకు వచ్చి అతనివంక తీవ్రంగా చూస్తూ—'ఎవరూ? దేవదాదా? ఎలా తెలుసుకున్నావ్?' అన్నది.

'జేబులో రెండు ఉత్తరాలు దొరికాయి. ఒకటి ద్విజదాసు ముఖర్జీ రాశాడు—'

'ఆఁ. అతను అన్న' అన్నది పార్వతి మధ్యనే అడ్డి.

'ఇంకో ఉత్తరం కాశీనుంచి హరిమతీదేవి రాసింది—'

'ఆఁ. ఆమె తల్లి.'

'చేతిమీద పేరు పచ్చ—'

'ఆఁ. మొట్టమొదట కలకత్తా వెళ్ళినప్పుడు పొడిపించుకున్నాడు.'

'వేలిని ఒక నీలం ఉంగరం—'

'ఆఁ, వడుగునాడు పెదబాబు ఇచ్చాడు. ఇక నేను వెళ్తాను?' అంటూ పార్వతి చకచక పైనుంచి దిగింది. మహేంద్రునికి ఏమీ పాలు పోలేదు.

'పిన్నీ యెక్కడకు వెళ్ళుతున్నావు?' అని అడిగాడు.

'దేవదాసు దగ్గరకు.'

'అతను లేడు. ఎప్పుడో వెట్టివాళ్ళు తీసుకువెళ్ళారు.'

'అమ్మో, నాయనో!' అని అరుస్తూ పార్వతి పరుగెత్త నారంభించింది. మహేంద్రుడు అడ్డి—'నీ కేమన్నా పిచ్చా, అమ్మా! ఎక్కడికివెళ్తావు?' అన్నాడు.

పార్వతి మహేంద్రునివంక తీక్ష్ణంగాచూసి-'మహేన్! నేను పిచ్చిదాన్ని అనుకొంటున్నావా? దోవ వదులు' అని గద్దించింది.

ఆమె కళ్లుచూసి మహేంద్రుడు దోవ వదిలి ఆమె వెనువెంటనే పో నారంభించాడు. పార్వతి బయటకు వచ్చేసింది. అప్పుడు కచ్చేరీలో గుమాస్తాలూ ముసద్దీలూ, ఇంకా పనిచేస్తూనే ఉన్నారు. వాళ్లంతా ఈమెను చూశారు. చౌదరిగారుకూడా కళ్ళజోడు పైనుంచి చూసి —'ఎవరా వెళ్లేది?' అని అడిగాడు.

'పిన్ని' అన్నాడు మహేంద్రుడు.

'అదేమిటి! ఎక్కడికి పోతున్నది?'

'దేవదాసును చూడటానికి.'

'మీ అందరికీ పిచ్చి ఎక్కిందా ఏమిటి? పట్టుకోండి, పట్టుకోండి. పిచ్చి ఎక్కింది! ఓ మహేన్!' అని భువన చౌదరి చీత్కారం చేశాడు.

తర్వాత దాసదాసీలందరూ కలిసి పార్వతి మూర్ఛిత దేహాన్ని ఇంట్లోకి తీసుకుపోయారు. పార్వతికి మర్నాడు స్మృతి వచ్చింది. కాని యెక్కువ మాట్లాడలేదు. ఒక దాసీని పిలిచి—'రాత్రి రాలేదా? రాత్రంతా!' అని మాత్రం అడిగింది.

అంతే. పార్వతి ఇక మాట్లాడలేదు.

* * *

ఇప్పుడు, ఇంతకాలమైనాక పార్వతి ఏమయిందో యెలా ఉన్నదో నాకు తెలియదు. తెలుసుకోవాలనే కోరికకూడా లేదు నాకు. దేవదాసునుగురించే నాకు చాలా దుఃఖంగాఉంటుంది. ఈ కథ చదివితే, బహుశా, మీకు కూడా నా మాదిరిగానే దుఃఖం కలగవచ్చు. అయినా, దేవదాసువంటి దౌర్భాగ్యులతో, నిగ్రహం లేనివారితో, పాపిష్టులతో యెప్పుడైనా మీకు పరిచయం కలిగితే, వాళ్ళకోసం మీరు కొంచెం ప్రార్థించండి. కనీసం అతనివంటి చావు మాత్రం యెవ్వరికీ రాకూడదని కోరండి! మరణంవల్ల పెద్ద నష్టమేమీ లేదు. కాని, ఆ సమయంలో ప్రేమపూరితమైన కరస్పర్శ లలాటానికి సోకాలి; ఆఖరికి, ఒకటైనా కరుణాపూరితముఖాన్ని చూస్తూ ఈ జీవితం అంతం కావాలి; చివరికి ఒక్కరి కంటినుంచైనా కన్నీటిబిందువు రాలటం చూసి ప్రాణాలు వదలాలి. చాలు, ఇంతకంటే పెద్దకోరికలు అనవసరం!

శరత్ చంద్రుని నవలలు

చక్రపాణి అనువాదం

పల్లీయులు

పల్లీయుల అజ్ఞానము, దానివల్ల వారు చేసే అన్యాయాలూ, వాటివల్ల కలిగే అనర్థాలూ చక్కగా చిత్రింపబడినవి.

పరిణీత

స్త్రీకి ఒక్కమాటే పెళ్లి, దానికి మంత్ర తంత్రాలతో అవసరంకూడా ఉండదు—అని నమ్మిన ఒక బాలిక చరిత్ర.

బడదీదీ

ప్రణయ మధుర విషాదగాథ!

పతివ్రత

'నిర్మల' శాస్త్రోక్త పతివ్రత! ఎండ కన్నెరగదు. భర్త పాదోదకం త్రాగంది ఏమీ భుజించదు - కాని ఇలాంటి పతివ్రత భర్త ప్రాణాలను కొరకగలదా? అతని జీవితాన్ని నరకం చేయగలదా? — చదివి చూడండి.

యువ బుక్ డిపో

43, ఆచారప్పన్ స్ట్రీట్

జి. టి. మద్రాసు :: తెనాలి

మా ఏజంట్లు

వెంకటరామా అండ్ కో.	...	మద్రాసు, బెజవాడ, తెనాలి, రాజమండ్రి, గుంటూరు, సికిందరాబాదు, కర్నూలు, తాడేపల్లిగూడెం ఏలూరు.
గుప్త బ్రదర్స్	...	విశాఖపట్టణం. విజయనగరం
కాకినాడ	...	రామమోహన్ అండ్ కో. వి. తిరుపతయ్య
రాజమండ్రి	...	ఈశ్వర బుక్ డిపో. ది ఓరియంటల్ పబ్లిషింగ్ కంపెనీ.
ఏలూరు	...	ది నేషనల్ బుక్ డిపో.
బెజవాడ	...	పి. ఆర్. అండ్ సన్సు. మోడరన్ న్యూస్ ఏజన్సీ. వెరైటీ న్యూస్ ఏజన్సీ.
గుడివాడ	...	మూర్తి బ్రదర్స్.
బందరు	...	మినర్వా బుక్ డిపో.
గుంటూరు	...	రావు బ్రదర్స్.
తెనాలి	...	ది న్యూ వెరైటీ ఏజన్సీస్. ఆంధ్రా బుక్ డిపో.
అనంతపురం	...	ఏ. కృష్ణమూర్తి. టి. నాగిరెడ్డి
హైదరాబాద్	...	ఆంధ్రా బుక్ హౌస్.
బరంపురం	...	జూపిటర్ న్యూస్ ఏజన్సీ.

యువ ప్రచురణాలు

హిగ్గిన్‌బాథమ్సు బుక్‌స్టాల్సు
అన్నిటిలోనూ దొరుకుతై

పాఠకులకు విన్నపము

మా ప్రచురణలు ముఖ్యమయిన పుస్తక విక్రేతలు, న్యూసు ఏజంట్లు అందరివద్దా దొరకును. ఒకవేళ దొరకనిచో మాకు వ్రాసి తెప్పించుకొనవచ్చును. 6-0-0 విలువగల పుస్తకములు ఒకేమాటు తెప్పించుకొనువారికి పోస్టుఖర్చులు మేమే భరిస్తాము.

1.	పాపం!!!	(కథలు)	'చలం'	0-12-0
2.	హంపీ కన్యలు	(నవల)	,,	0-12-0
3.	అరుణ	,,	,,	0-12-0
4.	బ్రాహ్మణీకం	,,	,,	0-12-0
5.	అనాథలు	,,	సొరీన్	0-12-0
6.	మారుపేర్లు	,,	కుటుంబరావు	0-12-0
7.	కులంలేని మనిషి	,,	,,	0-12-0
8.	బడదీదీ	,,	శరత్‌బాబు	0-12-0
9.	పతివ్రత	,,	,,	0-12-0
10	పల్లీయులు	,,	,,	1-8-0
11.	దేవదాసు	,,	,,	1-8-0
12.	పరిణీత	,,	,,	0-12-0
13.	తోకచుక్క	(కథలు)	'చక్రపాణి'	0-12-0
14.	పాతమంగలి	,,	,,	0-12-0
15.	బనఫూల్ రచనలు	,,	,,	0-12-0
16.	పరశురాం కథలు	,,	,,	0-12-0
17.	ప్రగల్భప్రేతము	,,	,,	0-12-0
18.	పాంచజన్యం	,,	,,	0-12-0
19.	మూగజీవాలు	,,	గోఖలే	0-12-0
20.	కదంబం	,,	నార్ల	0-12-0
21.	రూం టు లెట్	,,	బాలక్రిష్ణశాస్త్రి	0-12-0
22.	మంగమ్మ	(నాటకం)	'చలం'	1-0-0
23.	పలితకేశము	(కావ్యం)	దువ్వూరి	1-0-0
24.	కదలి పొంగులు	,,	సముద్రుడు	1-0-0

యువ బుక్ డిపో: మద్రాసు

క్రొత్త ప్రచురణలు

కొడవటిగంటివారి నవల

బెంగాలీ కథల సంపుటి

మా. గోఖలేగారి కథలు

దువ్వూరి రామిరెడ్డిగారి కావ్యము

చలంగారి నాటకం

యువ బుక్ డిపో మద్రాసు & తెనాలి

YUVA ...... PUBLICATION

... DEVADOSS by SARATBABU